
# ఆంధ్రభూమి

సచిత్ర మాసపత్రిక


ఈ నెల
మినీ నవల



- ఎస్. ఉషాపద్మిని

నేను సిలికాన్ వ్యాలీకొచ్చి నెలరోజులైనా ఆ అమ్మాయి రెండుసార్లు మాత్రమే నాకు కన్పించింది. చూపు తిప్పుకోలేని ఆమె అందం, ఒద్దిక, నిరాడంబరత మొదటి చూపులోనే ఏదో తెలియని ఇష్టం తనపై ఏర్పడేలా చేశాయి.

అసలు మొదటిసారి ఆమె కన్పించింది పదిరోజుల క్రితమే. ఇండియా నుండి ఆఫీసు పనిమీద సిలికాన్ వ్యాలీలోని మా ఆఫీసులో అడుగుపెట్టిన నాకు ఇరవై రోజుల దాకా ఊపిరి కూడా తీసుకునే అవకాశం కలగలేదు.

అసలు నన్ను ఇక్కడికి పంపించిన విషయమే ఇక్కడ పని తొందరగా పూర్తిచేయమని. ఇంతకుముందు ఇక్కడ నా స్థానంలో ఉన్న రాజేష్ పైన లెక్కలేనన్ని ఫిర్యాదులు మా క్లయింట్ కంపెనీల నించి. పని అనుకున్న రీతిలో అనుకున్న టైంలో పూర్తిచేయడం లేదని. అందుకే మా ఆఫీసులో ఎఫిషియెంట్ వర్కర్ అని బిరుదున్న నేను ఇక్కడికి రావలసి వచ్చింది.

నాకెన్నో ఇతర కంపెనీల నుంచి మా ఆఫీసులో ఇచ్చే జీతం కన్నా ఎక్కువ మొత్తం ఇస్తామనే అవకాశాలు వచ్చినా, నాకిన్ని అధికారాలు ఇచ్చిన మా సంస్థను వదిలిపెట్టడం ఇష్టం లేక ఇందులోనే ఉండిపోయాను.

నాకు మా సంస్థ పైన గల బాధ్యత తెలిసిన మా ఎండీ నన్ను బ్రతిమాలి మరీ పంపారు ఇక్కడికి.

వచ్చినరోజు నుంచీ పగలు, రాత్రీ ఎడతెరిపి లేకుండా పనిచేస్తున్నా నా పని పూర్తికాలేదు. పదిరోజుల క్రితం ఇలాగే ఒక సాయంత్రం విపరీతమైన నీరసం, తలనొప్పితో ఉన్న నేను కొంచెం రిలాక్స్ అవుదామని కిటికీ దగ్గరికి వచ్చి కొంచెం సేపు బయట ప్రపంచం చూడడం మొదలుపెట్టాను.

సరిగ్గా అప్పుడే మొదటిసారి కన్పించిందీ అమ్మాయి. చూసిన క్షణంలోనే ఏదో తెలియని ఆకర్షణ నన్ను కట్టిపడేసింది. దాదాపు పదినిముషాలు అలాగే చూస్తూండిపోయాను. కానీ ఆ'అమ్మాయి మాత్రం ఎవరికోసం ఎదురుచూస్తోందో ఆ వ్యక్తి రావడంతో వెళ్ళిపోయింది. నాకు మాత్రం చిత్రంగా మనసంతా ఏదో తేలికైపోయినట్లు అన్పించి చికాకు, నీరసం అన్నీ పోయినట్లు అన్పించింది.

నవ్వుకుంటూ మళ్ళీ నా పనిలో నేను మునిగిపోయాను.

అప్పట్నించీ వీలయినప్పుడల్లా కిటికీ దగ్గరకొచ్చి ఆమె కోసం వెదకడం ఆరంభించాయి నా కళ్ళు. 'ఆమె అసలు ఇక్కడే పనిచేస్తుందా లేక ఎవరికోసమో వచ్చిందా' అంటూ నా మనసు తర్జనభర్జన పడుతున్న క్షణంలో మళ్ళీ ఆమె కన్పించి నా అనుమానం నివృత్తి చేసింది. అంతేకాక తనపైన నా ఆసక్తిని ఇంకా పెంచింది.

ఎప్పుడూ నా పని, నా లోకం తప్ప దేని గురించీ పట్టించుకోని నాకు తనను చూశాక మొదటిసారి తన గురించి తెలుసుకోవాలనీ, స్నేహం చేసుకోవాలనీ అన్పించింది. కానీ అంత ధైర్యం చేయలేదు. తనను చూసిన ప్రతీసారీ నాకు ఆశ్చర్యం కల్గేది. సహజం గానే ఇక్కడ ఆఫీసుల్లో పని ఎక్కువగా ఉంటుంది. ఏం చిన్న తప్పుచేసినా చాలా చీవాట్లు తినాల్సి ఉంటుంది.

అందుకే మెదడుకు పని ఎక్కువ. కానీ ఆమె మాత్రం అలసిపోయినట్లుగా కన్పించేదే కాదు. నాకిదంతా విడ్డూరంగా అన్పించేది. ఎప్పుడూ చిరునవ్వుతో, లైవ్లీగా ఎలా ఉంటుంది చిరాకన్నది లేకుండా అన్పించేది.

ఎందుకంటే ఇండియాలోనే కాదు ఇక్కడ కూడా నాకింద పనిచేసే వాళ్ళు నా గురించి ఏమనుకుంటున్నారో నేను ఊహించగలను. ఒకటి రెండుసార్లు నా చెవిన కూడా పడ్డాయి వారిచ్చిన బిరుదులు. 'పని రాక్షసుడు' అని కొందరంటే 'ఎప్పుడూ కోపంగా చిటపటలాడడం తప్ప ఇంకేం రాదేమో' అని కొందరు. తనకి ఏ ఆనందాలు లేవని మనని కూడా చంపి రాత్రి, పగలు కూడా లేకుండా చేయిస్తున్నాడు పని అని కొందరు అనేవారు.

అదికాదులే ఏ పని ఎంతలో పూర్తికావాలి అన్నది ఈయన చేతుల్లో ఉండదు అది మన ఎం.డి గారు సెట్ చేస్తారు. ఆయన చెప్పిన టైంకి పని పూర్తిచేయించడం ఇతని పని అని కొందరు సానుభూతి చూపిస్తే, అది సరే గానీ చేయించేది కాస్త నవ్వుతూ, మంచిగా చేయించచ్చుగా అనుకునేవారు కొందరు.

నేను ఆర్టిస్టుని కాకపోయినా స్పందించే మనసు నాకుంది. ఆ మనసు ఎదుటివారి చలాకీతనానికి, అందానికి, తెలివికి, సెన్స్ ఆఫ్ హ్యూమర్కి ఎలా స్పందిస్తుందో నాకు మాత్రమే తెలుసు. అందరితోనూ మంచిగా జోవియల్గా ఉండి ఇంతకు మునుపు నేను మోసపోయినది చాలు. అందుకే నా ముఖంలో నవ్వు, నా మాటల్లో జోష్, నాలోని సున్నితమైన ఫీలింగ్స్ ఎవరి కంటపడకుండా జాగ్రత్తపడడం అలవాటు చేసుకున్నాను.

ఇంకా నేను ఇక్కడ కనీసం ఆరునెలలు ఉండాలి. నాకిక్కడ స్నేహితులు ఎవరూ లేరు. ఆఫీసులో నా అసిస్టెంట్ అరవింద్తో కలిసి ఫ్లాట్ షేర్ చేసుకుంటున్నాను. కానీ తనను తన హద్దుల్లో ఉంచడం నాకు అలవాటు. మమ్మల్ని చూసిన ప్రతి ఒక్కరూ అనేది మీరిద్దరూ భిన్నధృవాలు అనే. నేను నా పని పూర్తికాగానే ఇంటిని అంటిపెట్టుకుని ఉంటాను.

నా పుస్తకాలు, నా ప్రపంచం అంతా వేరు. అరవింద్ మాత్రం ఆఫీసు నుంచి బయటపడగానే పూర్తిగా మారిపోతాడు. ఏ మాత్రం చిన్న ఖాళీ దొరికినా అతను నాకు కన్పించడం అరుదు. రోజుకో గాళ్ ఫ్రెండ్తో ఇక్కడికి అక్కడికీ తిరుగుతాడని ఆఫీసులో కొందరంటారు. అది కాకపోయినా అతనికి స్మోకింగ్, డ్రింకింగ్ అలవాట్లున్నాయని నాకు తెలుసు. నేను ఇక్కడికి వచ్చిన కొత్తల్లో నా కోసం ఇంట్లోనే ఉండిపోయేవాడు నన్ను తనతో బయటికి రమ్మని నేను రానంటే.

అప్పుడు కొద్దిగా మాట్లాడుకునేవాళ్ళం. అంత ఇంటెలిజెంట్, అంత హ్యాండ్సమ్గా, చలాకీగా ఉండే అరవింద్ డేటింగ్, డ్రింకింగ్ అంటూ చెడిపోవడం నాకు నచ్చలేదు.

తను కొంత అలవాటయ్యాక తనతో చెప్పాను "అరవింద్ నువ్వెందుకు ఈ విదేశీ అలవాట్లకు అలవాటుపడ్డావు? ఇవన్నీ వదిలేసి హాయిగా మీ తల్లిదండ్రులు చూపించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని హాయిగా జీవితం గడపవచ్చుగా?" అని.

అతను ఆ మాట వినగానే కొంచెం తడబడి "అవును దీపక్. నువ్వన్నట్లు ఇవన్నీ మానకపోతే మా అమ్మానాన్నను మోసం చేసినట్లు అన్పిస్తోంది. కానీ నేను వీటికి ఒకరకంగా బానిసను అయిపోయాను. ఇప్పటిదా?

రెండు ఏళ్ళనుంచి కూరుకున్న ఊబి ఇది. ఊబిలో కూరుకోవడం

తప్పు పైకి రావడం జరగదుగా. అలాగేనేమో ఇంక నా జీవితం అన్పిస్తోంది. కానీ, నేను ఇక్కడికి వచ్చాక నా ఫ్రెండ్సంతా నాకీ అలవాట్లు చేయడానికి ప్రయత్నించారు.

కానీ నీలా మంచిమాటలు చెప్పేవారు ఎవరూ కనబడలేదు. నువ్వు పని విషయంలో సీరియస్‌గా ఉండచ్చేమో. కానీ మనిషిగా మీరు చాలా మంచివారు'' తలదించుకుని అన్నాడు అరవింద్.

"అరవింద్! నీకెవరో సలహా ఇచ్చి సంస్కరించేస్థితిలో నువ్వు లేవు. నువ్వు బాగా చదువుకున్న తెలివైనవ్యక్తివి. ఊబి ఇది అదీ అనక నువ్వు మారే ప్రయత్నం ఎందుకు చెయ్యవు?'' ఈసారి కొంచెం కటువుగానే అన్నాను.

"సారీ దీపక్. నేనేం చెప్పలేను. నాకిప్పటికే డ్రింక్ డోస్ ఎక్కువైంది. గుడ్‌నైట్'' అంటూ తన రూంలోకి వెళ్ళి పడుకున్నాడు. తర్వాత నుంచి నేను చాదస్తంగా సలహాలిస్తున్నాననో, లేక నేను అన్నట్లు మారడం తనకు సాధ్యం కాదనో నన్ను తప్పించుకు తిరగడం మొదలుపెట్టాడు.

అందుకే ఎప్పుడూ ఒంటరిగానే ఉండేవాడ్ని. స్నేహితులే కావాలంటే ఎంతోమంది దొరుకుతారు కానీ నా స్వభావానికి సరిపడ వ్యక్తి కోసం నేను అన్వేషిస్తున్నాను. ఆ అమ్మాయితో స్నేహం చేసుకుంటే బాగుండును అన్పించేది. కానీ నేను ఇదివరకటి దీపక్‌ని కాదు అని గుర్తుకురాగానే డల్‌గా అయిపోయేవాడిని.

నాచుట్టూ నిర్మించుకున్న పంజరం అంత తొందరగా నా దగ్గరకి ఎవరినీ చేరనివ్వదు. ఆ అమ్మాయితో స్నేహం దాదాపు అసాధ్యమే. ఎందుకంటే ఆమె, నేను ఎదురుపడే అవకాశమే లేదు. కావాలంటే తెలుగు సినిమా హీరోలాగా తన కోసం వెయిట్ చేసి దారికాచి స్నేహం చేసుకోవచ్చు. కానీ అది నా స్వభావానికి విరుద్ధం. కనుక మౌనంగా తనను చూడడంతో సరిపెట్టుకుంటే చాలు అనే నిర్ణయానికొచ్చాను.

★ ★ ★

కొన్నిరోజుల తర్వాత ఒక శనివారం రాత్రి ఒంటరిగా ఉన్నాను. అరవింద్ మామూలుగానే ఎక్కడికో వెళ్ళిపోయాడు. మళ్ళీ తను ఫ్లాట్ చేరేది సోమవారం ఉదయం అని నాకు తెలుసు. ఏవీ తినాలనిపించక కాఫీ చేసుకుని తాగుతూ ఏదో పుస్తకం తిరగేస్తున్నాను. ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది.

నాకు ఆశ్చర్యం. ఇంటికి ఈ టైంలో ఎవరొస్తారు? బహుశా ఏ చిన్నపిల్లలో బెల్ మోగిస్తున్నారు అనుకుంటూ నా పుస్తకంలో బుర్ర దూర్చాను.

మళ్లీ బెల్‌మోగింది. ఇంక తప్పదని వెళ్ళి తలుపుతీసిన నేను ఎదురుగా ఉన్న వ్యక్తిని చూడగానే నిర్ఘాంతపోయాను. నువ్వు కలకంటున్నావురా అని నా మెదడు చెప్పింది. నెమ్మదిగా గిల్లుకుని అమ్మో నిజమే అన్నాను నాకు తెలీకుండానే.

"ఏమైంది మీకు?'' అంది తక్కున ఆ అమ్మాయి.

"మీరు కూడా తెలుగువారేనా?'' అన్నాను నేను.

"బయట చాలా చల్లగా ఉంది. లోపలకు రానిస్తారా?'' అంది ఆమె నవ్వుతూ.

నేను కొంచెం సిగ్గుపడి "సారీ ప్లీజ్ రండి కూర్చోండి. ఇప్పుడే వస్తాను'' అని చెప్పి లోపలికి వెళ్ళి 'ఈ అమ్మాయి ఇంత హఠాత్తుగా ఇంటికొచ్చిందేంటి? నేనెలా తెలుసు తనకి. అరవింద్ కోసం వచ్చిందేమో, ఛీ ఛీ నేను అంత ఇష్టపడే ఈ అమ్మాయి ఖచ్చితంగా అలాంటిది అయ్యి ఉండదు' అని ఆలోచిస్తూ కాఫీ చేసి తీసుకొచ్చి ఇచ్చాను.

కాఫీ చూసి కొంచెం మొహమాటపడి "దీపక్ సార్. నా పేరు సరయూ. నేను ఆంధ్రలోని పశ్చిమగోదావరి జిల్లా నుండి వచ్చాను. మీరెక్కడ ఉంటారు?'' అని అడిగింది.

'అబ్బ పేరు సరయూ. తనలాగానే చాలా అందంగా ఉంది' అనుకుంటూ

"మాదీ ఒకప్పుడు ఆ జిల్లానే కానీ మేం ఉంటున్నది హైదరాబాద్'' అన్నాను.

"మీమాట చూస్తేనే అర్థమైంది అండీ. మీరు మా జిల్లావారని. అబ్బ మన జిల్లా చాలా బాగుంటుంది కదండీ. ఆ పచ్చదనం, ఆ ప్రశాంతత'' అంటూ తను గలగలా చెప్తుంటే నాకు ఆ సీన్ చూడముచ్చటగా అన్పించింది. తనకేసి అలాగే చూస్తూ ఉండిపోయాను.

కొద్దిసేపటికే సరయూ తేరుకుని "సారీ అండి. నేనెందుకు వచ్చాను. ఏదో చెప్తున్నాను'' అంది కొంచెం సిగ్గుపడుతూ.

"అసలు నా పేరు అవీ మీకెలా తెలుసు?'' బుర్రలో పురుగులా దొలుస్తున్న నా సందేహం బయటపెట్టాను.

"మీ ఫ్రెండ్ అరవింద్, నా స్నేహితురాలు కేథరీన్ ఫ్రెండ్స్. అరవిందే మీ గురించి చెప్పాడు. ఈరోజు వాళ్లిద్దరూ ఎక్కడికో వెళ్ళిపోయారు. అరవింద్ నన్ను మీదగ్గరకు వెళ్లమని పంపాడు'' అంది సరయూ.

"ఏంటీ?'' తుళ్ళిపడ్డాను.

"నిన్ను..సారీ..మిమ్మల్ని ఇక్కడకు వెళ్లమన్నాడా ఎందుకు?'' అన్నాను సీరియస్‌గా.

"తప్పుగా అనుకోకండి దీపక్. మీరు చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటారని అరవింద్ చెప్పాడు. నేను ఇప్పుడు ...''కొంచెం నసుగుతూ అంది సరయూ.

ఆమె నేను ఎంత ఇష్టపడే వ్యక్తి అయినా కోపం ఆపుకోలేక "త్వరగా చెప్పండి ఏంటీ?'' అన్నాను.

"నాకు ఇప్పుడు ఉద్యోగం చాలా అవసరం అండీ. నేనిప్పుడు పని చేసేచోట నా కాంట్రాక్టు ఈ నెలాఖరుకు అయిపోతుంది. నాకు మీరు ఏదైనా జాబ్ చూపిస్తే అంటే నేను వెతుక్కోకుండా మిమ్మల్ని అడుగుతున్నాను అనుకోవచ్చు. కానీ మీరిక్కడ చాలా తొందరగా చాలా పరపతి సాధించారు అని అరవింద్ చెప్పారు. మీ ద్వారా అయితే మంచి ఉద్యోగం దొరుకుతుందని. నాకిప్పుడు ఉద్యోగం చాలా అవసరం అండీ'' అలా అంటున్నప్పుడు సరయూ గొంతు వణకడం నాకు స్పష్టంగా తెల్సింది.

ఆ మాటలకు తేరుకుని నన్ను నేను తిట్టుకున్నాను.

నన్నెందుకు అందరూ అన్నిమాటలు అంటారో నాకిప్పుడు తెలిసింది. కోపం, తొందరపాటుతనం కొంచెం తగ్గించుకోవాలి అనుకుంటూ "తప్పకుండా సరయూ గారూ. మీకు ఈనెలాఖర్లోగా ఉద్యోగం చూసే బాధ్యత నాది ఇట్స్ మై ప్రామిస్''

"థాంక్సండీ'' అంటూ వెళుతున్న సరయూకి నా మెయిల్ అడ్రస్ ఇచ్చి

"మీ వివరాలు మెయిల్ చెయ్యండి'' అన్నాను. "నేనింక వెళ్తానండీ..'' అంటున్న సరయూతో "ఉండండి నేను వచ్చి దిగబెడ్తాను''

అన్నాను.

"మా ఫ్లాట్ దగ్గరేనండీ వెళ్లగలను" అంది సరయూ.

"రాత్రి కూడా ఒంటరిగా వెళ్లడం ఇక్కడ అమ్మాయిలకు అలవాటే కానీ మన జిల్లాల్లో మగవాళ్లం మేము రాత్రి అమ్మాయిల్ని ఒంటరిగా ఎక్కడికీ వెళ్లనివ్వం అని మీకు తెలియదా?" అన్నాను నవ్వుతూ.

నవ్వి తను సరే అంది. తన ఫ్లాట్ దాకా వెళ్ళి తనను దింపి లోపలకు రమ్మంటే "ఇప్పుడు కాదు" అని వచ్చేశాను.

మాట ఇచ్చినట్లే సరయూకి ఉద్యోగం సంపాదించగలిగాను. ఇంటర్వ్యూ ఏర్పాటుచేశాను.

తను మాత్రం 'ఇంటర్వ్యూ దాకా వస్తే చాలు నేను జాబ్ సంపాదించగలను' అంది. తను కోరుకున్నట్లే జీతం కూడా ఎక్కువే వస్తుందీ ఉద్యోగంలో. 'పాపం ఏం కష్టాల్లో ఉందో జీతం గురించి కూడా చెప్పింది' అనుకున్నాను.

* * *

ఇంటర్వ్యూలో అన్నట్లుగానే ఎంపికయ్యి సరయూ ఉద్యోగంలో చేరిపోయింది.

తను పనిచేసే కంపెనీ మా కాంప్లెక్స్‌లోనే ఉంది. కనుక లంచ్‌బ్రేక్‌లో ఎప్పుడైనా కలిసి మాట్లాడేది. తనతో మాట్లాడిన ప్రతిసారీ ఏదో ఉత్సాహం నాకు వచ్చినట్టుండేది.

కొంతకాలం తర్వాత ఒకరోజు మా ఫ్లాట్‌కొచ్చి బయటకు వెళ్దామని పిల్చింది సరయూ"నేను రాను మరీ అవసరం అయితే గానీ బయటకు వెళ్ళే అలవాటు లేదు" అన్నాను.

"మనిషన్నాక కాస్తంత కళాపోషణ కావాలి. లేకపోతే మనిషికి, గొడ్డుకీ తేడా ఏంటీ?" అంది ముత్యాలముగ్గులో రావుగోపాలరావులా ఫోజుపెట్టి. నాకు తను చెప్పే తీరుకు నవ్వొచ్చినా కొంచెం కోపం కూడా వచ్చింది.

"అంటే నేనీరోజు మీతో బయటకు రానంతమాత్రాన నాకు కళాపోషణ లేదనీ, నేను జంతువుతో సమానం అనీ అర్ధమా?" అన్నాను తీవ్రంగా.

నన్ను అలా చూడగానే సరయూ ముఖం చిన్నబోయింది.

"సారీ దీపక్‌గారూ. ఈ ఒక్కసారి నాతో రండి" అంది బ్రతిమాలుతూ.

ఆమె నా కోపానికి అంతలా భయపడిపోవడం చూసి నా మీద నాకే చికాకు వేసింది.

'ఇంత అందమైన, ఇంత మంచి అమ్మాయిని బాధపెట్టిన గాడిదను నేనొక్కడినే అయి ఉంటాను' అనుకుంటూ గబగబా తయారయ్యి తనతో బయటికి వెళ్ళాను. ముందుగా ఒక బట్టలషాపుకి తీసుకెళ్ళి "మీకిష్టమైన డ్రెస్సు తీసుకోండి" అంది సరయూ.

'ఇంత హడావిడిగా బట్టలు కొనాల్సిన అవసరం ఏంటబ్బా అనుకుంటూ'

"ఎందుకు?" అడిగాను.

"నాకు జీతం వచ్చింది దీపక్. మీకు పార్టీ ఇద్దామని. మీకు ఏదైనా గిఫ్ట్ ఇద్దామనీ అనుకున్నాను. కానీ మీ అభిరుచులు, ఇష్టాలు నాకు తెలీదుగా. మిమ్మల్నే తీసుకొస్తే మంచిదని" అంది సరయూ.

జీతం ఎక్కువ వచ్చే ఉద్యోగం కావాలి అని సరయూ నన్ను అడిగినప్పుడే అనుకున్నాను.

తనకి ప్రస్తుతం డబ్బు చాలా అవసరం అని. కానీ తను ఇప్పుడున్న హాపీ మూడ్‌లో ఈ విషయం గుర్తుచేసి తన ఆనందం మీద నీళ్ళు చల్లాలి అని అనిపించక ఒక నెక్ టై తీసుకున్నాను. "మీ సెలెక్షన్ చాలా బాగుంది. కానీ ఇది మాత్రమే తీసుకున్నారంటే నేనివ్వలేననా" అంది సరయూ కొంచెం బాధగా ముఖం పెట్టి.

"నో అలా అని కాదు. అలాగైతే అసలేం తీసుకోకపోదును. నాకు ప్రస్తుతానికి ఒక టై కావాలి అందుకే తీసుకున్నాను" అన్నాను.

తర్వాత రెస్టారెంట్‌కి తీసుకెళ్లింది సరయూ. తినడం పూర్తికాగానే బిల్లు తనే ఇచ్చింది. నేను కూడా కాదనలేదు. సరయూని తన ఇంటి దగ్గర దింపి నా ఫ్లాట్‌కి వచ్చేసరికి ఆశ్చర్యంగా అరవింద్ ఇంట్లోనే ఉన్నాడు.

నన్ను చూస్తూనే "ఏం దీపక్ నేనింట్లో ఉండే రోజులు, మీరు బయటకు వెళ్ళే రోజులు వచ్చాయి. చూశావా. మీరు నమ్మలేదు కానీ ఈ దేశం ఎవర్ని అయినా మార్చేస్తుంది" అన్నాడు నవ్వుతూ అరవింద్.

మామూలుగా అయితే ఖస్సున అరిచేవాడినేమో నేను నీలాంటి పనులకు వెళ్లట్లేదు అని. కానీ సరయూ సాహచర్యం నాలో కోపం తగ్గిస్తోందన్నది నిజం.

అందుకే నెమ్మదిగా అన్నాను "మారుతున్నాను అరవింద్. మార్పు అందరికీ సహజమేగా. కానీ చెడుగా మాత్రం ఎప్పటికీ మారను అనే నమ్మకం ఉంది నాకు. గుడ్‌నైట్" అని నా రూంలోకి వెళ్ళిపోయాను.

మంచం మీద పడుకున్నానే గానీ నిద్రరాలేదు. అరవింద్ అన్నట్లు నేను నిజంగా మారిపోతున్నానా? సరయూ వైపు నేను ఆకర్షించబడుతున్నానా? సరయూ అయితే నేను ఉద్యోగం చూపించాననే కృతజ్ఞతతో అలా ప్రవర్తిస్తోంది. కానీ నేను వద్దనుకుంటూనే తనకి దగ్గర అవుతున్నానా అని ఎప్పటికీ చేయకూడదు. గట్టిగా అనుకుంటుంటే నవ్వొచ్చింది.

సరయూని నేను చూడగానే ఇష్టపడిన మాట నిజమే. కానీ ఇష్టం వేరు, ప్రేమ వేరు. దాని గురించి నేనేం పెద్దగా బాధపడాల్సిన అవసరం లేదేమో.

పైగా నాకిప్పుడో మంచి స్నేహితుని అవసరం ఉంది. మా స్నేహం సంగతి మా జిల్లాలో తెలిస్తే కొంచెం ఆశ్చర్యపోతారేమో కానీ ఈ అమెరికాలో ఇలాంటి స్నేహాలు మామూలే.

మన హద్దుల్లో మనం ఉండి స్నేహం చేస్తే తప్పేంటి అనుకున్నాక నాకు ప్రశాంతంగా నిద్రపట్టింది. ఏది ఏమైనా సరయూతో గడిపే కొద్ది కాలం నాలో జీవం పోస్తోంది. నేను తన సమక్షంలో సేదతీరుతున్నాను. నా మనసులో ఏర్పడ్డ అశాంతి, కోపం, చికాకు, ఇంకా ఏవో తెలియని భావాలు మెల్లగా నాకు దూరం అవుతున్నట్లు అనిపించింది.

రాను రానూ మా స్నేహం పెరిగింది. సరయూ దగ్గర నాకు నచ్చే లక్షణాల్లో ముఖ్యమైనది తనెప్పుడూ నన్ను కలిసి మాట్లాడినా నా చదువు గురించి, ఉద్యోగం గురించి, తెలివి గురించీ మాట్లాడేది గానీ నా పుట్టుపూర్వోత్తరాలు, పెళ్లి ఇలాంటి అనవసరమైన విషయాలు అసలు ఎత్తేది కాదు.

నేనెప్పుడూ నా హద్దులు దాటలేదు.

సరయూకి వాళ్ల ఊరంటే ఎంతో ఇష్టం. తనకు భారతదేశం అంటే ఎంత గౌరవమో, తన రాష్ట్రం అంటే ఇంకా గౌరవం అనీ అంతకన్నా



ఎక్కువ తన ఊరంటే ఇష్టమనీ అనేది.

మా జిల్లా ఇంత గొప్ప. మా ఊరు ఇంత గొప్ప అని ఎప్పుడూ పొగుడుతూ ఉండేది. చాలాసార్లు నేను ఊరుకున్నాను గానీ ఒకసారి మాత్రం "హైదరాబాద్ కన్నా మీ ఊరు అభివృద్ధి చెందినట్లు మరీ చోద్యం చెబుతున్నారే?" అన్నాను.

దానికి సరయూ "అబ్బే అదికాదు దీపక్ గారూ. హైదరాబాద్ అంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని. అది అభివృద్ధి చెందడంలో అక్కడి ప్రజలు అన్నీ తెలిసినవారు కావడంలో ఆశ్చర్యం ఏముంది? కానీ, మా ఊరు పెద్దగా అభివృద్ధి చెందకపోయినా ఏదో ప్రత్యేకత ఉందండి. ఇంకో విషయం మా ఊళ్ళో వారు అంటే మాకు దాదాపు అన్ని విషయాల పైన అవగాహన ఉంది అంటే నమ్మండి" అంది.

"సరే మీ ఊరు అంత గొప్ప, మీ ఊర్లో వారంతా ఇంత గొప్ప అంటున్నారు కదా చిన్న ప్రశ్న అడుగుతాను చెప్పండి" అన్నాను నేను నవ్వుతూ.

"అడగండి ఇట్టే చెప్పేస్తా" అంది సరయూ.

"మీ పేరుకి ఒక ప్రత్యేకత ఉంది. అది చెప్పండి చాలు" అన్నాను నేను.

"అంతేనా? సరయూ అన్నది ఒక నది పేరు" అంది సరయూ.

"అంతేనా?" అడిగాను నేను.

"అంతే" అంది తను.

"అయితే వినండి. సరయూ అన్నది నది పేరే కానీ అంతకన్నా ప్రత్యేకమైన విషయం ఏంటంటే శ్రీరాముడు తన దేహం త్యాగం చేసింది ఈ నది ఒడ్డునే. ఆ విషయం కూడా తెలియదు. పెద్ద అన్నీ తెల్సు అంటారు. పైగా మీకు తోడు మీ ఊరి వారి గొప్పలు" తను ఉడుక్కుంటుంది అని తెలిసి ఇంకా ఉడికించాను.

కాసేపు అయ్యాక సరయూ అంది "మీకు పురాణాలు కూడా బాగానే తెలిసున్నట్టుంది " అని.

"ఏదో మీలాంటి వారి స్నేహాల వల్ల ఇలాంటివి తెలిశాయి" మళ్ళీ ఉడికించాను నేను.

* * *

ఒకరోజు ఉన్నట్లుండి మా ఎండీగారు ఫోన్ చేసి "ఇంకొక ఆరునెలలు కాలిఫోర్నియాలో ఉండడం నీకిష్టమేనా?" అని అడిగారు.

మామూలుగా అయితే ఉండను అని తెగేసి చెప్పేవాడినేమో? సరయూతో ఇంకొంతకాలం గడపవచ్చు అనుకుని వెంటనే ఒప్పుకున్నాను.

దానికి ఆయన ఎంతో ఆశ్చర్యపోయి "ఏం దీపక్ అక్కడ నీకు కావాల్సిన వారు ఎవ్వరైనా ఉన్నారా?" అడిగేశారు.

"అందుకని కూడా. కానీ ముఖ్యంగా ఇప్పుడున్న వర్క్ పూర్తికావస్తోంది. వెంటనే వేరే సంస్థ నుంచి ప్రాజెక్టు తీసుకుంటే మన సంస్థ ఇంకా వృద్ధిలోకి వస్తుందని సార్" అన్నాను.

నిజానికి నేను ఇక్కడ ఉండాలి అనుకోవడానికి అది కూడా ఒక కారణమే.

ఆ మాటలు విన్న ఆయన ఎంత ఆనందపడ్డారో నేను చూడకపోయినా నాకు అర్థమైంది.

"నాకు తెలుసు దీపక్. నువ్వు ఒక ఉద్యోగిగా గాక నా సొంత తమ్ముడిలాగా బాధ్యత పడుతున్నావని. నాకెప్పుడో తెలుసు. నేనిచ్చే జీతం కన్నా ఎక్కువ ఇస్తామని నీకెందరో ఆఫర్లు తీసుకొచ్చారని, కానీ నువ్వన్నీ వద్దన్నావని. నీకెంతో రుణపడి ఉన్నాను దీపక్. థ్యాంక్స్ ఎలాట్" అన్నారాయన.

"లేదు సర్. నేను తీసుకున్న జీతానికి నా పని నేను చేస్తున్నాను. మరీ అంత పొగిడేసి నన్ను ఇబ్బందిపెట్టవద్దు" నాకున్న మొహమాటంతో కొంత, ఆయన్ను ఎమోషన్ నుంచి బయటకు తెద్దామని కొంత అన్నాను.

"లేదు దీపక్. నిన్ను పొగడట్లేదు. జీతం తీసుకునే ప్రతీ వ్యక్తి ఇలాగే చేస్తున్నారా? అయినా జీతం నేనే కాదు ఎక్కడ పనిచేస్తే అక్కడ ఇస్తారు. ఇంతకన్నా ఎక్కువ కూడా ఇస్తారు. అసలీకాలంలో ఈ కంప్యూటర్ ఫీల్డ్‌లో ఎంత త్వరగా డబ్బు పోగుచేసుకుందామనే ఆలోచనతో అందరూ క్షణక్షణం ఉద్యోగాలు మారిపోతున్నారు. నువ్వు మాత్రం నా దగ్గరే ఉండిపోవడం, నిజంగా నీ మంచితనానికి నిదర్శనం. నిన్ను త్వరలో కలిసి మాట్లాడుతాను. అంతేకాదు నీ జీతం కూడా పెరుగుతోంది. బహుశా నువ్వు ఊహించనంత" అని ఫోన్ పెట్టేశారు.

ఆయన అంత న్యాయంగా నన్ను మెచ్చుకోవడం నాకు ఎంతో ఆనందం కలిగించింది. ఎంత గొప్పవ్యక్తికైనా ఎదుటివారు తమ శ్రమని గమనించడం, మెచ్చుకోవడం ఇంకా ఉత్సాహం కల్గిస్తుందని నాకు అర్థమైంది.

* * *

నేనింకా ఇక్కడే ఉండాలి అన్న విషయం తెల్సిన అమ్మ, నాన్న ఎంతో బాధపడ్డారు.

నాన్నకి ఇంకా ఏడాది సర్వీసు ఉండడంతో వారు వచ్చే అవకాశం లేదు.

"పోనీ ఒకసారి వచ్చి వెళ్లరా. అక్క కూడా నిన్ను చూడాలని అంటోంది" అన్నారు నాన్న.

"ఇకనైనా పెళ్లి చేసుకోరా" అని అమ్మ పోరు.

ఆ మాట ఇంక నా దగ్గర ఎత్తకు అని నేను సీరియస్‌గా చెప్పడంతో ఫోన్ పట్టుకుని అమ్మ ఏడ్చేసింది. నాన్న తనను ఓదార్చడం వినిపిస్తున్నా ఈ విషయంలో నా నిర్ణయం మారదు కనుక ఏదో మాట్లాడి ఫోన్ పెట్టేశాను.

వెంటనే అక్కకి ఫోన్ చేసి "ఇంకో ఆరునెలలు అమ్మనీ, నాన్ననీ చూసే బాధ్యత నీదే" అన్నాను నవ్వుతూ.

"ఏరా ఇక్కడేం పనిలేనట్లు అక్కడికెళ్ళి కూర్చున్నావేం. మీ ఎండీ గారిని అడిగి ఇక్కడికి వచ్చేయక" అంది అక్క.

"కుదరదే ఎండీగారే బ్రతిమాలాడారు ఇందాక ఫోన్‌చేసి. వెంటనే మీకు చెబుతున్నాను" అన్నాను నేను.

"పోనీలేరా. కానీ ఇకనైనా పెళ్ళి చేసుకుంటే నీకు తోడు ఒకరున్నారని మేం ధైర్యంగా ఉంటాం. రాగానే అయినా పెళ్ళి చేసుకో దీపక్" అంది అక్క.

"ఏంటి అక్కా. నా మనసు తెలిసీ నువ్విలా అంటావేంటి?" ఇంకా ఏదో చెప్పబోయిన అక్క దగ్గర్నుంచి ఫోన్ లాక్కుని బావ కొంచెం సేపు నన్ను నవ్వించి, కొన్ని జాగ్రత్తలు చెప్పాడు. అక్క కొడుకు ధీరజ్ ఏడుపు మామయ్యా వచ్చెయ్యి అని వచ్చీరాని మాటల్లో.

ఇందరు చెప్పినా ఏం అనిపించలేదు కానీ ధీరజ్ ఏడుపు విన్నాక

నాకు వెంటనే అక్కడికి వెళ్ళి అన్నీ మర్చిపోయి వాడితో ఆడుకోవాలని పించింది.

ఏమైనా బాల్యం అన్నది ఎవరి జీవితంలోనైనా మధురమైనదీ, హాయిగా అమ్మా, నాన్న బడిలో ఆడుతూ, పాడుతూ, తోబుట్టువుల ప్రేమను పొందుతూ, మన నేస్తాలతో చిలిపి తగవులు వేసుకుంటూ తిరిగి రానిదైనా బాల్యం ఎంత విశిష్టమైనది.

ఇప్పుడున్న ఈ కుళ్ళు ప్రపంచంలో ఈ జాతి మత వర్గ వైష మ్యాలు, పోటీతత్వం, వింతవ్యాధులు, దారుణమైన హత్యలు, ఘోర మైన చావులు, డబ్బు కోసం సొంతవారినే తెగనరికే కుతంత్రాలు, వీటిని తప్పించుకుని ప్రశాంతంగా జీవించాలంటే మళ్ళీ పసిపాప అయ్యి అమ్మ ఒడిలో ప్రవేశించడమే మార్గం అనుకుని నవ్వుకున్నాను. ఎందు కంటే అది జరిగే పని కాదు కనుక.

అమ్మ, నాన్న, అక్క, బావ, ధీరజ్‌లను మిస్ అవుతున్నాను అన్న బాధ నుంచి తేరుకునేసరికి రెండురోజులు పట్టింది. ఈలోగా అరవింద్ గొడవ. ఒకరాత్రి పన్నెండు గంటలకు నిద్రపోతున్న నన్ను లేపి "దీపక్ నాకు ఒంట్లో ఏదోలా ఉంది జ్వరమేమో?" అన్నాడు అరవింద్.

జ్వరం ఎంత అని థర్మామీటర్‌తో పరీక్షించి, నా దగ్గరున్న ఒక టాబ్లెట్ ఇచ్చి కాఫీ చేసి ఇచ్చాను. మందు ప్రభావం వలన అరవింద్ వెంటనే నిద్రపోయాడు.

రెండురోజులకు తన జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. ఆ రెండురో జులు తనని చూసుకోవలసి వచ్చినా, తన జ్వరం తగ్గినందుకు నేనూ ఆనందపడ్డాను.

కానీ మళ్ళీ వారం అయ్యిందో లేదో మళ్ళీ అరవింద్‌కి జ్వరం వచ్చింది. ఈసారి అయితే అరవింద్ నన్ను పట్టుకుని ఏడ్చేశాడు. "దీపక్ ఇలా అస్తమానూ జ్వరం వస్తే..." అని ఆగిపోయాడు.

నాకు కోపంతో పిచ్చెక్కినట్లు అయ్యింది. అతని మీదకు వెళ్ళి కాలర్ పట్టుకుని అడిగాను "అస్తమానూ జ్వరం వస్తే ఏంటి?" నేను సీరియ స్‌గా ఉండడం అరవింద్‌కి అలవాటే కానీ అంత కోపంగా తనమీదకు రావడం అతను ఊహించలేదు. జ్వరం కన్నా ముందు నన్ను చూసి భయపడిపోయాడు. నాకా విషయం అర్థమైనా నేను తగ్గలేదు. మళ్ళీ రెట్టించాను.

"ఇలా మాటిమాటికీ జ్వరం ఎందుకు వస్తుంది?" గద్దించాను.

"ఇలా అస్తమానూ జ్వరం రావడం, నీరసంగా ఉండడం ఇవన్నీ హెచ్.ఐ.వి పాజిటివ్ (ఎయిడ్స్) లక్షణాలు కదా దీపక్" నన్ను పట్టుకుని ఏడ్చేశాడు అరవింద్.

అతని ఏడుపు చూసి నాకు నా సొంత తమ్ముడే ఏడుస్తున్నట్లు అన్పించింది. నెమ్మదిగా అరవింద్‌ని కూర్చోబెట్టి

"భయపడకు అరవింద్. ఇలా అస్తమానూ జ్వరం వచ్చినంత మాత్రాన నీకు ఎయిడ్స్ అనుకోవడానికి లేదు. నీకింకా అవకాశం ఉంది ఈ ఎయిడ్స్ మహమ్మారి నుంచి తప్పించుకోవడానికి. కానీ ఒక విషయం తెలుసుకో.

మనకు మన భారతదేశంలో ఎన్నో కట్టుబాట్లు ఉన్నాయి. అక్కడ మనకు చాలా వయసు వచ్చేవరకూ చాలా విషయాలు తెలియవు. ఈ ఆడవారి స్నేహాలు, ముద్దులు, పెళ్లికాకుండా వారితో కలిసి జీవిం చడం, పొగత్రాగడం, డ్రింకింగ్ ఇవన్నీ మనకు చాలా పెద్ద తప్పు అని మన పెద్దలు చెప్తారు.

అందుకే ఇక్కడ విదేశాల్లో జరిగే ఇవన్నీ మనకి ఎంతో క్రేజీగా, గొప్పగా కన్పిస్తాయి. ఇక్కడ తల్లిదండ్రులకు తమ పిల్లల పైన బాధ్యత కొంతవరకే కానీ మన అమ్మ, నాన్నలు మన పెళ్లి అయ్యేవరకూ బాధ్యత వహిస్తారు.

అంతేకాదు పెళ్ళయ్యాక భార్యాభర్తల మధ్య వచ్చే తగాదాలు కూడా సర్దుబాటు చేస్తారు. వారు మనల్ని చిన్నతనంలో ఎంత బాగా చూస్తారో, మనం ముసలి వయసులో వారిని అలాగే ప్రేమగా చూస్తాం.

మనలాగా కాకుండా చిన్నప్పుడే ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువ కనుక కొన్ని మంచి అలవాట్లతో పాటు చెడ్డ అలవాట్లకీ తొందరగా చేరువవు తారు. అందుకే మనలాగా కాకుండా చిన్నతనంలోనే వింత వ్యాధులకు వారు లోనవుతారు.

మర్నాడు ఉదయం ఒక పెద్ద హాస్పిటల్‌కు తీసుకెళ్ళి అరవింద్‌కి కొన్ని పరీక్షలు చేయించాను. ఆ పరీక్షల రిజల్ట్స్ తెలుసుకోవాలంటే ఒక గంట ఆగాలి అన్నారు హాస్పిటల్లో.

ఈ గంట ఖాళీగా ఉంటే అరవింద్ టెన్షన్ పడతాడని ఆ హాస్పిటల్ వారిచే నడపబడుతున్న ఓల్డేజ్ హోమ్‌కి తీసుకెళ్లాను.

ఆ ఓల్డేజ్ హోం నిండా రకరకాల మనుషులు. అక్కడవాళ్లతో కొంత సమయం గడుపుతామని, మాకు అక్కడ ఎవరూ తెలియదనీ పరి చయం చేసుకుంటామని పర్మిషన్ అడుగుతుంటే అంతా ఆశ్చర్యపో యారు.

ఇక్కడ తమ సొంత అమ్మ, నాన్నలను చూడ్డానికే టైం ఉండదు చాలామందికి. కొంతమంది నెలకి ఒకసారి వచ్చి చూసి వెళ్తే, కొందరు ఏ మదర్స్‌డేకో, ఫాదర్స్‌డేకో వచ్చి వెళ్తారట. కొంతమంది అయితే తమవారిని ఇక్కడ జాయిన్ చేసిన రోజు తప్ప మళ్లీ రాలేదట. డబ్బుండి ఇంట్లో కావలసినంత ఆప్యాయత, ఆదరణ కరువై ఇక్కడ తమ వయసు వారితో హాయిగా కాలం గడపవచ్చని కొందరు వస్తే, తమ ఆస్తిపాస్తులు తీసుకుని అనారోగ్యం వచ్చాక మెడికల్ అసిస్టెన్స్ పెట్టుకుని ఉన్నా పిల్లలు విసుక్కోవడంతో ఇక్కడికి వచ్చేసినవారు కొందరు.

నిజం చెప్పాలంటే ఆ చిరాకు, ఛీత్కారాల మధ్య నుంచి బయటకు వచ్చాక తమ ఆరోగ్యం బాగవడమే కాక మానసికంగా సంతృప్తిగా ఉందని చెప్పారు కొందరు.

నేను ఇలా వారితో మాట్లాడుతూ అరవింద్ కోసం పక్కకు చూసే సరికి తనులేడు. వెతుకుతూ వెళ్లేసరికి అతను ఒక కిటికీ లోంచి లోప లకు చూస్తూ కన్పించాడు. అంత ఆసక్తిగా ఏం చూస్తున్నాడా అని నేను చూశాను లోపలికి.

లోపల ఒక వృద్ధజంట. ఎనభై సంవత్సరాలుండే భర్త, అతనికి పక్ష వాతం వచ్చింది. మంచం మీదనుంచి దిగేలా లేడు. అతని భార్యకి కూడా డబ్బై అయిదు సంవత్సరాల దాకా ఉండొచ్చు. అయినా ఎంతో ఓర్పుగా అతనికి సేవలు చేస్తోంది. మమ్మల్ని చూసి నవ్వి లోపలికి రమ్మంది.

లోపలకు వెళ్లగానే అరవింద్ అడిగాడు ఆమెని "ఇంత కష్టపడి మీరు ఇవన్నీ చేయకపోతే, డబ్బులిచ్చి ఎవరిచేత అయినా చేయించొ చ్చుగా" అని.

ఆమె నవ్వి "డబ్బు ఇచ్చామని తప్పనిసరై చేస్తారు. కానీ విసు

క్కుంటూ, చీదరిస్తూ చేస్తారు. నాకు శక్తి పూర్తిగా తగ్గిపోతే తప్పదు గానీ నాకు ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ నా భర్తను నేనే చూసుకుంటాను. ఇది నాకు కష్టంగా లేదు. అతనికి సేవచేసే ఓపిక ఆ దేవుడు నాకు ఇచ్చి నందుకు ఆనందంగా ఉంది'' అంది.

టైం చూసుకుని "వెళ్దామా'' అన్నాడు అరవింద్ నాతో.

అక్కడ నేను అంతవరకూ మాట్లాడినవారితో మళ్లీ వీలైనప్పుడు వస్తాం అని చెప్పి వస్తూ అనుకున్నాను నిజానికి విదేశీయుల వివాహ వ్యవస్థ పైన మనకు మంచి అభిప్రాయం ఉండదు. వారికిష్టం లేకపోతే తమ జీవితభాగస్వామిని వదిలేసి వేరే ఎవరితోనో వెళ్ళిపోతారు అను కుంటాం. కానీ వీరు కూడా వివాహం, భార్యభర్తల బంధానికి ఇంత ప్రాముఖ్యం ఇస్తున్నారని ఇలాంటివి చూస్తే అర్థమవుతుంది.

నేనేం మాట్లాడకుండా బయటకు వస్తూంటే అరవింద్ అన్నాడు.

"ఏం దీపక్ ఏం ఆలోచిస్తున్నారు?'' అని.

"అదీ అరవింద్ ముసలితనం ఎంత భయంకరమైనదో అని. యవ్వ నంలో మనను మించిన వారుండరని, ఎదురేలేదని అనుకుంటాం. యవ్వనం ఎంతో ఆనందంగా, జాలీగా గడిపిన వారందరికీ పొంచి ఉన్న వృద్ధాప్యం స్వాగతం చెబుతుంది. బాల్యం, యవ్వనం ఆనం దంగా ఇష్టంగా గడిపే మనం వృద్ధాప్యం ఇష్టం లేకపోయినా గడపాల్సిం దేగా మనకు మరణం వచ్చేవరకూ. ఈ యవ్వనంలో మనతో ఉండే చెడు స్నేహితులు, ఈ జాలీలైఫ్ ఎప్పుడైతే మనకు వృద్ధాప్యం వచ్చిందో అప్పుడే మనను వదిలి పారిపోతాయి. మనకు ఆ సమ యంలో కావాల్సింది కేవలం ఆదరణ, ఆప్యాయత. ఆ రెండూ మనకు మన జీవిత భాగస్వామి దగ్గర మాత్రమే దొరుకుతాయి. మనం ఎంతో ప్రేమగా పెంచుకున్న మన పిల్లలు కూడా మన సంపాదన తగ్గినా, కాలో, చెయ్యో వంగినా మనని చీదరించుకుని దూరం అవుతారు. అంతవరకూ వారినెంత ప్రేమగా చూశాం అన్నది కూడా గుర్తుంచు కోరు.

కానీ ఒక మంచి జీవిత భాగస్వామి మాత్రమే మనకు కలకాలం తోడుగా, నీడగా ఉంటుంది. పద రిపోర్ట్స్ తీసుకుందాం'' అన్నాను అర వింద్‌తో.

రిపోర్ట్స్ చూసిన డాక్టర్ అరవింద్ ఎయిడ్స్ రోగి కాకపోయినా, ఒక రాకూడని వ్యాధితో బాధపడుతున్నాడని చెప్పాడు. కానీ అది మందు లకు నయం కావచ్చు.

మందులకన్నా ముందు అరవింద్ పాటించాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పాడు. అవి కూడా నేను చెప్పినవే నో స్మోకింగ్, నో డ్రింకింగ్, నో డేటింగ్.

తనను ఇంటిదగ్గర డ్రాప్ చేసి మందులు ఇచ్చి కాఫీ, టిఫిన్ చేసి ఇచ్చి నేను ఆఫీసుకి వెళ్దాం అనుకున్నాను. ఎందుకో అరవింద్‌ని వదిలి వెళ్ళాలి అనిపించక ఇంట్లోనే ఉండిపోయాను. సోఫాలో కూర్చున్న నాకు చటుక్కున నిద్రపట్టేసింది.

ఎంతసేపు నిద్రపోయానో తెలీదు కానీ ఏదో తడి నా చేతులకి తగ లడంతో చటుక్కున మెలకువ వచ్చింది. చూసేసరికి అరవింద్ నా పక్కనే కూర్చుని ఏడుస్తున్నాడు.

గబుక్కున తెలివిలోకి వచ్చి "ఏయ్! అరవింద్. ఏంటి చిన్నపిల్లా డిలా నీకేం కాదు అని డాక్టర్ చెప్పారుగా'' అన్నాను తన భుజం మీద చెయ్యేసి.

చేతుల్లో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. కొంతసేపు అలాగే ఏడ్చి తర్వాత కళ్ళు తుడుచుకుని "దీపక్ నువ్వు ఎపుడో చెప్పావు జాగ్రత్తగా ఉండమని. అప్పుడే ఇవన్నీ మానేసినా ఈనాడు ఇంత బాధ ఉండకపోదును. ఇప్పుడు నాకీ జబ్బు వచ్చిందంటే ఎంత అవమానం'' అన్నాడు అరవింద్.

నేను వెంటనే అందుకుని అన్నాను.

"అరవింద్ నువ్వీ విషయం ఎవ్వరికీ చెప్పకు. నీకు పదిహేనురో జులు సెలవు ఇస్తాను. కొంచెం కోలుకున్నాక ఆఫీసుకి రావచ్చు. ఈలోగా ఏదైనా అవసరమైతే ఆన్‌లైన్‌లో చేద్దుగాని నీ పని. కానీ ఇప్ప టికైనా జాగ్రత్తగా ఉండు. సమయానికి మందులు వేసుకుంటూ, మంచి ఆహారం తీసుకుంటూ నీ అలవాట్లకు దూరంగా ఉండు సరేనా'' అన్నాను.

"ఈ జబ్బు వచ్చిందని తెలీకముందే, ఆ ఓల్డేజ్ హోం చూసినపుడే నాలో మార్పు వచ్చింది. నాపైన నమ్మకంతో మా అమ్మానాన్న ఇంత దూరం పంపారు. రేపు నేనిలా చెడిపోయి వారికన్నా ముందే ఏదో అయిపోతే అమ్మానాన్న అలాగే ఓల్డేజ్‌హోంలోనే ఉండాలి కదా అన్పిం చింది.

నాకు నయం కాగానే ఇండియా వెళ్ళి అమ్మా,నాన్నని చూసి వస్తాను. వాళ్ళ కాళ్ళమీద పడితే కానీ నేను ఇంతకాలం చేసిన పాపా లకు ప్రాయశ్చిత్తం లేదు. నన్నెంతో క్రమశిక్షణతో పెంచారు. ఇక్కడకు రాగానే అదంతా మర్చిపోయి ఎంత అసహ్యంగా ప్రవర్తించాను'' అన్నాడు అరవింద్ వెక్కుతూ.

"తప్పు నీదికాదు అరవింద్ ఈ జనరేషన్‌ది. నువ్వేకాదు ఇక్కడికి వస్తున్న మన వాళ్ళేకాదు, ఈ విదేశీ సంస్కృతి టీవీల్లో, సినిమాల్లో చూసి మనదేశంలో చాలామంది యువత పాడయిపోతున్నారు. ఈ అలవాట్లు చూసి అవి ఎలా ఉంటాయోనన్న కుతూహలంతో వాటిని రుచిచూసి క్రమంగా వాటికి బానిసలై పోతున్నారు. పెద్దవాళ్ళు కూడా ఇవేవో నాగరిక లక్షణాలు అన్నట్లు పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

ఇలా కాకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరికీ ఒక ఆశయం ఉండాలి. ఆత్మవిశ్వాసం, వీటికి చలించని గుండె నిబ్బరం అలవర్చుకోవాలి. కానీ, అలా జరిగేదెప్పుడు?

అందుకే టీనేజ్‌లోకి అడుగుపెడుతూనే చెడిపోయి ఇంకా అసలు జీవితం ఏంటో దాని పరమార్థం ఏంటో తెలుసుకోకముందే నాశనం అయిపోతున్నారు.


మనలాంటివాళ్ళు ఈ విషయాలన్నీ తెల్సినవాళ్లం మన పరిధిలో అయినా ఇలా జరగకుండా చూడాలి.

ఇది మన బాధ్యత. ఎంతో పవిత్రమైన, పురాతనమైన భారతీయ సంస్కృతిని నిలబెట్టుకోవాలి'' అన్నాను ఆవేశంగా.

"అవును దీపక్. నువ్వన్నది నిజం. నీకీ వయసులోనే జీవితం పైన ఎంత అవగాహన ఉంది. నువ్వు చాలా గొప్పవాడివి'' అన్నాడు అర వింద్.

"సరేలే పొగిడింది చాలు. కానీ మీ పేరెంట్స్‌కి ఫోన్ చేసి చెప్పు. రెండు నెలల తర్వాత అక్కడికి వస్తానని'' అన్నాను అరవింద్‌తో.

సెలవు ఇవ్వాల్సింది నేనే కనుక అతనికి నేను అన్న విషయం అర్థమై "థ్యాంక్యూ దీపక్'' అంటూ నా చేయి పట్టుకుని ఊపేశాడు అరవింద్. కొంచెం సేపు తనను నవ్వించి తను నిద్రపోగానే ఆఫీసుకి వెళ్ళిపో



యాను.

నా పని, అరవింద్ పని చేయడంతో ఇంటికెళ్ళేసరికి చాలా రాత్రి అయిపోయింది. ఇంటిలో అడుగుపెడుతుండగానే అరవింద్ చెప్పాడు "సరయీ నీకోసం ఫోన్ చేశారు దీపక్" అని.

టైం చూస్తే రాత్రి పన్నెండుగంటలయ్యింది. ఇప్పుడు చెయ్యాలా వద్దా అని ఆలోచిస్తుంటే "ఫోన్ చెయ్యి దీపక్. నువ్వెప్పుడొస్తే అప్పుడు ఫోన్ చెయ్యమన్నారు సరయీ" అన్నాడు అరవింద్.

సరే అని సరయీకి ఫోన్ చేశాను. ఒక్కసారి రింగ్ అవగానే ఫోన్ తీసి "దీపక్ మీరేనా?" అంది సరయీ.

"ఏమైనా ముఖ్యమైన విషయమా?" అడిగాను నేను.

"అర్జంట్‌గా మిమ్మల్ని కలవాలి" అంది సరయీ తన కంఠంలో కంగారు.

"ఇప్పుడా?" ఆశ్చర్యంగా అన్నాను నేను.

"సారీ దీపక్. ఇప్పుడు కాదు వీలైనంత త్వరగా. అంటే ఈ శనివారం కానీ ఆదివారం కానీ. మీరు మా ఇంటికి రాగలరా. అది కూడా మీకు వీలైతేనే?" అంది సరయీ.

"శనివారం ఉదయం వస్తాను సరయీ. ఇంకేమైనా ఉందా?" అడిగాను నేను. నాకింకా తనతో మాట్లాడాలని ఉన్నా తను ఇంత అర్జంట్‌గా నన్ను కలవమన్న కారణం ఏంటి? అది కూడా ఈరోజు ఫోన్ చేసి మరీ ఎందుకు రమ్మంటుంది అనే సందేహం నన్ను తొలుస్తోంది.

"అంతే దీపక్. ఇంకేం లేదు. సారీ మిమ్మల్ని ఇబ్బందిపెట్టాను" అంది సరయీ.

"అదేంలేదు సరయీ. గుడ్‌నైట్" అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

దుప్పటి పూర్తిగా కప్పేసుకుని ఆలోచిస్తున్నా నేను. తను ఎందుకు రమ్మంది. ఏం చెప్పాలని రమ్మంది. ఏదైనా తనకు ఇబ్బంది వచ్చిందా? ఆలోచిస్తుంటే నాకెంతో థ్రిల్లింగ్‌గా అన్పించింది.

కొత్తలో తను కన్పిస్తే చాలని ఎదురుచూసేవాణ్ని. కానీ ఇప్పుడు తను తన పర్సనల్ విషయాలు చెప్పుకునేంత దగ్గరగా అయిపోయాను అదీ ఇంత త్వరగా.

'ఓ షిర్డీసాయీ, నువ్వెంత చిత్ర, విచిత్రంగా ఆడిస్తావు మనుష లని. ప్రపంచంలో నిన్ను మించిన రచయిత ఎవరైనా ఉంటారా? ఏవేవో మలుపులు తిప్పేస్తావు జీవితాలని. నువ్వు నిజంగా మహనీయు డివి...హేట్సాఫ్' అనుకుంటూ నిద్రపోయాను.

★ ★ ★

అనుకున్నట్లే శనివారం వచ్చింది. నిజానికి నేను శనివారం కూడా ఆఫీసులోనే ఉండేవాణ్ని సాయంత్రం దాకా.

ఈ శనివారం అందరికీ శలవు అంటుంటే ఆఫీసులో అందరూ ఆశ్చర్యపోయారు. "ప్రాజెక్టు పూర్తయిపోయిందా దీపక్" అని అడిగేశారు కూడా.

నేను నవ్వి "అంత లేదు. ఈ శనివారం మాత్రమే సెలవు" అన్నాను.

నేనిక్కడికి వచ్చిన కొత్తలో నవ్వు అన్నది లైట్ వేసి వెతికినా కన్పించేది కాదు నా ముఖంలో. సరయీతో స్నేహం నన్నెంతగానో మార్చింది నాకు తెలియకుండా అనుకుంటే నాకు ఏదోలా అన్పించింది. ఒక అమ్మాయి వలన ఇంత మార్పు రావడం మంచికా, చెడుకా అని ఒక పక్కన అన్పిస్తున్నా, ఇప్పటిదాకా నేను అందరితోనూ సరదాగా, దగ్గరగా మసలడం వలన వారి బాధలు తెలుసుకోవడం వలన వారికి నేనంటే ఇష్టం కల్గింది.

ఇదివరకు అంత గంభీరంగా ఉండి పని రాక్షసుడిలా పనిచేయించినప్పటికన్నా ఇప్పుడు అందరూ తమదే బాధ్యత అన్నట్లు చేయడం తోనే త్వరగా పని పూర్తయిపోతోంది.

ఎప్పుడో ఏదో జరిగిందని మన జీవన విధానం మార్చేసుకోకూడదు. అందరూ మంచితనాన్ని అలుసుగా తీసుకోరు. కొందరికి మాత్రమే మంచితనం చేతకానితనంలా కన్పిస్తుంది కాబోలు.

నేను ఆలోచిస్తుండగా అరవింద్ అన్నాడు "దీపక్ ఈరోజు సరయీని కలవాలని అన్నావు మర్చిపోయావా?" అని.

★ ★ ★

సరయీ ఇంటికి వెళ్ళేసరికి తను నాకోసం ఎదురుచూస్తోంది. తన స్నేహితురాలు కాథరీన్ వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్లిందిట. సరయీ నన్ను చూడగానే మర్యాదలు చేసేసింది.

కాసేపు అవీ ఇవీ మాట్లాడినా సరయీ ఎందుకో బాగా టెన్షన్‌లో ఉన్నట్లు నాకు అన్పించింది.

"సరయీ ఏదో చెప్పాలన్నారు" అడిగాను.

నాకు అక్కడినించి వీలైనంత త్వరగా వెళ్ళిపోవాలనుంది. ఎందుకంటే సరయీ ఇప్పుడు మామూలుగా కన్నా చాలా అందంగా ఉంది. లేత గులాబీరంగు చీరలో ఉందేమో, ఆ రంగు తన రంగులో కలిసిపోయి మెరిసిపోతోంది.

చాలాకాలం నుంచి ఆడవారితో మాట్లాడడం కాదు కదా వారిని సరిగా చూడడం కూడా మానేసిన నేను సరయీని చూశాకే మళ్లీ మామూలు లోకంలోకి వచ్చాను కదా. ఇప్పుడు తను ఇంత దగ్గరగా కన్పిస్తే నాకేదో అయిపోయి, నేను అనుకున్న దానికి విరుద్ధంగా తన వైపు ఆకర్షించబడ్తానేమో అని త్వరగా అక్కడ్నించి బయటపడాలని అనుకున్నాను.

ఆలోచిస్తూనే తనకేసి చూస్తున్న నేను నాకు తెలీకుండానే "బ్యూటీఫుల్" అన్నాను.

"ఆఁ" అంది సరయీ అర్థంకాక.

దొరికిపోవడంతో "నువ్వు చాలా అందంగా ఉన్నావు సరయీ. యు ఆర్ లుకింగ్ సో గాజస్" అన్నాను.

"థ్యాంక్యూ" అంటున్నా సరయీ కళ్లల్లో నీరు నాకు కన్పించకుండా ఉండడం కోసం లోపలికి వెళ్లింది తను.

అందంగా ఉన్నావంటే ఇలా అయిపోయిందేమిటి? ఛీ అయినా అన్నీలాంటి పనులే చేస్తాను నేను అని నన్ను నేనే తట్టుకున్నాను. పది నిముషాల తర్వాత కళ్ళు తుడుచుకుని మంచినీళ్ళు తాగి వచ్చినట్టు అన్పించింది సరయీని చూడగానే నాకు.

వస్తూనే "దీపక్. వచ్చే నెల మీరు నాతో ఒకచోటుకి రాగలరా?" అని అడిగింది సరయీ.

నాకేం అర్థంకాలేదు.

"ఎందుకు?" అన్నాను.

"అప్పుడు మీరు తప్పకుండా నాతో ఉండాలి. నాకు మీ సహాయం కావాలి. మీది అసలే బాధ్యతగల ఉద్యోగం. కనుక ముందే అడుగుతున్నాను. రెండురోజులైనా మీరు సెలవు పెట్టాలి" అంది గబగబా

సరయూ.

"నేనింతవరకూ సెలవులే పెట్టలేదు. కనుక తప్పకుండా అలాగే వస్తాను సరయూ" అన్నాను నేను.

అనేశాక అన్పించింది. 'ఫూల్ ఎందుకని అడిగాక చెప్పచ్చుగా వస్తానని. ఇప్పుడేం సహాయం అంటుందో నువ్వు చెయ్యగలవో లేదో!' నా అంతరాత్మ తిట్టినట్లు అన్పించింది.

సరయూ ఆశ్చర్యంగా అడిగింది. "అదేంటి దీపక్. కనీసం ఎలాంటి సహాయం అని అడగకుండా ఒప్పేసుకున్నారు?"

"సరయూ నువ్వు నా ఫ్రెండ్‌వి. మన స్నేహం కోసం ఎంత కష్టమైన పని అయినా చేసి నా మాట నిలబెట్టుకుంటాను. ఇది నా వాగ్దానం" అన్నాను నేను.

"నాకు తెలుసు దీపక్. మీరు ఎంత మంచివారో. నాకు జీవితంలో ఇంత విలువిచ్చిన వ్యక్తి మీరే. ఇప్పటికే ఉద్యోగం కోసం మీపై ఆధార పడ్డాను.

ఇంక మళ్ళీ ఏ రకంగా ఇబ్బంది పెట్టకూడదనుకున్నాను. కానీ ఏం చేయను?

నాకు మీరు తప్ప వేరే దిక్కు లేదు. అందుకే తప్పలేదు మిమ్మల్ని కష్టపెట్టడం" కళ్లనీళ్ళు కారుతుండగా అంది సరయూ.

వెంటనే నాకు కంగారు వచ్చింది.

"సరయూ నీకెంతో ధైర్యం ఉంది అనుకున్నాను. ఇదేంటి కంట్రోల్ చేసుకో" అన్నాను.

"ఇన్నాళ్ళు అలాగే ఊరుకున్నాను. దీపక్ కానీ ఇంక నా వల్లకాదు. నా బిడ్డ నాకు లేకుండా ఇంక నేను బ్రతకలేను అన్పిస్తోంది. నా బిడ్డను నా దగ్గరికి చేర్చేందుకు నాకు సహాయం చెయ్యరూ?" అర్థిస్తున్నట్లుగా అంది సరయూ.

ఆ మాటలకి నా తల గిర్రున తిరిగిపోయింది. తనేం అంటుందో కొంచెంసేపు అర్థంకాలేదు.

నేను సరయూపై నాకు తెలియకుండానే పెంచుకున్న ప్రేమ వలన కాబోలు గుండెను కుదిపేసినట్లు అన్పించింది. గొంతు పెగుల్చుకుని "ఏంటి సరయూ నాకు కొంచెం అర్థం అయ్యేలా చెప్పు?" అన్నాను.

"సారీ దీపక్. ఇన్నాళ్ళు నీకీ సంగతి చెప్పనందుకు. ఎప్పుడో మీతో ఈ సంగతి చెప్పాలనుకున్నాను. కానీ ఏదో భయం చెప్పనివ్వలేదు. నాకొక పాప ఉంది. పేరు సాత్విక. తను నా భర్త రవి దగ్గర ఉంది. ఇంకా వివరంగా చెప్పాలంటే..." అని ప్రారంభించింది సరయూ.

* * *

సరయూ తల్లిదండ్రులకు ఒక్కతే సంతానం, అందుకే తనను ఎంతో ముద్దుగా పెంచుకున్నారు వాళ్ళు. వాళ్ల ప్రేమ, అనురాగాలకి సరిపడ సరయూ కూడా ఎంతో బుద్ధిగా పెరిగి చదువులో కూడా మంచిగా రాణించింది.

ఎం.కాం పూర్తికాగానే ఉద్యోగంలో చేరతానన్న సరయూని తల్లిదండ్రులు ఉద్యోగంలో చేరనివ్వలేదు. మంచి సంబంధం చూసి పెళ్ళి చేసి ఆ తర్వాత ఆమె భర్త ఇష్టం ప్రకారం ఉద్యోగం చేయాలా వద్దా అని నిర్ణయించాలని వారి కోరిక.

సరయూ వాళ్ల నాన్న స్నేహితుని కొడుకు రవి. రవి వాళ్ళ నాన్నకి సరయూ అంటే చిన్నప్పట్నించీ ఎంతో ప్రేమ. కానీ రవికీ సరయూకి మధ్య స్నేహం లేదు.

ఎందుకంటే రవి సరయూ కన్నా ఐదేళ్ళు పెద్దవాడు. పైగా రవి తన అమ్మమ్మ ఇంట్లో పెరిగాడు.

రవి ఎప్పుడైనా సరయూ వాళ్ళ ఊరుకి సెలవుల్లో వచ్చినా ఎందుకో వారి మధ్య స్నేహం చిగురించలేదు.

రవికి అమెరికాలో ఉద్యోగం రాగానే రవి తండ్రి సరయూని తన ఇంటి కోడలిగా చేయాలని సరయూ నాన్న దగ్గర మాట తీసుకున్నాడు.

సరయూ వాళ్ళకి పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న రవికి కట్నం అదీ ఎక్కువ కావాలేమో అని సరయూ తండ్రి భయపడ్డాడు.

కానీ రవి తండ్రి "అదేంలేదు సరయూ మంచి పిల్ల అది మాత్రం చాలు" అని పెళ్ళి కుదుర్చుకున్నాడు.

పెళ్ళికి ముందే రవి తండ్రి యాక్సిడెంట్‌లో చనిపోయాడు. చనిపోతూ భార్య దగ్గర 'సరయూనే రవి భార్య కావాలి' అని మాట తీసుకున్నాడు.

తండ్రి చనిపోయాడని ఇండియా వచ్చిన రవి తండ్రి మాటలకి కాకపోయినా సరయూ అందానికి ముగ్ధుడై పెళ్ళికి ఒప్పుకున్నాడు.

రవి తల్లి అనసూయమ్మకి మాత్రం పెద్దగా ఆస్తి లేని సరయూ సంబంధం ఇష్టం లేదు.

భర్తకు మాట ఇచ్చినందుకో, మరెందుకో ఆమె కూడా ఒప్పుకుంది. ఏడాది తర్వాతనే పెళ్ళి అని నిర్ణయించారు పెద్దలు.

రవి మరలా అమెరికా వెళ్ళిపోయాడు.

ఈ ఏడాది కాలం ఇంట్లో ఖాళీగా ఉండక ఉద్యోగం చేస్తానని రవి తల్లిని అడిగింది సరయూ. 'అదేం కుదర్దు ఆడది ఇంటి పట్టునే ఉండాలి' అని ఆవిడ ఆ ప్రయత్నాల్ని మాన్పించేసింది.

సరయూకి చదువుకాగానే పెళ్లి చేసుకునే ఆలోచన లేదు. కొన్నాళ్ళు తన కాళ్ళపైన తాను నిలబడాలని అనుకుంది. కానీ తనను ఎంతో ప్రేమించే తల్లి తండ్రుల మాట తీసేయలేక పెళ్ళికి ఒప్పేసుకుంది.

ఏడాదిపాటు ఏం చెయ్యకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేందుకు కూడా ఒప్పుకుంది.

సంప్రదాయ కుటుంబాల్లోని అమ్మాయిలు పెద్దల మాట వింటారు కదా.

పెళ్లికి ముందు అందరి ఆడపిల్లల్లాగా జీవితం ఇలా ఉండాలి, అలా ఉండాలి అనుకోకపోయినా, తన వ్యక్తిత్వానికి విలువిచ్చే వ్యక్తి తన భర్త అయితే చాలు అనుకుంది.

ఏడాది తర్వాత రవి వచ్చి పెళ్ళిచేసుకుని సరయూని కూడా అమెరికా తీసుకుపోయాడు.

సరయూ అమెరికా వెళ్తుంటే అనసూయమ్మ ఎంతో సాధించింది రవికి ఇంత కట్నం వచ్చును, అంత కట్నం వచ్చును అంటూ. "ఎక్కుడుందో అదృష్టం తాహతు లేకపోయినా మీ నాన్న పిచ్చి తనం వలన అమెరికాలో అడుగుపెట్టేస్తోంది" అంటూ కొడుకు దగ్గర సరయూని తిట్టిపోసింది.

సరయూ తల్లిదండ్రులు తమ ఇల్లు, సరయూ తండ్రి పెన్షన్ అంతా మిగుల్చుకుని అంతా ఖర్చుపెట్టి సరయూ పెళ్ళి ఘనంగా చేయడమే కాక అమెరికాకి కూతురికీ, అల్లుడికీ టికెట్లు కొన్నారు.

సరయూకి నసుగుతున్న అత్తగారినీ చూసి బాధకల్గినా రవి వాళ్ల నాన్న లాగే మంచివాడేమో అని సరిపెట్టుకుని రవితో అమెరికాలో అడుగుపెట్టింది.

కానీ రెండునెలలు రవితో కలిసి బ్రతికాక అర్థమైంది రవి పూర్తిగా తల్లి బుద్ధుల్తో పుట్టాడని.

అతనిది ఒక వింత మనస్తత్వం. భార్య అంటే భర్త అవసరం తీర్చడా నికే పుట్టిన యంత్రం అన్నది అతని అభిప్రాయం. ఏదోవారికి తిండి, బట్ట, నగలు ఇస్తే చాలని అతని నమ్మకం.

ఎప్పుడూ ఏయ్ అంటూ పిలిచి అధికారంగా పనులు చేయించుకో వడం తప్ప ప్రేమగా మాట్లాడడం అతనికి చేతగాదు. సరయూ అందం అంటే అతనికి భయం. అందుకే గుడికి కూడా తీసుకెళ్ళేవాడు కాదు. ఎవరితోనైనా సరయూ మాట్లాడిస్తే ఏదో అయిపోతుందని అనుమానం. ఇంటికొచ్చిన స్నేహితులకి కూడా పరిచయం చేసేవాడు కాదు.

ఎప్పుడూ ఏదో పని చెప్పడం, అది చేయడం కొంచెం లేట్ అయితే చాలు తిట్టిపోయడం. ఇక భరించలేక రవికి ఏదో చెప్పాలని ప్రయత్నిం చింది సరయూ. అది అతను వినాలని అనుకోలేదు సరికదా కసిరి నోరు మూయించాడు.

ఈకాలంలో ఇంత చదువుకుని ఇలా బానిస జీవితం గడపడం సర యూకి కష్టంగా అన్పించింది. భర్త అవసరాలు తీర్చడం, సేవలు చేయడం ప్రతీభార్యకూ ఇష్టమే కానీ ఆ చేసేది తమ ఇష్టంతో తాము చెయ్యాలి కానీ క్షణక్షణం ఏదో పనివారికి చెప్పినట్టు అతను పురమా యించడం, తనను నాలుగ్గోడల మధ్య బందీగా ఉంచడం, చిన్న విష యానికి ఏదో అవసరమై బయటికెళ్ళినా అనుమానపడడం ఆమెకా జీవితం దుర్భరంగా అన్పించింది.

రవితో విడిపోతే అన్పించింది కానీ తన కోసం తమకు ఉన్నదంతా ధారపోసి పెళ్లి చేసిన తల్లిదండ్రుల్ని, మరణిస్తూ కూడా తనని ఈ ఇంటి కోడలిగా చేయమని మాట తీసుకున్న మామగారి ఆత్మనీ కష్టపెట్టడం ఇష్టం లేక సర్దుకుని జీవితం గడుపుతోంది.

పెళ్ళయిన ఆరునెలలకే సరయూ నెల తప్పింది. ఆ మాట విన్నాక అయినా రవి ధోరణిలో మార్పు వస్తుంది అనుకోవడం ఎంత పిచ్చిత నమో ఆరోజే సరయూకి తెలిసింది. డాక్టర్ సరయూ నెల తప్పిందని, కొన్ని మందులు బలానికి వాడమని జాగ్రత్తలు చెప్పి పంపించింది.

ఇంటికి రాగానే రవి సరయూతో ఆనందంగా మాట్లాడలేదు సరికదా "ఇదుగో!ఈ రోజునించి ఆరోగ్యం జాగ్రత్త. అంత ఖరీదు పెట్టి కొన్న మందులు సరిగా వేసుకుని వేళకి తిండి తిను. అంతేగానీ నేను నిన్నేదో సరిగా చూడడం లేదు అన్యాయం చేస్తున్నాను అంటూ పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకుంటే నీ కడుపులో ఉన్న నా కొడుక్కి ప్రమాదం" అని సీరియస్‌గా చెప్పేసి తన పని తను చేసుకుంటున్నాడు.

సరయూకి ఒక్కసారి జీవితంపై విరక్తి కలిగింది. అసలితని గురించి ఏం అనుకోవాలో అర్థం కావట్లేదు. కడుపులో ఉన్న కొడుకు అంటు న్నాడు. కూతురు ఉండకూడదా?

ఆ కొడుకుకూడా ఇలాగే నన్ను హింసించేవాడు కావాలని ఇతని కోరిక. పోనీ ఏ చలనం, ఫీలింగ్ లేని జడపదార్థం అనుకుందామన్నా అందరితోనూ ఎంతో హుషారుగా, చలాకీగా మాట్లాడతాడు. ఎవ రింట్లో ఏం జరిగినా నేనే ముందున్నానంటూ వెళ్తాడు. తల్లితోనూ ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడతాడు. మరి నా విషయంలో?

అసలంత ఇష్టం లేనివాడు పెళ్ళెందుకు చేసుకోవాలి? ఇప్పుడూ ప్రెగ్నెన్సీకి కారణం ఎందుకు కావాలి? అసలు కడుపులో బిడ్డ ఏడవక ముందే నా దారి నేను చూసుకోవాల్సింది. ఇప్పుడు నా ప్రాణంతో ఆ చిన్న ప్రాణం కూడా తీసుకోలేదు అనుకుంది కన్నీరు తుడుచు కుంటూ.

సరయూ కడుపు విషయం తెల్సిన సరయూ తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. రవి తనను ఎలా చూస్తున్నాడనే విషయం పొరపా టున కూడా తల్లిదండ్రుల్తో చెప్పలేదు సరయూ.

దినదిన గండంలా రవి చేతుల్తో ఆర్డర్లు, చీవాట్లు తింటూ తొమ్మిది నెలలు గడిపేసింది.

ప్రస్తుతం టైంకి తల్లిని రప్పించుకుందామన్న సరయూ ఆశ అడి యాస అయింది. "మా అమ్మ వస్తుందిలే. మా అమ్మ అమెరికా చూసి నట్లు ఉంటుంది. మీ నాన్నను మాత్రం డబ్బులు పంపమను. ఇక్కడ డెలివరీ అంటే మీ ఊర్లో లాగ వెయ్యికి, రెండువేలకి అయిపోదు. అర్థ మైందా అయినా ఏదో మా నాన్న కట్టిన మాటకి నిన్ను పెళ్ళి చేసుకుని ఇక్కడకి తీసుకొచ్చాను. లేకపోతే ఈ జన్మలో నీకీ అమెరికాలో బ్రతికే అవకాశం వద్దునా?" వెటకారంగా అన్నాడు రవి.

తల్లిరావడం లేదు అత్తగారొస్తుంది అన్ని ఏర్పాట్లు అయిపో యాయి అని తెలిసి సరయూకి ఇంకా భయమేసింది. ఆవిడసలే తన పైన కోపంతో ఉంది అని.

సరయూ నోరు తెరిచి తండ్రిని డబ్బు అడిగేందుకు ఇబ్బందిప డింది.

కానీ ఆమెకి ఆ అవకాశం ఇవ్వకుండా అనసూయమ్మతో యాభై వేలు ఇచ్చి పంపించాడు సరయూ తండ్రి.

ఆ డబ్బు ఎలా ఇచ్చాడో అని సరయూ బెంగపడ్తుంటే "ముష్టి యాభైవేలు ఇచ్చాడురా నీ మామగారు. ఇక్కడ డాలర్లలో ఇదెంత? మీ నాన్న వలనే ఈ ముష్టి సంబంధం అయ్యింది" వస్తూనే పోయాడు అని కూడా లేకుండా భర్తను, కోడలి తల్లిదండ్రుల్ని ఆడిపోసుకుంది అనసూ యమ్మ.

నొప్పులు వచ్చేవరకూ తల్లీ, కొడుకు సరయూతో సేవలు చేయిం చుకున్నారు. నొప్పులు వస్తుండగా "కొడుకునే కనాలి గుర్తుందా?" అని బెదిరించింది అనసూయమ్మ.

ఆమె మూర్ఖత్వానికి సరయూకి ఇంకా బెంగ పట్టేసుకుంది. సరయూ దురదృష్టమో, అలా అనడం సరికాదు కానీ రవి, అనసూయమ్మల దృష్టిలో మాత్రం అది దురదృష్టం కిందే లెక్క. సరయూకి ఆడపిల్ల పుట్టింది. సరయూ అంత అందంగా ఉన్న పాపాయిని చూసి అందరూ ఇష్టపడ్డారు గానీ రవి, అనసూయమ్మలు ముఖానికి గంటు పెట్టుకుని కూర్చున్నారు.

హాస్పిటల్ నుంచి ఇంటికి రాగానే మొదలుపెట్టింది అనసూయమ్మ సాధించడం. "మా వంశంలో లేదు ఆడపిల్లల్ని కనడం. నువ్వు కూడా ఒక్కడివే పుట్టినా కొడుకువే పుట్టావు. ఇదుగో ఈ మహాతల్లి దీని తల్లి వీరికి మాత్రం ఇదే అలవాటేమో" అంటూ కొడుకు దగ్గర నానామా టలు అంది.

తనకు ఏమన్నా సరయూ ఏమనుకోలేదు కానీ తల్లిని అనేసరికి బాధ పడి "అదేంటి అత్తయ్యగారూ ఈకాలంలో ప్రపంచం ఇంత వృద్ధి చెందింది కదా. ఆడపిల్ల ఎందుకు పుడుతుందో, మగపిల్లాడు ఎందుకు



పుడతాడో కూడా సైన్సు చెప్తోంది. మన జన్యువుల వలన ఆ మార్పు కానీ ఏవో పోలికలు వలన కాదండీ'' అంది సరయూ.

ఆమాటలకు అనసూయమ్మ మూతి మూడు వంకర్లు తిప్పి "అందుకేరా చదువుకున్న దాన్ని వద్దు డబ్బున్న దాన్ని చేసుకో అన్నాను. సైన్సులు, గీన్సులు లేనప్పుడూ పుట్టారు, పిల్లలు ఇప్పుడూ పుడుతున్నారు. అసలు నా రాత అలా ఉంది శుభ్రమైన మనవడిని ఎత్తుకునే అదృష్టం లేక ఇలా'' అని తలకొట్టుకుంది.

రవి, అనసూయమ్మలు ఆ పాపాయిని ఎంత చీదరించుకున్నారంటే ఆఖరుకి పేరు కూడా పెట్టడానికి ఇష్టపడలేదు. సాత్విక అని సరయూనే తన బిడ్డకు పేరు పెట్టుకుంది.

అనసూయమ్మ సంగతి సరే చదువు, సంధ్య లేనిది. రవి కూడా ఇలాగే ఆడపిల్ల అని సాత్వికని చీదరించడం, దగ్గరకు తీసుకోకపోవడం సరయూకి చాలా బాధ కల్పించింది.

రవి ఫ్రెండ్స్ బాధపడలేక కాబోలు చిన్న ఫంక్షన్ లాగా చేసి అక్కడే ఉండే పురోహితుడి చేత పేరు పెట్టించాడు. అనసూయమ్మ ఇక్కడ ఉండాల్సిన టైం అయిపోవడంతో తిరిగి ఇండియా వచ్చేసింది.

ఆమెతో పాటూ సరయూ కూడా ఇండియా వచ్చి తల్లితండ్రులకు పాపను చూపించాలనుకుంది.

సరయూ కోరిక ఇది అని తెలియగానే రవి ఎప్పటిలాగే తనను తిట్టి మానిపించేశాడు. ఇప్పుడు అక్కడికి వెళ్లాలన్నా మళ్లీ తల్లిదండ్రులకే డబ్బు ఖర్చు అని సరయూ కూడా నోరు మూసుకుని ఉండిపోయింది.

పాప పుట్టాక రవి ఎంత సరయూని బయటకు వెళ్లనివ్వకపోయినా చుట్టుపక్కలుండే తెలుగువారు ఇంటికి రావడం మొదలెట్టారు. మాటల్లో ఒకసారి "పాపకు ఏడాది నిండుతోందిగా మొదటి పుట్టిన రోజు చేస్తారా?'' అని అడిగారు.

సరయూకి కూడా ఆ విషయం నచ్చి రవి రాగానే అంది "అందరూ అంటున్నారు పాపకు మొదటి పుట్టినరోజు చేస్తారా అని చేద్దామా?'' అంది రవి ఒప్పుకోడని తెలిసినా.

"ఏం ఈ వంకతో అందరితో స్నేహాలు చేసుకుని నీ అందం, తెలివితేటలు ప్రదర్శించాలనా?'' అన్నాడు రవి ఠక్కున.

సరయూకి తల కొట్టేసినట్లయింది. అతనంటే చెప్పలేనంత అసహ్యం కలిగింది.

"రోజంతా మీరు ఇంట్లో ఉండరు. నా అందం ఎవరికో ప్రదర్శించాలనుకుంటే నాకు ఆ టైం చాలదా? అందరి పిల్లలకి పుట్టినరోజులు చేస్తున్నారు. నన్ను తీసుకెళ్లకపోయినా వాటికి మీరు వెళ్తున్నారు. మన పాప బర్త్‌డే చేయకపోతే ఏం బాగుంటుంది? అని అడిగాను'' అంది కోపం దిగమింగుకుంటూ.

"నీ సంగతి తెలిసే నా జాగ్రత్త నేను పడ్డాను. నీకు కొంచెం మతిస్థిమితం తక్కువ అని అందరికీ చెప్పి ఉంచాను. మా చుట్టాలమ్మాయి వాళ్ళ నాన్న కాళ్ళు పట్టుకుంటే పెళ్ళి చేసుకున్నాను అనీ చెప్పాను. నేను లేనప్పుడు నువ్వు బయటకు వెళ్దామన్నా వీలు కాదు. ఒకవేళ వెళ్ళినా ఎవరైనా నిన్ను చూస్తే పాపం అని తెచ్చి ఇంట్లో దిగబెడ్తారు. ఇంక అందరి పిల్లలకు పుట్టినరోజులు చేస్తారంటావా? నీకు అందరిలాగే కావాలంటే అలాంటివాళ్లనే చేసుకోవాల్సింది. ఇలాంటి వేషాలు నా దగ్గర కుదరవు'' విసవిసా బయటకి వెళ్ళిపోయాడు రవి.

ఇంక ఆ మాటలకి సరయూ తల తిరిగిపోయింది.

నా అందం పెళ్ళి చేసుకునేందుకు కావల్సి వచ్చింది కానీ ఈ అందం ఇప్పుడు రవి అనుమానానికి కారణం అయ్యింది. తన పైన అనుమానంతో ఏకంగా మతి సరిగా ఉండదు అని ప్రచారం చేశాడా? ఇంకా ఇలాంటి వ్యక్తితో బ్రతకడం నన్ను నేనే మోసం చేసుకున్నట్లు అవుతుంది.

భార్యంటే నమ్మకం లేదు. భార్య అభిప్రాయాలంటే విలువ లేదు. ఇలాంటి మనిషితో కలిసి గడపడం పెళ్లి అన్పించుకోదు ఇంకేదో అవుతుంది.

ఇప్పుడే పాప కూడా ఎదుగుతోంది. రేపు దానిని మానసికంగా హింసిస్తే పిచ్చిది అయిపోవచ్చు. లేదా తండ్రి నిర్లక్ష్యం తట్టుకోలేక శాడిస్టులాగా మారవచ్చు.

ఇంక తప్పదు రవి వచ్చేలోగా పాపను తీసుకుని వెళ్ళిపోవాలి. ముందు ఈ చెరసాల నుంచి బయట పడ్డ తర్వాత ఏదో ఒకటి చెయ్యొచ్చు అని సరయూ నిర్ణయించుకుని తన పాస్‌పోర్ట్ అవీ తీసుకుని బట్టలు సర్దుకుని పాపాయిని తీసుకుని గుమ్మం బయట అడుగు పెట్టింది.

సరయూకి ఇంకా మంచిరోజులు రాలేదేమో! రవి గుమ్మంలో ఎదురుపడి ఇంట్లోకి తీసుకొచ్చాడు విసురుగా.

"ఏంటీ పిల్లను, పెట్టెను తీసుకుని ఎక్కడికి వెళ్తున్నావు. ఎవరైనా ఫ్రెండ్ దొరికాడా వాడితో కలిసి ఎక్కడికైనా పోదాం అనుకుంటున్నావా?'' వెకిలిగా అడిగాడు రవి.

తనని రెచ్చగొట్టి తన ఆత్మగౌరవంపై దెబ్బకొట్టాలని రవి అంటున్న మాటలు సరయూకి అర్థం అయ్యాయి. మామూలుగా అయితే ఏడుస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయేది.

కానీ ఇంక లాభం లేదు. ఎదురుతిరిగి తీరాలి అనుకుని "నీ ఇష్టం వచ్చినట్లు అనుకో. నీ మాటలు వింటుంటే ఇంకా ఇదే ఇంట్లో కుక్క కన్నా హీనంగా బ్రతకలేను. నా బిడ్డను తీసుకుని ఎక్కడికో వెళ్ళి హాయిగా బ్రతుకుతాను'' అంది సరయూ.

"నీ బిడ్డా! అది నీకు ఒక్కదానికే పుట్టిన బిడ్డ కాదుగా. దానిపై నాకు హక్కుంది.

అయినా నీకే దిక్కులేదు దీన్నెలా పోషిస్తావు? మర్యాదగా దానిని ఇక్కడ పెట్టి వెళ్ళు. నువ్వెక్కడికి పోయినా, ఏం అయినాసరే ఫర్వాలేదు'' అన్నాడు రవి.

సరయూ ఏడుపు ఆపుకుంటూ "సాత్వికంటే మొదటే నీకిష్టం లేదు. ఆ పిల్ల నీకెందుకు? పైగా నువ్వెలా పెంచుతావు అంత చిన్నపాపను. నా పిల్లని నాకిచ్చెయ్యి: నీకు పుణ్యం ఉంటుంది'' అంది.

"దానిమీద ప్రేమతోనో లేక ఇంకెందుకో దాన్ని ఇక్కడ ఉంచట్లేదు. నీపైన కక్షతో. అయినా నీకు, ఈ బిడ్డకు ఇన్నాళ్ళు ఖర్చుచేసిన డబ్బుల కోసం దీన్ని ఇక్కడ ఉంచుతున్నాను. మర్యాదగా పదివేల డాలర్లు తెచ్చి బిడ్డను విడిపించుకో.

ఇది నేను ఖర్చు చేసిన దాంట్లో చాలా కొంచెం. మిగతాది నీ తండ్రిచ్చిన డబ్బుందిగా ఇంక పిల్లను పెంచడం అంటావా డబ్బులు విసిరేస్తే వందమంది దొరుకుతారు ఏ పనికైనా. నువ్వేదో నాకు సేవలు చేసి కష్టపడుతున్నావని ఫీలయిపోయి ఇన్నాళ్ళు నీమీద నీకే జాలితో కుమిలిపోయావు'' అన్నాడు రవి సాత్వికను తీసుకుని లోపలికెళ్లిపోతూ.

డబ్బు ఆశతోనో లేక కోపంతోనో రాక్షసుడయిపోయో సరయూ

పాస్‌పోర్టు ఇతర వివరాలు పట్టించుకోలేదు రవి. రవి కనిపెంచనంత దూరంగా వచ్చి చిన్నాచితాకా ఉద్యోగాలు చేసి డబ్బు కొంత కూడబెట్టింది సరయిూ.

* * *

తన కథంతా చెప్పిన సరయిూ "మిగిలిన సంగతి మీకు తెలుసుగా. సంవత్సరం నుంచి కష్టపడి డబ్బు కూడబెట్టాను. మనసులో మాత్రం బెంగ సాత్వికను ఏం చేశాడో రవి అని.

కానీ తప్పదు కదా. రవితోనే కల్సి ఉండి రేపు సాత్విక జీవితం పూర్తిగా పాడుచేయడం ఇష్టం లేక ఇలా బయటకు వచ్చాను" అంది కళ్ళు తుడుచుకుంటూ.

తన కథంతా విన్నాక నాకు నమ్మశక్యం కాలేదు. కానీ జరిగింది మాత్రం నిజం అని సరయిూ చెప్పిందిగా.

"ఇప్పుడు నేనేం చేయాలి?" అడిగాను నేను సరయిూని.

"మీరు నాతో వచ్చి నాకు తోడుగా ఉండాలి" అంది సరయిూ.

"ముందే రవి అలాంటివాడు అంటున్నారు. ఇప్పుడు నేను మీకూడా వస్తే అసలుకే మోసం వస్తుందేమో?" అన్నాను నేను.

"రవి ఈపాటికే చాలా అనుకుని ఉంటాడు. వాళ్లమ్మకీ చెప్పి ఉంటాడు. ఆవిడొచ్చి మా అమ్మావాళ్లకి చెప్పేసి ఉంటుంది. అందుకే ధైర్యం లేక అమ్మ వాళ్ళకి ఫోన్ కూడా చేయలేదు. నాలాంటి దురదృష్ట వంతురాలిని కన్నందుకు వారికి ఆ కష్టాలు తప్పవు. నేను ఒంటరిగా వెళ్లలేక కాదు కానీ మళ్ళీ నయానో భయానో నన్ను అక్కడ ఉంచేసినా ఉంచేస్తాడు లేదా డబ్బు తీసుకుని మళ్లీ గెంటేసినా గెంటేస్తాడని భయం" అంది సరయిూ.

"సరయిూ మీరేం బాధపడకండి. మీతో రావడానికి నాకేం అభ్యం తరం లేదు" అని నేను ఇంటికి వచ్చేశాను.

* * *

అప్పట్నించీ నాకేదో తెలియని దిగులు. బహుశా సరయిూ పైన నేను పెంచుకున్న ప్రేమ వలన కాబోలు తన కష్టాలకి నాకూ బాధ వస్తోంది అనుకున్నాను.

ఇన్నాళ్ళు మా స్నేహంలో తను ఈ విషయం ఎందుకు చెప్ప లేదు. ఏమో ఎందుకో అందుకు. అదంతా అనవసరం తను నేను ఎంతో అభిమానించే వ్యక్తి. తనకు సాయం చేయడమే నా పని అని గట్టిగా నిర్ణ యించుకున్నాను.

అనుకున్నట్లే రవి ఇంటికి నేను, సరయిూ వెళ్లాం. వెళ్లేసరికి రవి ఇంట్లో లేడు.

ఎవరో ఒక విదేశీ అమ్మాయి వచ్చి తలుపు తీసింది "ఎవరు కావాలి?" అని అడిగింది.

రవి గురించి అడిగితే కూర్చోమని లోపలకు వెళ్లింది.

"రవి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడంటారా దీపక్?" నెమ్మదిగా అడి గింది సరయిూ.

"మళ్ళీ ఏమో అలాంటి పనిచేయడేమో?" అంది తనే.

అది ఆ భార్యభర్తల విషయం కనుక నేనేం మాట్లాడలేదు. సరయిూ తన పాప కోసం కళ్లతోనే వెదుకుతోంది కానీ పాప ఎక్కడా కనబడ లేదు.

కొద్దిసేపయ్యాక రవి, పాప బయటనించి వచ్చారు. సన్నగా బలహీ నంగా ఉన్న పాపను చూడగానే సరయిూకి ఏడుపు వచ్చేసింది. లేచి సాత్వికను దగ్గరకు తీసుకోబోతుంటే విసురుగా పాపను లోపలికి నెట్టి "జానెట్! అందర్నీ లోపలకి రానివ్వద్దని అన్నాను తెలియదా. ఎందుకు రానిచ్చావు?" అడిగాడు రవి ఇంగ్లీషులో ఆ అమ్మాయిని.

"మీ ఇండియన్స్‌లా ఉన్నారని రానిచ్చాను నాకేం తెలుసు" అంది జానెట్ అనే అమ్మాయి. సరయిూ కలుగజేసుకుని "నేనేం ఇక్కడ ఉండ డానికి రాలేదు రవీ. నా బిడ్డను నాకివ్వు నేనెళ్లిపోతాను" అంది.

"నీ బిడ్డా చాలా తొందరగా గుర్తు వచ్చిందే?" అన్నాడు వెటకా రంగా.

"పాపను నేను మర్చిపోయానో నువ్వు గెంటేస్తే వెళ్ళిపోయానో నీకూ తెలుసు, నాకూ తెలుసు. మర్యాదగా నా పాపను ఇవ్వు. నీకు డబ్బేగా కావాల్సింది తెచ్చాను" అంది సరయిూ.

అప్పటికి రవి దృష్టి నామీద పడింది.

"ఓహో నేనేమో అనుమానించాను. ఇదీ అదీ అన్నాను. నీ బుద్ధి నాకు తెలియదా నీ బాయ్‌ఫ్రెండ్ నాకన్నా స్మార్ట్‌గా ఉన్నాడే..." అంటూ నాకేసి తిరిగి "ఏమయ్యా చూస్తే ఇండియన్‌వి. పెళ్ళయిన అమ్మాయికి వలవేయడానికి నీకు సిగ్గులేదా?" అన్నాడు.

నాకింక కోపం ఆగలేదు కానీ నా కోపం వలన సరయిూకి నష్టం కలు గకూడదని కంట్రోల్ చేసుకుంటూ "సారీ రవీ. నేనీ అమ్మాయిని వలలో వేసుకున్నానో లేదో, అలా చేయడానికి నాకు సిగ్గుందో లేదో చెప్పా ల్సిన అవసరం నాకు లేదు. నువ్వు తనని నీ ఇంట్లోంచి గెంటేశావు. ఆడ పిల్లని, దేశంకాని దేశంలో ఎవరైనా ఏదైనా చేస్తారని కూడా ఆలోచించ లేదు.

అప్పుడు లేని బాధ ఇప్పుడెందుకు? అప్పుడే సరయిూని ఎవరైనా ఏదైనా చేసినా, చంపేసినా నీకు ఆనందంగా ఉండేది ఏమో? అలాకా కుండా నువ్వు వేసుకున్న అంచనాలు తారుమారుచేస్తూ నువ్వు అడిగి నంత డబ్బు తీసుకొచ్చింది. నీ డబ్బు నువ్వు తీసుకుని ఆమె బిడ్డను ఆమెకివ్వు" అన్నాను.

"అవును కదా. మీరెప్పుడు వస్తారా అప్పుడిచ్చేద్దాం చేతులు కట్టు కుని ఇన్నాళ్ళూ పెంచాను దీన్ని. అదేం కుదరదు. ముందు మీరిద్దరూ బయటకు పొండి" అన్నాడు రవి.

ఇంతలో జానెట్ రవిని లోపలికి పిల్చింది. కాసేపు వాళ్లిద్దరూ ఏదో అరుచుకున్నాక రవి బయటకు వచ్చి "సరే సాత్వికను బయటకు ఇచ్చే స్తాను. కానీ నాకు ఇంకో ఇరవై వేల డాలర్లు కావాలి ఇస్తావా సరయిూ?" అన్నాడు.

సరయిూ తెల్లబోయింది.

"బిడ్డతో వ్యాపారం చేయడానికి నీకు సిగ్గుగా లేదా? అసలు నువ్వు దాని కన్నతండ్రివేనా?" అంది ఆవేశంతో పెదాలు ఒణుకుతుండగా.

"ఆ విషయం నువ్వే చెప్పాలి" అన్నాడు రవి వ్యంగ్యంగా నవ్వుతూ.

"ఛీ... నువ్వింత నీచుడువని తెల్సి వచ్చానుగా నాదే తప్పు. పద దీపక్ ఈ విషయం ఇక కోర్టులో తేల్చుకుంటాను" అంది సరయిూ ఆవే శంగా.

"వెళ్ళు. కోర్టుకే వెళ్ళు. కానీ విషయం తేలేసరికి ఇంకా చాలా టైం పట్టేస్తుంది. అంతవరకూ నీ బిడ్డ నాదగ్గర, నీ దగ్గర కాక ఎక్కడో బ్రత

కాల్సి ఉంటుంది'' అన్నాడు రవి.

నేనింక ఆలోచించకుండా పర్సు తీసి ఇరవై వేల డాలర్లకి చెక్కు రాసి రవి చేతికి ఇచ్చాను.

చెక్కు చెల్లుతుందా అంటూ అడుగుతున్న రవి నా తీవ్రమైన రూపం చూసి కొంత, సాత్విక ఇక్కడే ఉంటే జానెట్ ఊరుకోదని కొంతా "ఆ ఎందుకు చెల్లదు. బంగారుబాతులా ఉన్నావు. కనుకే సరయూ నిన్ను ఆశ్రయించింది. నాకేం అనుమానం లేదు''అంటూ చెక్కు తీసుకున్నాడు.

"సాత్వికకు సంబంధించిన కాగితాలు ఇవ్వు ముందు'' అని గదమాయించాను.

"నో ప్రాబ్లెం. నేనెప్పుడూ మాట మీదే నిలబడతాను'' అంటూ అన్నీ ఇచ్చేశాడు.

అప్పుడు సరయూకి అర్థమైంది రవి జానెట్‌ని మళ్లీ పెళ్ళి చేసుకున్నాడని. కానీ తనకు విడాకులు ఇస్తానని అనడం లేదంటే ఏం పథకాలు వేస్తున్నాడో కానీ ఇక్కడ కోర్టులు చుట్టూ తిరిగి లాయర్లను మాట్లాడుకునేంత స్థోమత తనకు లేక వీలయినంత త్వరలో పాపను తీసుకుని ఇండియాకి వెళ్ళిపోవచ్చనే ఉద్దేశంతో పాపను ఎత్తుకుని గబగబ బయటకు వెళ్ళి నిలబడింది.

సాత్విక బర్త్ సర్టిఫికెట్ మిగిలిన కాగితాలు సరిచూసుకుని నేను బయటకు వచ్చేశాను.

ఇంటికి రాగానే సరయూ నా కాళ్ళపైన పడి నాకు దణ్ణం పెట్టింది. ఊహించని ఆ చర్యకు కంగారుపడి "సరయూ ఏంటిది పిచ్చిదానిలా లే'' అంటూ లేవదీసాను.

నా చేతులు పట్టుకుని ఏడుస్తూ చెప్పింది.

"మీరు నాకు దేవుడితో సమానం. ఈరోజు నా సాత్విక నా చేతుల్లో ఉందంటే అది కేవలం మీ దయే. మీ డబ్బు ఎప్పటికైనా తిరిగి ఇవ్వగలను గానీ మీ రుణం మాత్రం తీర్చుకోలేను. నా జీవితకాలం మీకు బానిసగా ఉన్నా మీ రుణం తీరదు'' అంది సరయూ.

నేను తనని ఓదార్చి "సరయూ నేను కేవలం నీ ఫ్రెండ్‌ని. భగవంతుని అంత గొప్పవాడ్ని చేసి మన స్నేహం పాడుచెయ్యకు. ముందు సాత్వికను ఆరోగ్యకరంగా తయారుచేయాలి. చూశావా ఎంత బలహీనంగా ఉందో. ముందా పనిచూడు. ఎంత త్వరగా సాత్వికని లావు చేస్తావో చూస్తాను'' నవ్వుతూ అన్నాను.

వెంటనే తన అమ్మానాన్నకి ఫోన్ చేసింది సరయూ. ఆమె ఫోన్ కాల్ వినగానే వారు ఏడ్చేశారు.

"ఏంటమ్మా మీ అత్తగారు ఏదేదో యాగీ చేస్తోంది. నువ్వా ఫోన్ కూడా చేయలేదు. ఆ మాటలు పడలేక చచ్చిపోదామంటే మీ నాన్నగారే ఆపారు. సరయూ ఇలా చేస్తుందంటే నేను నమ్మను. దాని విషయం, దాని బిడ్డ విషం తెలిసేదాకా నేను బ్రతికుంటాను. నువ్వు బ్రతికుండాలి. మనకున్న బిడ్డ సరయూ ఒక్కతే దానికి అవసరం అయినప్పుడు మనం లేకపోతే ఇక మన పుట్టుక వృధా అని ఆపారమ్మా. రవి ఇంత ఇలాంటి మనిషి అనుకోలేదు'' ఏడుస్తూ చెప్పింది సరయూ తల్లి.

సరయూ తండ్రితో మాట్లాడుతూ "నాపైన నీకున్న నమ్మకానికి థ్యాంక్స్ నాన్న. ఇన్నాళ్ళు మిమ్మల్ని బాధపెట్టాలనే ఫోన్ చేయలేదు. ఈనాడు నీ మనవరాలు నా దగ్గరకు వచ్చేసింది. త్వరలో మిమ్మల్ని కలిసి అన్ని విషయాలు చెప్తాను'' అంది సరయూ.

★ ★ ★

కొంతకాలం ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యాం. కానీ ఎప్పుడైనా కలిసినప్పుడు సాత్విక నా దగ్గరే ఉండేది. చాలా తొందరగానే సరయూ తన కూతుర్ని బొద్దుగా, ముద్దుగా, ఆరోగ్యంగా తయారుచేసేసింది.

నేను ఇండియాకి వెళ్లడం ఇంకా కొంతకాలం పడ్తుందని తెలియడంతో అమ్మనీ, నాన్ననీ ఇక్కడకు రమ్మన్నాను. నన్ను చూడాలనే కోరికతో అమ్మ వెంటనే ఒప్పేసుకుంది. వాళ్ళు వచ్చే విషయం, తేదీ తెలియడంతో సరయూకి చెప్పాలని తన ఇంటికి వెళ్లాను.

నన్ను చూడగానే సాత్విక పరిగెత్తుకుంటూ వచ్చి "డాడీ" అని నన్ను పట్టేసుకుంది. ఆ మాటకి నాకేదో తెలియని ఆనందం మనసులో. ఏమనాలో తెలియక ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాను. సరయూ ముఖం కళ తప్పిపోయింది. నేను చెప్పిన విషయాలకు తను ఆనందించినా తన మూడ్ మారిపోయిందని అర్థం కావడంతో నేను త్వరగానే బయటికి వచ్చేశాను.

కొంచెం దూరం వచ్చి చూసుకునేసరికి నా సెల్‌ఫోన్ సరయూ ఇంట్లో మర్చిపోయానని గుర్తొచ్చింది. వెనక్కు వెళ్ళేసరికి సరయూ మాటలు వినిపిస్తున్నాయి.

వినడం సభ్యత కాదని తెలిసినా నా పేరు రావడంతో వినడం మొదలెట్టాను.

"సాత్వికా. తప్పు నాన్నా! దీపక్ అంకుల్‌ని నువ్వు డాడీ అనడం తప్పు. ఇంకెప్పుడూ అనకేం'' సరయూ అంటుంటే-

"ఏంకాదు నాకు అలాగే ఇష్టం'' అంటోంది సాత్విక.

"డాడీ అంటే మనతోనే ఉంటారు. అంకుల్ కనుకే వేరేచోట ఉంటున్నారు. అర్థమైందా?''

దానికి మళ్లీ సాత్విక "అయితే మమ్మీ ఈసారి మనింటికి వచ్చెయ్యమంటానులే. అప్పుడు డాడీ అనచ్చుగా'' అంటోంది.

సరయూ ఈసారి గట్టిగా "నీకిప్పుడేం తెలియకపోయినా నువ్వు నా దగ్గర ఉండడానికి కారణం ఆ అంకుల్. ఇవన్నీ కాదు ఆ అంకుల్ వాళ్ల అమ్మా, నాన్న వస్తున్నారు. వాళ్ళు అంకుల్‌ను నువ్వు డాడీ అనడం వింటే నిన్ను కర్రతీసుకుని కొట్టేస్తారు. అంతేకాదు ఇంకెప్పుడు అంకుల్‌ని మనింటికి రానివ్వరు. తెలిసిందా?'' ఇక సాత్వికకు ఏం అనాలో తెలీక కాబోలు ఏం మాట్లాడలేదు.

నేను నిట్టూర్చి తలుపుకొట్టాను.

సరయూ నన్ను చూసి నవ్వి "లోపలికి రండి'' అంది.

నా మొబైల్ అని సైగ చేశాను.

తెచ్చి ఇచ్చింది.

"కొంచెం పనుంది వెళ్తాను''అని వచ్చేశాను.

అనుకున్నట్లే అమ్మ, నాన్న వచ్చారు. అమ్మ చాలాకాలం తర్వాత నన్ను చూడడంతో నన్ను పట్టుకుని ఏడ్చేసింది. నాకెందుకో మనసంతా ఆహ్లాదంగా మారిపోయింది. ఆ మర్నాడు సరయూ, సాత్విక వచ్చారు. వారిని చూసి అమ్మ ఎంతో ముచ్చటపడింది. అమ్మ సరయూ వెళ్ళాక తన గురించి తెలుసుకుని గంటలు గంటలు బాధపడింది.

మర్నాడు సరయూ ఇంటికెళ్ళి "మీ సాత్విక నాకు చాలా నచ్చింది.

మేమున్నంతకాలం మా దగ్గరే ఉంచుకునే నీకేమైనా అభ్యంతరమా?'' అడిగింది అమ్మ.

"నాకేం అభ్యంతరం లేదు ఆంటీ. మిమ్మల్ని విసిగించేస్తుంది ప్రశ్నలతో'' అంది సరయూ.

"లేదమ్మా సాత్త్విక చాలా మంచి పిల్ల. రేపు నువ్వు ఆఫీసుకి వెళ్లేటప్పుడు మా దగ్గర వదిలేసి వెళ్ళు'' అని నాన్న కూడా అనడంతో సరయూ "అలాగేనండి'' అంది.

మర్నాడు సాయంత్రం నేను వచ్చేసరికి సాత్త్విక అమ్మ దగ్గర కూర్చుని అడుగుతోంది.

"మామ్మగారూ, నన్ను మీరు కొడతారా?'' అని.

"ఏం నాన్న నువ్వు నా బంగారం. నిన్నెందుకు కొడతాను?'' ఆశ్చర్యంగా అంది అమ్మ.

"మరేమో నేను అంకుల్‌ని ఒకసారి డాడీ అని పిల్చానుగా. అంకుల్ మీతో చెప్పేశారేమో. అలా పిలిస్తే మీరు కొట్టేస్తారు అంది అమ్మ. ఇంకెప్పుడూ పిలవనండి. ప్రామిస్'' అంది సాత్త్విక అమాయకంగా.

"లేదురా కన్నా. నిన్నేం చేయను. నువ్వలాగే పిలువు'' అంటోంది అమ్మ.

నేనామాటకి ఆగలేక "అమ్మా ఏంటి అలా చెప్తున్నావు చిన్నపిల్లకి. రేపట్నించి తను అలా పిలిస్తే ఏం బావుంటుంది?'' అన్నాను కొంచెం కోపంగా.

ఇంతలో నాన్న కలుగజేసుకుని "సరయూతో నేను మాట్లాడదామనుకుంటున్నా్నా. చిన్న పిల్ల దేముడితో సమానం. ఆ దేవుడే సాత్త్విక చేత అలా పలికించాడేమో? అయినా సరయూను నువ్వు పెళ్ళి చేసుకుంటే తప్పేంటి?'' అన్నారు.

దానికి నేను సీరియస్‌గా "అమ్మ, నాన్న ఇక ఆగండి. ముందు సాత్త్వికను దింపేసి వచ్చి మాట్లాడతాను'' అని తనను సరయూకి ఇచ్చేసి వచ్చాను.

వచ్చేసరికి ఇద్దరూ రుసరుసలాడుకుంటున్నారు.

నన్ను చూసి మళ్ళీ వాళ్ల పనిలో వాళ్ళున్నట్లు నటిస్తున్నారు. నాన్న సైగ చేయగానే అమ్మ తలపైన చేయి పెట్టుకుని "అయినా నా ముఖానికి అంత అదృష్టం లేదండీ. కోడలు, మనవలు ఈ ఆనందం నా జాతకంలో రాసి పెట్టలేదు'' అంది.

"అమ్మ ఇప్పుడెందుకీ గొడవ?'' అన్నాను కోపంగా.

"అవును. ఎప్పటికప్పుడు ఇలాగే నోరు మూయిస్తావు. ఎన్నాళ్ళిలా పెళ్ళి చేసుకోకుండా ఉంటావు. ఇప్పుడు మేమున్నాం ఆ తర్వాత ఒంటరివాడివి అయిపోతావు. ఇంత తెలివైనవాడివి. నీకు నేను చెప్పాల్సిన అవసరం ఏంటి?'' అన్నారు నాన్న.

"నాన్నా ఆ సంగతి నాకు తెలుసు. కానీ ఒకసారి ఎదుర్కొన్న చేదు అనుభవం పెళ్లంటేనే అసహ్యం కలిగించింది. నేనిలాగే సుఖంగా ఉన్నాను'' అన్నాను బాధగా.

"లేదురా. అందరూ ఆ రాక్షసిలాగా ఉంటారనుకుంటే ఎలా? అది నా ప్రాణానికి కోడలిలా వచ్చి మోసం చేసి నీ జీవితం పాడుచేసింది. సరయూ మంచి పిల్లరా. అయినా తనకి కష్టం అంటే తెలుసు. నువ్వు తనని పెళ్ళి చేసుకుంటే ఒకరికొకరు ఆధారం కావడమే కాక సాత్త్వికకి తండ్రి ప్రేమ దొరుకుతుంది'' అంది అమ్మ నచ్చజెప్పాలని ప్రయత్నిస్తూ.

"నువ్వు ఎన్ని అయినా చెప్పమ్మా. ఈ ఆడాళ్లంతా పెళ్లికి ముందు మంచిగానే ఉంటారు. అయ్యాకే తెలుస్తుంది. నువ్వింకేం చెప్పినా చేస్తాను. ఈ విషయంలో మాత్రం నన్ను వదిలెయ్యి'' అంటూ గదిలోకి వెళ్ళి తలుపేసుకుని మంచానికి అడ్డం పడి కళ్ళు మూసుకున్నాను.

ఇన్నాళ్ళు ఏ జ్ఞాపకాలు రాకూడదని పని పని అంటూ ఒక యంత్రంలా పనిలో నిమగ్నమైపోయానో ఈరోజు అమ్మ వలన అన్నీ ఒక్కొక్కటే గుర్తురాసాగాయి.

* * *

అమ్మ, నాన్న, అక్క, నేను చాలా చక్కని కుటుంబం. అక్కకి పెళ్లి అయి వెళ్ళిపోయాక నేను చాలా రోజులు అక్కపైన బెంగ పెట్టుకున్నాను.

అంత దగ్గరగా ఉండేవాళ్లం నేనూ, అక్క. నా ఇంజనీరింగ్ పూర్తికాగానే అమెరికాలో ఉద్యోగం రావడంతో మాకు తెలుసున్నవారందరిలో నా పేరు మారుమ్రోగిపోయింది. అమ్మ, నాన్న, అక్కల సంతోషానికి హద్దులే లేవు.

నెలరోజుల్లో నేను అమెరికా వెళ్ళిపోవాలని అన్నీ సిద్ధం చేసుకుంటున్న తరుణంలో ఒకరోజు బయటనుంచి నేనింటికి వచ్చేసరికి ఇంటి నిండా జనం. ఎవరూ నాకు పరిచయం ఉన్నవారు లేనందున నెమ్మదిగా నాగదిలోకి నేను వెళ్ళబోతుంటే అమ్మ నన్ను పిల్చింది.

"నాన్న దీపూ ఇలారా. మామయ్య వాళ్లతో మాట్లాడు'' అంటూ పిలిచారు. నాకీ మామయ్య ఎవరో అర్థంకాలేదు. ఇన్నాళ్ళూ నాన్న చెల్లి, తమ్ముడు అంటే మా మేనత్త, బాబాయి తప్ప నాకు మామయ్యలు ఎవరూ లేరు. వారి దగ్గరకు వెళ్లగానే "దీపక్ నేనెవరో తెలుసా. నీ సొంత మేనమామని అంటే మీ అమ్మకు స్వయానా అన్నయ్యాని'' అన్నాడు ఒక పెద్ద మీసాలాయన.

నా ఆశ్చర్యం రెట్టింపుచేస్తూ తెల్లముఖం వేసుకుని అమ్మకేసి చూశాను. తర్వాత చెప్తాను వెళ్ళు అన్నట్లు కళ్లతో సైగ చేసింది అమ్మ.

వాళ్లకి నమస్కారం చేసి లోపలికి వెళ్ళబోతుంటే "అసలు ఇన్నాళ్లకు మీ ఇంటికి మేం ఎలా వచ్చామో నీకు తెలుసా దీపక్?''

అంది మామయ్య భార్య.

ఈసారి ఆవిడకేసి చూసి చిన్నగా నవ్వాను.

"ఇది రేఖ. నాకున్న ఒకే ఒక్క కూతురు. నీకు తెలుసా ఇది. మీ కాలేజ్‌లోనే చదువుతోంది. నీకన్నా ఒక సంవత్సరం చిన్నది అనుకో. అందుకే నీకు జూనియర్. మీ కాలేజ్‌లో నీపేరు మారుమ్రోగుతోందిట కదా. ఇంటికొచ్చి ఆ విషయం చెప్పింది. దీపక్ చాలా తెలివైన అబ్బాయి. కాలేజ్‌లో అందరూ ఎంతో పొగుడుతున్నారు అంటూ. నీ ఇంటిపేరు అవీ తెలిశాక వివరాలు చూస్తే ఇంకేముంది నువ్వు మా చెల్లి కొడుకువే అని మాకు తెల్సింది'' పూర్తిచేశారు మావయ్య.

"నువ్వు చాలా తెలివైనవాడివయ్యా. మీ అమ్మ చాలా అదృష్టవంతురాలు ఇంత గొప్ప కొడుకును కంది'' ఇంకా పొగిడేస్తున్న మామయ్య మాటలకు అడ్డుకట్ట వేస్తూ "అమ్మా నేను స్నానం చేసి వస్తాను'' అని లోపలకు నడిచాను నేను.

స్నానం చేసి బాత్రూంలోంచి బయటకు వచ్చేసరికి రేఖ నా గది గుమ్మంలో తచ్చాడుతోంది. నాకెందుకో చిరాగ్గా అనిపించింది. అసలు నాకు పరిచయమే లేని అమ్మాయి ఇంత సరాసరి నా గది దగ్గరకు

రావడం ఏంటి? తప్పదని హాయ్ అన్నాను బాగోదని.

వెంటనే లోపలికి వచ్చేసి "నువ్వు మా బావవి కావడం నా అదృష్టం బావా. నాన్న చెప్తే నమ్మలేదు తెలుసా. నువ్వంటే నాకు ఎప్పట్నించో గౌరవం బావా. మా ఫ్రెండ్స్ నువ్వు మా సొంత బావవి అని తెలిసేసరికి చాలా కుళ్ళుకున్నారు తెలుసా?'' అంటూ నా బుర్ర తినేయడం మొదలుపెట్టింది రేఖ.

ముఖానికి నవ్వు పులుముకుని మౌనంగా తన సుత్తి అంతా భరించాను. కాస్సేపటికి మామయ్య కూడా వచ్చి ఆదివారం వాళ్లింటికి భోజనానికి రమ్మని పిల్చి వెళ్ళిపోయాడు.

వాళ్ళు వెళ్లగానే ఊపిరి పీల్చుకుని అమ్మ ఇచ్చిన కాఫీ తాగుతూ "అమ్మా ఇంత హఠాత్తుగా నీకు అన్నయ్య ఎక్కడ్నించి వచ్చాడు?'' నవ్వుతూ అడిగాను.

"అబ్బ నీకన్నీ హాస్యమే. నువ్వూరుకోరా. మీ నాన్నను నేను పెళ్ళి చేసుకోవడం మా అమ్మకి, నాన్నకీ ఇష్టమేకానీ అన్నయ్యకి ఇష్టం లేదు. అందుకే నా ఆస్తి కూడా తను తీసేసుకోవడమే కాక ఇంతకాలం మన కుటుంబాన్ని వదిలేశాడు'' అంది అమ్మ బాధగా.

"ఎందుకు అమ్మా? నాన్నగారు చాలా మంచివారు. పైగా మీకు తెలిసినవారేగా?'' అడిగాను నేను.

"ఏం చెప్పమంటావురా దీపూ. నేను మీ నాన్నను పెళ్లి చేసుకుంటానని చెప్పకముందే అన్నయ్య నా విషయంలో ఎవరికో మాట ఇచ్చారట. తన మాట పోకూడదని మా పెళ్ళికి ఎన్నో ఆటంకాలు సృష్టించాడు. కానీ ఆ దేవుడి దయ వలన మా పెళ్ళి జరిగిపోవడంతో తనకేదో అవమానం జరిగిందని నాతో తెగతెంపులు చేసుకున్నాడు. మళ్లీ ఇన్నాళ్ళకు ఎందుకొచ్చాడు? బహుశా నువ్వింత వృద్ధిలోకి వచ్చావు. తన కూతుర్ని కట్టబెట్టాలి అని నీకు వచ్చాడేమో?'' అంది అమ్మ.

అమ్మ మాటలు పూర్తికాకముందే నాన్న అందుకుని

"తప్పు హేమా అలా అనవద్దు. ఆ వయసులో పంతాలు, పట్టింపులు ఉంటాయి. ఇప్పుడిక పెద్ద వయసు కదా ఇంక బంధాలు, అనుబంధాలు గుర్తొచ్చి ఉంటాయి'' అన్నారు. నాన్న ఎంత మంచివారో మళ్లీ ఒకసారి రుజువైంది అనుకున్నాను.

"మళ్లీ ఆదివారం ఇంటికి రమ్మన్నాడు ఏం చేద్దాం?'' అని అమ్మ అంటుంటే "అమ్మా అసలారోజు నేను ఈ ఊళ్ళోనే ఉండను. బెంగుళూరు వెళ్ళి అక్కను చూసి బావకి సెలవు దొరికితే అందరం కలిసి తిరుపతి వెళ్దాం'' అన్నాను.

అమ్మ తిరుపతి సంగతి విని ఆనందపడిపోయింది.

"అవును అంతదూరం వెళ్లేముందు తిరుపతి వెళ్లడం మంచిది కన్నా. అలాగే వెళ్దాం'' అంది.

"ఆరోజే వెళ్లాలా?'' అన్నారు నాన్న.

"అవును నాన్నా తరువాత ఒక్కరోజు కూడా నాకు కుదరదు. మామయ్య వాళ్లకి ఫోన్ చేసి ఈ విషయం చెప్పేద్దాం ఊరికి వెళ్ళేముందు'' నాన్న కూడా సరేనన్నారు.

అక్క, బావ మమ్మల్ని చూసి ఎంతగానో ఆనందించారు. ఆ ఏడుకొండలు వాడి దయవలన ఇక్కడ జరగాల్సిన పనులన్నీ పూర్తిచేసుకుని అమెరికాలో కాలుపెట్టాను.

అమెరికాలో జాబ్ గురించి మనవాళ్లు ఎందుకంత గొప్పగా అనుకుంటారో బహుశా దూరపుకొండలు నునుపు అనుకోవడం వలన కాబోలు అన్పించింది అక్కడ జాబ్‌లో చేరిన వారానికే. మెడ తిప్పలేనంత పని అది కూడా హఠాత్తుగా ఎలాట్ చేసి అది పూర్తిచేసే కాలం కూడా చాలా తక్కువ ఇస్తారు.

ఒక బానిసలా ఇరవై నాలుగు గంటలూ పనిచేయాల్సి వచ్చేది. రోజుకున్న ఇరవై నాలుగు గంటలూ, గంటకున్న అరవై నిముషాలు, నిముషానికి ఉన్న అరవై సెకన్లూ కూడా పనిలోనే గడిచిపోయేది.

మొదటినించి తెలివితేటలున్న వాడిని కనుక త్వరగానే బాస్ దగ్గర మంచి పేరు తెచ్చుకోగలిగాను. ఆరునెలలు అయ్యేసరికి అక్కడి జీవితానికి అలవాటు పడి కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాను. అమ్మకి ఫోన్ చేసినప్పుడల్లా ఈరోజు మామయ్య వాళ్లు వచ్చారు అనో లేక రేఖ ఇప్పుడే మనింటినించి వెళ్లిందనో చెప్పేది. నాకున్న ఒత్తిడిలో నేనెప్పుడూ ఆ విషయం తలకి ఎక్కించుకోలేదు.

దాదాపు మూడు నెలల తర్వాత పిడుగులాంటి వార్త రేఖ ఆత్మహత్య చేసుకోబోయిందని అది కూడా నా గురించని అమ్మ నోటి నుంచి. ఈ వార్త విన్నాక నాకు మొదట అర్థం కాలేదు.

"నా గురించి ఆత్మహత్య చేసుకోవాలి అని ప్రయత్నించారా ఎవరు?'' ఆత్రుతగా, ఆదుర్దాగా అడిగాను.

"అదేంట్రా మళ్లీ ఎవరు అంటావు. నీ మామయ్య కూతురు రేఖ. నీకేమో అది గుర్తేలేదు. కానీ పిచ్చిపిల్ల మీ కాలేజీలో నిన్ను చూసిన క్షణం నుంచీ నువ్వంటే ప్రాణం ఇచ్చేంత ప్రేమించిందటరా'' అని మళ్ళీ అమ్మ చెప్పింది.

నాకెందుకో ఆ మాట నమ్మశక్యం కాలేదు. పైగా ఆ విషయం నచ్చలేదు. ఏంటి ఇదంతా? రేఖను నేనెప్పుడూ కాలేజ్‌లో చూసినట్లు కూడా నాకు గుర్తులేదు.

తను మాత్రం నన్ను ఇంతగా ఇష్టపడడం అది కూడా తనంతట తానే నన్ను ప్రేమించేసి, నాకు తనేం చెప్పకుండా నా విషయం తెలుసుకోకుండానే నేను తనను కాదంటానని ఆత్మహత్యకు పాల్పడడం. పైగా నాగురించే ఇలా చేశానని చెప్పడం.

ప్రేమించడం తప్పుకాదు. కానీ తను ఎవర్ని ప్రేమిస్తుందో అసలా వ్యక్తికి తన ప్రేమ సంగతి చెప్పాలి. తర్వాతే కదా ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇలా చేస్తే ఎలా?

ముందుగానే మామయ్యంటే నాకసలు ఇష్టం లేదు. ఇప్పుడు రేఖ చేసిన పని అస్సలు నచ్చలేదు. కొంచెం సేపు నా మనసులో చికాకు వేసినా తర్వాత ఆ సంగతి వదిలేశాను.


అమ్మ మాత్రం నేను ఫోన్ చేసిన ప్రతిసారీ "నీ గురించే రేఖ ఆత్మహత్యకు ప్రయత్నించడంతో బంధువులందరిలో మామయ్య పరువు పోయిందట.

ఎలాగైనా రేఖను నీకిచ్చి పెళ్లి చేయమని ప్రాధేయపడుతున్నాడు'' అంటూ ఒత్తిడి తెచ్చేది.

"నాకు రేఖంటే ఏ అభిప్రాయం లేదు. పైగా నేనిప్పుడు పెళ్ళి గురించేం ఆలోచించడం లేదు. నన్ను వదిలెయ్యి సెలవు లేదు'' అని చాలా రోజులు తోసుకొచ్చాను. కానీ కొంతకాలం తర్వాత మాత్రం నేను ఇండియా వెళ్లక తప్పలేదు.

* * *

ఏడాదిన్నర తర్వాత నా దేశంలోకి అడుగుపెట్టాను. అక్కడ ఉరు



కుల పరుగుల జీవితం నుంచి ఒక్కసారిగా స్వేచ్ఛా జీవితంలోకి అడుగుపెట్టేసరికి నాకెంతో హాయిగా అన్పించింది.

కనీసం వారంరోజులు సంతోషంగా గడపాలి అమ్మానాన్నతో అనుకుంటున్న తరుణంలో నేను వెళ్ళిన మర్నాడే మామయ్య కుటుంబం మా ఇంటిపైన దాడి చేసింది.

"రేఖ అమాయకురాలు. దానికి నువ్వంటే చచ్చేంత ఇష్టం. నువ్వు దాన్ని పెళ్లి చేసుకోనంటే ఈసారి నిజంగానే చచ్చిపోతుంది. ఇప్పటికే మా బంధువుల్లో అందరికీ ఈ విషయం తెలిసి దానిని పెళ్లి చేసుకునేందుకు ఎవరూ రావట్లేదు.

నా ఆస్తి మొత్తానికి అదే వారసురాలు. నీకే లోటు రానివ్వను దీపక్" అంటూ మామయ్య రకరకాలుగా నన్ను మభ్యపెట్టి పెళ్ళికి ఒప్పించాలని ప్రయత్నించాడు.

వాళ్ళు వెళ్లాక "అమ్మా ఇన్నాళ్ళు లేని చుట్టరికం ఇప్పుడు కలుపుకొచ్చాడు. అయినా ఇదేంటి తనేదో నా ప్రమేయం లేకుండా ఆత్మహత్యకు ప్రయత్నించడం, ఈయనేమో నన్ను ఆ కారణంతో ఒప్పించడం. సారీ అమ్మా నేనిప్పుడు పెళ్ళి చేసుకోను" గట్టిగా అమ్మకు చెప్పేశాను.

అక్క వచ్చి కూడా అదే మాట అంది. "అమ్మా వాడికి ఇష్టం ఉన్నప్పుడే వాడికి పెళ్ళి చేయండి" అని.

నాన్న మాత్రం "మీ మామయ్య ఎలాంటివాడైనా రేఖ నిజంగా నిన్ను ప్రేమిస్తోందేమో దీపూ. పైగా బంధువర్గాల్లో అంతా నీ పేరు మారుమ్రోగింది రేఖ విషయంలో.

అన్నింటికన్నా ముఖ్య విషయం చావుకే సిద్ధపడిందంటే రేఖ నిన్నెంత ప్రేమిస్తుందో అర్థం చేసుకో. మనం ప్రేమించిన వాళ్ల కన్నా మనని ప్రేమించేవారిని పెళ్ళి చేసుకుంటే సుఖపడ్తాం" అన్నారు.

ఎప్పుడూ నాకేం చెప్పని నాన్న మొదటిసారి నాకిలా చెప్పేసరికి నేనూ పెళ్లికి ఒప్పుకున్నాను.

రేఖంటే కోపం, అసహ్యం నాకు లేవు. అసలు ఈ రేఖ అనే వ్యక్తి పైన, తన స్వభావం పైన నాకే అవగాహనా లేదు. పైగా నాకు పెళ్ళి గురించి ఇప్పుడే ఆలోచనా లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో పెళ్ళి చేసుకోవడం ఇబ్బందిగా అన్పించినా నన్నెంతో ప్రేమించే అమ్మ, నాన్నల మాట కాదనలేక సరేనన్నాను.

నేను ఇండియా వచ్చిన వెంటనే అమ్మతో చెప్పాను. నేను ఇంక అక్కడికి వెళ్ళేలా లేను. ఇక్కడే ఏదో ఉద్యోగం చూసుకుంటాను అని.

అమ్మ ఎంత సంతోషపడిందో మాటల్లో చెప్పలేను.

"అందరూ పరుగెత్తి పాలు తాగాలని అమెరికాకి పరిగెడుతుంటే నువ్వు మాత్రం అవకాశం ఉన్నా ఇక్కడే ఉండాలి అనుకుంటున్నావా? మనదేశాన్ని మనం మర్చిపోకుండా ఉంటే చాలు, ఈదేశంలో పుట్టినందుకు రుణం తీర్చుకున్నట్లే" అంది.

* * *

ఈ వార్త తెలిసిన వెంటనే మామయ్య ఉరుకులు, పరుగులు మీద మా ఇంటికి వచ్చేశాడు.

"ఏమయ్యా అల్లుడూ! నీకేమైనా మతిపోయిందా? అందరూ అవకాశాలు లేక ఈ దేశంలో పడి మగ్గుతుంటే వచ్చిన అవకాశాన్ని కాలదన్నుతానంటున్నావే? వయసులో ఉండగానే నాలుగురాళ్ళు సంపాదించుకోవాలి. రేఖ కూడా నీతో సమానంగా చదివింది కదా, అది కూడా ఉద్యోగం చేస్తుంది" అంటూ క్లాస్ పీకేశాడు.

నాకు చిర్రెత్తుకు వచ్చింది. ఇన్నాళ్ళు మేం ఎలా ఉన్నామో అక్కర్లేదు. కానీ ఈనాడు నా పెళ్ళి, నా ఉద్యోగం అన్నింటిపైనా ఈయన పెత్తనం ఏమిటి? విసురుగా ఏదో అనబోతుంటే నాన్న, అమ్మ ఆపేశారు.

"అవును దీపూ! ఆ అమ్మాయి కూడా ఆ దేశం చూడాలని ముచ్చటపడుతుందేమో?" అన్నారు.

మామయ్య వెళ్ళాక అమ్మతో అన్నాను. "నాకసలు ఈ పెళ్ళి వద్దమ్మా. ఇలా జులుం చేసే వాళ్లతో నేను బ్రతకలేను. నేను ఎలాంటి వాడినో తెలుసు కదా" అని బాధగా.

"దీపూ మామయ్య ఏదో కాళ్ళావేళ్ళా పడ్డాడని నీకీ సంబంధం చేయడం లేదు. రేఖ నిన్నెంతగానో ప్రేమించింది కదా అని ఒప్పుకున్నాను. ఆ పిల్లను నువ్వు కాదంటే తన ఉసురు నీకు తగులుతుందని కొంతా, పైగా చుట్టాలందరిలో మామయ్య నీ పేరు బయటికి తెచ్చేశాడని కొంతా నీ పెళ్లి రేఖతో కుదిర్చాను. ఆయన పాతకాలం మనిషి. అమెరికా అంటే చాలా గొప్ప అని అన్నయ్య ఉద్దేశం. కూతురికి అమెరికా సంబంధం చేస్తున్నామని అంతా చెప్పేసి ఉంటాడు. నువ్విక్కడికి వచ్చేస్తే తన పరువు పోతుందని, ఏదో చాదస్తపు మనిషి. ఏడాది కాగానే వచ్చెయ్యి రేఖ కూడా ఆ దేశం చూసినట్లు ఉంటుంది" అంది అమ్మ.

నేనిక్కడ ఉన్న నెలా పదిహేనురోజుల్లో రేఖతో నా పెళ్లి జరిగిపోయింది. పెళ్ళి తర్వాత జరిగే కార్యక్రమాలు వద్దంటూ నేను వెంటనే అమెరికా వెళ్ళిపోయాను.

అక్కడికి వెళ్లాక రేఖ వివరాలు అన్నీ సబ్‌మిట్ చేసి రేఖకు వీసా వచ్చి మూడు నెలల తర్వాత న్యూజెర్సీకి వచ్చింది.

రేఖతో నా పెళ్ళి జరిగిందన్న మాటే కానీ రేఖకీ నాకు మధ్య ఇంటిమసీ పెరగలేదు.

నాకు చేతనయినంతలో రేఖకు అన్ని వసతులు సమకూర్చాను. వచ్చిన క్షణం నుంచీ బావా ఇది, బావా అది అంటూ రేఖ బడబడా మాట్లాడుతూ నాకూడానే తిరుగుతుంటే ఈమె నిజంగా అమాయకురాలే, నేనంటే చాలా ఇష్టపడ్తుంది అనుకుని ఆనందించాను. కానీ ఎందుకో ఆమెకి ఇంకా దగ్గరకావడానికి నేనూ ప్రయత్నించలేదు.. తనూ ఆ పని చేయలేదు.

* * *

రేఖ అమెరికా వచ్చిన మూడునెలలకి "బావా మా ఫ్రెండ్ ఇక్కడే ఉన్నాడు. నాకు మెయిల్ ఇచ్చాడు. మనింటికి తన్ని పిలవనా" అంది.

నాకు అందులో అభ్యంతరం పెట్టే విషయం ఏం కనబడలేదు. ఇంజనీరింగ్ చదివిన అమ్మాయి తను.

ఈకాలంలో అమ్మాయిల్తో స్నేహం ఎంత సహజమో అబ్బాయిల్తోనూ అంతే అనుకుని నేనే స్వయంగా ఫోన్ చేసి అతన్ని ఇంటికి పిలిచాను.

సహజంగానే నాకున్న మొహమాటం పైగా రేఖతో అంతగా మాట్లాడే అలవాటు లేని నేను తను నీకు ఎలా స్నేహితుడు అని కూడా రేఖను అడగలేకపోయాను.

మేం పిలిచిన రోజున రేఖ స్నేహితుడు విజయ్ వచ్చాడు. అతను మంచి పొడుగు, ధృఢమైన రూపంతో చూడగానే ఆకట్టుకునేలా ఉన్నాడు. వయసు కూడా కొంచెం ఎక్కువే. నేను ఎంతో స్నేహంగా తనను ఆహ్వానించి మర్యాదలు చేశాను. రేఖలాగా అతను కూడా మంచి వాగుడుకాయ. వారిద్దరూ మాట్లాడుకునే విషయాలకు నాకు ఆశ్చర్యం వేసింది. భూమిపైన ఉన్న ఏ విషయం వదలకుండా మాట్లాడుకున్నారు.

వారిమధ్య నేను చాలాసేపు ప్రేక్షకుడిలాగానే మిగిలిపోయాను.

విజయ్ మాటల సందర్భంలో నాతో అన్నాడు "రేఖను ఇంకా ఉద్యోగంలో ఎందుకు చేర్చలేదు?" అని.

"ఆ ప్రయత్నంలోనే ఉన్నాను" అన్నాను నేను.

"నేనీసారి వచ్చేసరికి రేఖ ఉద్యోగంలో చేరిపోతుందన్నమాట" అన్నాడు విజయ్.

అన్నట్లుగానే ఒక మంచి కంపెనీలో రేఖకు ఉద్యోగం చూశాను. తన ఉద్యోగం విషయంలో నాకు పెద్దగా పట్టింపులేదు. తను చేసినా, మానినా నాకిష్టమే. కానీ రేఖకు, ఆమె తల్లిదండ్రులకు తను ఉద్యోగం చేయాలని కోరిక కనుక తనను ఉద్యోగంలో చేర్పించాను.

కొంతకాలానికే రేఖ ఉద్యోగానికి బాగా అలవాటు పడింది. కానీ మా ఇద్దరికీ ఇదివరికట్లా కనీసం మాట్లాడుకోవడానికి కూడా సమయం ఉండేదికాదు.

దానికి ఎక్కువగా రేఖ ఉద్యోగమే కారణం.

"బావా నేనీ రోజు ఎక్కువసేపు ఉండాలి ఆఫీసులో. ఈ శనివారం నాకు పనుంది" అని రేఖ చెబుతుండేది.

ఇక్కడ ఉద్యోగాల స్వభావం తెలుసు కనుక నేనూ పెద్దగా పట్టించుకోలేదు.

ఒకసారి ఆదివారం కూడా పనుందని రేఖ ఆఫీసుకు వెళ్ళిపోయింది.

తను ఇంటి తాళాలు తీసుకెళ్లడం మర్చిపోయింది. నాకు ఏదో పనుండి బయటికి వెళ్లాల్సి వచ్చి, నేను లేనప్పుడు తనొస్తే ఇబ్బంది అని తాళాలు ఇచ్చేందుకు రేఖ ఆఫీసుకి వెళ్ళాను. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది తప్ప ఎవ్వరూ లేరు. నాకు ఆశ్చర్యం వేసింది. ఇంటికొచ్చేసిందేమో అని మళ్లీ వెనక్కి వెళ్ళేసరికి అక్కడ లేదు. ఇక తప్పనిసరై నా పని మీద నేను వెళ్ళిపోయాను.

తిరిగొచ్చేసరికి రేఖ రాలేదు. మధ్యలో వచ్చి నేను లేక ఇబ్బంది పడిందేమో అని బాధపడ్డాను.

రాత్రి ఎనిమిదిగంటలకు రేఖ వచ్చి "ఈ ఆఫీసులో పని చాలా ఎక్కువ బాబూ. చెయ్యలేకపోతున్నాను"అంది.

నాకు తన ధోరణి అస్సలు నచ్చలేదు.

"రేఖా నువ్వెక్కడికి వెళ్ళావు?" అడిగాను.

"అదేంటి బావా? ఆఫీసులో పనుందని నీకు చెప్పే వెళ్ళాను కదా. అయినా నీకంత అనుమానం ఏమిటి?" అంది ఏ మాత్రం తడబడకుండా రేఖ.

తను అబద్ధం చెప్పిందని నాకు తెలిసినా ఇంకా అదే విషయం రెట్టించడం నాకు అసహ్యం వేసి మాట్లాడకుండా నా రూంలోకి వెళ్ళి పడుకున్నాను.

అయితే ఇన్నాళ్ళూ అబద్ధాలు చెప్పింది మళ్లీ వచ్చేవారం ఇదే పని చేస్తుంది అనుకునేసరికి నా ఒళ్ళు మండిపోయింది. విషయం తాడో పేడో తేల్చేయాలని అనుకున్నాను. కానీ చిన్నప్పటినుంచీ అమ్మ, నాన్నగారు నేర్పిన సంస్కారం వలన ఎవరితోనైనా మంచిగా మాట్లాడ్డం తప్ప, నిలదీయడం, తగవులు వేసుకోవడం నాకూ, అక్కకు తెలియదు.

నా మనసులో నేను తర్జన, భర్జన పడుతుంటే ఆదివారం పొద్దున్నే విజయ్ వచ్చాడు. విజయ్‌ని చూడగానే రేఖ ఎదురెళ్ళి ఆనందంగా ఏదో మాట్లాడుతోంది.

నేను గదిలో నా కంప్యూటర్ పైన పనిచేసుకుంటుంటే వారు గుసగుసలాడడం విని నాకు మొదటిసారి అనుమానం వచ్చింది. అసలు రేఖ, విజయ్‌లు ఎలాంటి స్నేహితులని!

కొంచెం సేపటికి విజయ్ వచ్చి "దీపక్ నువ్వూ మాతో రావచ్చుగా?" అడిగాడు.

నేనేదో చెప్పేంతలో "ప్లీజ్ దీపక్. మీరు మా ఫ్లాట్‌కి ఎలానూ రారు. నేనిచ్చే ట్రీట్‌కైనా రావచ్చుగా" అన్నాడు.

అప్పటికే రేఖదీ, తనదీ ప్రోగ్రాం ఫిక్స్ అయిపోయిందనీ, కనీసం రేఖ నన్ను అడగకుండానే విజయ్‌తో బయటకు వెళ్తోందని అర్థమైంది. అసలు తనీ విషయం ఆలోచించను కూడా లేదేమో అన్పించింది.

ఈ సందర్భంలో వేరే ఎవ్వరైనా అయితే తన భార్య పరాయి మగాడితో ఒంటరిగా బయటికెళ్తే ఏం జరుగుతుందో, వారెలా ప్రవర్తిస్తారో అని అనుమానం ఉండేది కనుక తను తప్పకుండా వారితో వెళ్ళేవాడు. కానీ అసలే సున్నితమైన మనస్సున్న నాకు రేఖ చెప్పిన అబద్ధంతో మనసు పాడైపోయింది.

తను ఇప్పుడు విజయ్‌తో పార్టీకి వెళుతుంటే నేను వద్దనలేదే? మరి తను నాతో అబద్ధం ఎందుకు చెప్పాలి? అప్పుడేం చేసిందో ఎక్కడికెళ్లిందో నాకేం తెలుసు.

ఇప్పుడు కూడా ఎక్కడికైనా వెళ్లనీ ఏమైనా కానీ అనుకుని "సారీ విజయ్. నాకు కొంచెం పనుంది" అన్నాను.

నా మాట పూర్తికాక ముందే "చెప్పానుగా విజయ్ మా బావకి అస్సలు ఖాళీ ఉండదని. నువ్వే బలవంతం చేస్తున్నావు" అంది రేఖ.

నేనెక్కడ వాళ్లతో వస్తానోనని భయపడిన రేఖ నా సమాధానానికి రిలీఫ్‌గా ఫీలయింది అని నాకు అర్థమైంది.

వాళ్ళిద్దరూ వెళ్లాక నాలో ఏదో తెలియని బాధ. నా సొత్తు ఎవరో ఎత్తుకుపోతున్నారన్న బాధ కాదు.

ఎందుకంటే రేఖకు నాకు శారీరకంగానే కాదు మానసికంగానూ ఏ బంధం ఏర్పడలేదు. వాళ్ళేం చేస్తారోనని అసూయ కాదు. రేఖను ఆపలేకపోయానన్న నిస్సహాయత కాదు.

రేఖ నన్నెందుకు అడిగి వెళ్లలేదనే పురుష అహంకారమూ కాదు.

నేనెందుకు ఇంత తప్పటడుగు వేశాను. నా జీవితంలో ప్రతీ అడుగు ఎంతో ఆలోచించి వేసిన నేను పెళ్ళి అనే ముఖ్యమైన విషయంలో ఇలా ఎందుకు చేశాను?

జీవితంలో జరిగే అన్ని ఘట్టాల్లో అతి ముఖ్యమైనది పెళ్ళి. మనకు పుట్టుక, చావులు ఒంటరిగానే జరుగుతాయి. కానీ పెళ్లి అనే ఈ ఘట్టం ద్వారా మన జీవితంలో కొత్త బంధం అడుగుపెడుతుంది. ఎంత చిత్రమైనది ఈ తతంగం.

అమ్మానాన్న, అక్క, అన్నయ్య, చెల్లి, తమ్ముడు రక్త సంబంధీకు

లైన వీరందరి నుంచి మనకు తెలియకుండానే కొద్దిగా దూరంగా జరిపే స్తుంది ఈ పెళ్ళి.

అంతవరకూ మనకసలు పరిచయం లేని ఒక కొత్త వ్యక్తికి మనం జీవితంలో సగభాగం ఇవ్వడం, ఆ వ్యక్తే మన జీవిత సర్వస్వం కావడం జరుగుతుంది.

రైల్లోనో, బస్సులోనో మన సీట్లో ఎవరికైనా చోటిచ్చేందుకే ఎంతో ఆలోచిస్తాం. దొంగలు, తాగుబోతులు, పోకిరీలు మన పక్కన కూర్చుంటే మనం లేచి నిలబడేందుకు సిద్ధపడ్తాం తప్ప కొంచెం దూరమే కదా అని సర్దుకుని కూర్చోం.

అటువంటిది జీవితంలో సగ భాగం ఇవ్వాల్సిన మన జీవిత భాగ స్వామి కావాల్సిన వ్యక్తి విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఆలో చిస్తుంటే నాకు నవ్వొచ్చింది. ఇలాంటి సమయంలో అన్పిస్తుంది దేవుడు, జాతకం, పూర్వకర్మలు ఇవన్నీ ఉన్నాయని.

నా ప్రమేయం లేకుండానే చటుక్కున రేఖకి నా జీవితంలో చోటిచ్చే శాను. అమ్మ, నాన్నకి ఏదో నచ్చజెప్తే సరిపోదునేమో అనుకుంటే సరి పోదు. నా నొసటిరాతను ఎవరు మార్చగలరు? అయినా పెళ్లి అంటేనే లాటరీ ఏమో?

ఒకవేళ అన్నీ అంటే అటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలు పరిశీ లించి పెళ్లి చేసుకున్నా, చూడగానే ఒక మనిషి మనస్తత్వం ఏంటో తెలుసుకునే విద్య ఇంకా మనిషికి అలవడలేదు.

కలసి బ్రతికేతేనే అది తెలుస్తుంది కాబోలు. ఒకవేళ ప్రేమించి పెళ్ళి చేసుకున్నా, ప్రేమించేటప్పుడు మనకు కనిపించని గుణగణాలు, పెళ్ల య్యాక రోజూ మనతో కల్సి ఉండి మన బాధ్యతలు, బంధాలు పంచు కునేటప్పుడు బయటపడొచ్చు.

అసలీ పెళ్ళే పెద్ద ఊబిలాగా అన్పిస్తోంది. ఇందులో దిగడమే కానీ పైకి వచ్చే దారి కనబడట్లేదు. రేఖతో నేనేవిధంగానూ కలిసి ఉండలేను అన్పిస్తోంది.

నన్ను తను ప్రేమించడం, నా కోసం తను ఆత్మహత్య చేసుకోవా లని ప్రయత్నించడం అన్నీ నటనలాగానే ఉన్నాయి. కానీ రేఖను వది లేయడం ఎలా?

తనపైన నాకు ప్రేమలాంటిదేం లేకున్నా మాంగల్యం అనే పవిత్ర బంధంలో మా ఇద్దరి జీవితాలు కలవడం వలన కాబోలు రేఖంటే నాకు ఏదో తెలియని ఆప్యాయత ఏర్పడింది. ఇప్పుడదే తన పద్ధతి అని తెలి శాక నన్ను బాధపెడ్తోంది. ఏం చెయ్యాలిరా దేవుడా అని ఆలోచిస్తూ ఉండిపోయాను.

రాత్రి పదకొండు గంటలకు కాబోలు రేఖ వచ్చింది. నా గదిలోకి వచ్చి "అప్పుడే నిద్రేంటి బావా! నీ పని పూర్తయిందా?'' పక్కకు వచ్చి కూర్చుని నా భుజంపై చేయి వేసి అడిగింది. సున్నితంగా తన చేయి తీసేసి "కొంచెం తలనొప్పిగా ఉంది రేఖా ప్లీజ్'' అని కళ్ళు మూసేసు కున్నాను.

* * *

రేఖ విషయంలో మా అమ్మ, నాన్న, రేఖ పేరెంట్స్‌కి బాధ కల్గ కుండా ఏ నిర్ణయం తీసుకోవాలా అని ఆలోచిస్తున్న తరుణంలో హఠా త్తుగా వారంరోజులు నాకు పనిమీద వేరే చోటకి వెళ్లాల్సి వచ్చింది. అక్కడికెళ్లాక పనిలో నిమగ్నమైన నాకు తన గురించి ఊహ కూడా రాక ఎంతో ప్రశాంతంగా ఉంది మనసు.

నా పని పూర్తవగానే ఇంటికి వచ్చేశాను. నేను వచ్చేసరికి ఇల్లంతా గందరగోళంగా, అన్నీ ఎక్కడివక్కడ పడేసి ఉన్నాయి. నా గదిలోకి వెళ్ళి బట్టలు తీసుకుంటుండగా నాకు కన్పించాలనే పెట్టినట్లు అద్దానికి ఏదో కాగితం అతికించి ఉంది. తీసి చూసేసరికి అది రేఖ నాకు రాసిన ఉత్తరం.

"బావా!

నిన్ను విడిచి వెళ్లడం నాకూ బాధగానే ఉంది. ఎందుకంటే నేను నిన్ను నిజంగా ప్రేమించకపోయినా, నీ మంచితనం, అమాయకత్వం నన్ను ఇక్కడ్నించి వెళ్లనీకుండా ఇబ్బంది పెడుతున్నాయి. అందుకే నీ క్యాంప్ నా పాలిట వరంలా భావించి నువ్వొచ్చేలోగా వెళ్ళిపోవాలనే వెళ్ళిపోతున్నాను. నీకెదురుపడే ధైర్యం నాకు లేదు. నన్ను క్షమించు. నేనూ, విజయ్ ఎంతకాలం నుంచో ప్రేమించుకున్నాం. విజయ్‌కు సరైన చదువు, ఉద్యోగం లేదు. వాళ్ళు ఒక వెనుకబడిన వర్గానికి చెంది నవారు కూడా.

అందుకే మా నాన్న నేను ఛస్తానన్నా మా పెళ్ళికి ఒప్పుకోలేదు. ఇక్కడ విజయ్ వాళ్ళ బంధువుల బేకరీలో పనిచేస్తున్నాడు. నన్ను పెళ్ళి చేసుకుని ఇక్కడకు తీసుకొచ్చేంత హోదా, స్థోమత లేనివాడు. అలాగని పెళ్లి చేసుకుని మనదేశంలో ఎక్కడున్నా నాన్న వెతికి చంపే స్తాడని తెలుసు. ప్రేమకు, కులం, అంతస్థు అడ్డుగోడలు కాదు. అందుకే విజయ్‌పై నా ప్రేమ కొంచెం కూడా తగ్గలేదు. అందుకే నీతో ప్రేమ నాటకం ఆడి ఇలా నీ భార్యగా ఇంత త్వరగా ఇక్కడకు వచ్చి నీ దయతో ఉద్యోగం సంపాదించుకుని, విజయ్‌తో నా జీవితం ముడి వేసుకోవాలని ఆలోచించాను. కాలేజ్ రోజులనించీ నాకు తెలుసు నువ్వెంత అమాయకుడివో, మంచివాడివో. కానీ నువ్వు మా బావ కావడం నిజంగా నాదీ, విజయ్‌దీ అదృష్టం. అందుకే ఇంత త్వరగా విజ య్‌ని నేను చేరుకోగలిగాను.

నీ ప్రేమ కోసం నా జీవితం పాడు చేసావెందుకు? అని నువ్వు నన్ను అడగొచ్చు. నీకు సారీ తప్ప ఇంకేం చెప్పలేని నిర్భాగ్యురాలిని. నన్ను క్షమించు బావా'' -రేఖ

ఉత్తరం చదవడం పూర్తిచేస్తూనే కుప్పకూలిపోయాను. తలంతా గిర్రున తిరుగుతున్నట్లు అన్పించింది. తన ప్రేమ నిలబెట్టుకోవడం కోసం రేఖ నన్ను పావులాగా వాడుకుంటుందా? విజయ్‌ని ఇంత ప్రేమి స్తున్న రేఖ, ప్రేమంటే ఏంటో ఇంత బాగా చెప్పిన రేఖ అదే పేరుతో నన్ను నిలువు మోసం చేసిందా?

అయినా ఇంత తేలిగ్గా నా జీవితం ఆటవస్తువు అయ్యేలా నేను చూస్తూ ఉండిపోయానేంటి? నేను తెలిసీ ఏ పాపం చెయ్యలేదు మరి నాకింత ఎదురుదెబ్బ ఎందుకు తగిలింది?

అందరూ కలిసి నన్ను బురదలోకి నెట్టి నేను కూరుకుపోతుంటే చప్పట్లు కొడుతున్న అనుభూతి. నా జీవితాన్ని కాదు నన్నే ఒక బంతి లాగా చేసి రేఖ, విజయ్, మామయ్య, అత్తయ్య, అమ్మనాన్న అందరూ ఆడుతున్న అనుభూతి.

అలాగే నిస్సహాయంగా మంచం పైన జారుకున్నాను. నాకు తెలివి తెలిసేసరికి రాత్రి రెండు గంటలైంది. జరిగింది కలేమో రేఖ అంతలా నన్ను వదిలేసి విజయ్‌తో వెళ్లిపోతుందా అనుకుంటుంటే చేతిలో రేఖ రాసిన ఉత్తరం.



అసలిప్పుడు ఏం చెయ్యాలి? అమ్మకి, నాన్నకి ఏం చెప్పాలి? మామయ్యను ఏం అడగాలి? ఇండియాలో తలెత్తుకుని ఎలా బ్రతకాలి?

కానీ ఇంక ఇక్కడ ఈ బాధను భరిస్తూ ఒంటరిగా బ్రతకలేను. కడుపులో ఆకలి మండిపోతోంది. నోటికి ఏం తినాలని లేదు. విపరీతంగా మంచినీళ్ళు తాగేసి మళ్ళీ పడుకున్నాను. గంట తర్వాత ఆగకుండా వాంతులు. ఏం చేయాలో అర్థం కాలేదు. వాంతులు చేసుకుని నీరసంగా మంచం పైన వాలిపోయాను.

మర్నాడు ఆఫీసుకెళ్ళి నా పని అంతా పెండింగ్ లేకుండా పూర్తిచేసేసి పదిహేనురోజుల తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఇండియా వచ్చేశాను.

అమ్మ దగ్గరకు వెళ్లాలని లేక అక్క దగ్గరకు బెంగుళూరు వెళ్ళిపోయాను. నన్ను చూసి అక్క, బావ ఆశ్చర్య, ఆనందాలతో మునిగిపోయారు.

"రేఖేది! వాళ్లింటికి వెళ్లిందా?"

అక్క అడుగుతుంటే సోఫాలో కూలబడి "రేఖ లేదు" అన్నాను.

"ఏమైందిరా? తనకేమైంది. నువ్వింత హఠాత్తుగా ఎందుకు వచ్చావు. రేఖకి ఏమైనా జరిగిందా?" అడిగింది అక్క ఆదుర్దాగా.

"కాదు" అని నీరసంగా తల తిప్పాను.

"అసలేం జరిగింది?" అక్క నిలదీస్తుంటే విషయం అంతా చెప్పేశాను.

నాకు తెలియకుండానే కళ్ళల్లోంచి నీరు కారింది.

ఇన్నాళ్ళు బండరాయిలా నా ధర్మాలు నిర్వర్తించినా మనవారిని చూశాను అన్న అనుభూతితో కాబోలు నాకు కళ్లనుంచి నీరు కారింది. అక్క చూడకుండా కళ్ళు తుడుచుకున్నాను.

జరిగింది వినగానే అక్క కోపంతో బుసలుకొట్టింది.

"ఇప్పుడే వెళ్లి మామయ్య అంతు తేలుస్తాను" అంటుంటే బావ ఆపేశాడు.

"ఇప్పుడీ విషయం బయటపెడితే మనని మనం వీధిలోకి లాగడం తప్ప ఇంకేం జరగదు. వాళ్లేమంటారో చూద్దాం. ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా వారికీ సంగతి తెలుస్తుందిగా. దీపక్‌ని మాత్రం ఇప్పుడు అక్కడికి పంపొద్దు" అన్నాడు బావ.

"అదేంటి అది చేసిన దరిద్రపు పనికి ఇంత గడ్డిపెట్టకుండా ఊరుకుంటామా?" అంది అక్క రౌద్రంగా.

"వద్దక్కా. దానివలన మనకేంటి లాభం? నాకిప్పుడు ఎవరి సానుభూతి, జాలి వద్దు. నాకు అన్నింటికి దూరంగా వెళ్ళిపోయి కొన్నాళ్ళు ఒంటరిగా ఉండాలని ఉంది ఏ ఆశ్రమంలోనైనా" అన్నాను.

"ముందు అమ్మనీ, నాన్ననీ పిలిచి విషయం చెప్పాలి. తర్వాత మీ బావ ఏదో ఏర్పాటుచేస్తారు. అప్పుడు నీ ఇష్టం వచ్చిన చోటుకి పంపిస్తారు" అని నెమ్మదిగా నాకు నచ్చచెప్పింది అక్క.

అసలు విషయం తెలియకుండా వచ్చిన అమ్మ, నాన్న నన్ను చూసి నా సంగతి విని హతాశులయ్యారు.

అమ్మ అక్కడే కూలబడిపోయింది. నాన్న తలపట్టుకుని ఆలోచిస్తూ ఉండిపోయారు. అమ్మ మనుషుల్లోకి రావడానికి నెలరోజులు పట్టింది. అంతవరకూ వారిని విడిచి ఎక్కడికైనా వెళ్లడం నాకూ నచ్చలేదు. బావ మాత్రం ఎంతో ఓర్పుగా, నేర్పుగా అమ్మ,నాన్నలనీ, నన్నూ ఓదారుస్తున్నట్లు తెలియకుండా ఓదార్చాడు.

అమ్మ కొంచెం మనుషుల్లో పడగానే అంది "దీపూ, ఆడది అదే తెగించి వాడితో వెళ్ళిపోగా లేనిది మగాడివి నీకేంటి? నీకు వెంటనే మళ్ళీ పెళ్ళి చేస్తాను" అని.

నేనింకా ఏం అనకముందే బావ నా మనసులోని బాధను అర్థం చేసుకున్నట్లుగా "అత్తయ్యా. దీపక్‌ని కొంతకాలం ప్రశాంతంగా ఉండనివ్వండి. మళ్ళీ ఎవరిమీదో పంతంతో, పట్టుదలతో కంగారుపడి ఏ నిర్ణయం తీసుకుని అతన్ని బాధపెట్టొద్దు. ఒకసారి తెలియకుండానే తనని నిప్పుల గుండంలోకి నెట్టాం. కొంతకాలం ఆ మాట ఎత్తద్దు" అన్నాడు.

కొంచెం ఆలోచించి అమ్మకూడా సరే అంది.

నాన్న రిటైర్‌మెంట్‌కి దగ్గరగా ఉన్నారు కనుక హోదాయే కాదు బాధ్యతలు కూడా ఎక్కువ అందుకే ఇంక సెలవు లేదని హైదరాబాద్ వెళ్ళిపోయారు.

పదిహేనురోజులకు అమ్మ కూడా వెళ్లింది. నన్ను వదిలి వెళ్లడం ఇష్టం లేకున్నా, బావ మాత్రం నన్ను నొప్పించకుండా నాకు ఓదార్పునిచ్చే మాటలు మాట్లాడడం నాకెంతో ఊరటనిచ్చింది.

"నీకేం మాత్రం సంబంధం లేని అంటే నువ్వనచ్చు దీపక్ రేఖకు నేను తాళి కట్టానని. కానీ నీ మనసుకు దగ్గర కాలేదుగా రేఖా. అలాంటి రేఖ చేసిన పనితోనే నీ జీవితం ముగిసిపోయిందనుకుంటే ఎలా? ఈ షాక్‌నించి తేరుకోవడానికి ప్రయత్నించు. అంతేగానీ పిరికివాడిలా దూరంగా పారిపోయి ఒంటరిగా ఉంటానంటే ఎలా? ఒంటరితనం చాలా చెడ్డది. నీకు రేఖ గురించే ఆలోచనలు కల్గిస్తూ నిన్ను పిచ్చివాడ్ని చేస్తుందీ ఒంటరితనం" అన్నాడు బావ ఒకరోజు.

"బావా తనేదో అలా వెళ్ళిపోయి నన్ను అవమానించిందని నేను అనుకోవట్లేదు. తన జీవితం కోసం నా జీవితంతో ఇలాంటి ఆటలు ఎందుకు ఆడింది అనే ఆలోచన నన్ను గుచ్చిగుచ్చి బాధిస్తోంది. ఆ పనికి నన్ను నేనే వెతుక్కోవడం ఎందుకు? అసలు నేను తనకి ఏ ద్రోహం చేశాను. నన్ను తను ఉద్యోగం కోసం అడిగి ఉండవచ్చుగా?" అన్నాను బాధగా.

"ఏదైనా రుచి చూస్తేనే దీపక్ తెలిసేది. మనుషుల్లో ఎన్ని రకాలున్నారో చెప్పడానికీ, మనను హెచ్చరించడానికీ ఇలా జరిగింది అనుకో వచ్చుగా. ఇంకా నయం నీ జీవితంలో రేఖ అనే చెడు అధ్యాయం చాలా త్వరగా ముగిసిపోయింది. ఇంకా పిల్లలు, బంధాలు ఏర్పడ్డాక అయితే ఇంకెలా ఉండేదో ఊహించేందుకు భయంకరంగా ఉంది కదా. ఇంక నన్నే ఎందుకు ఎంచుకోవాలి అన్నావు కదా. నువ్వే కాదు మీ అమ్మ, నాన్నల అమాయకత్వం చూసి, ఇంతకన్నా అమాయకులు దొరకరని ఇలా చేసింది. అయినా పదేపదే అదే విషయం తవ్వకు. మీ కంప్యూటర్ రంగం క్షణం క్షణం మారిపోతూ ఉంటుంది.

ఇలాంటి ఆలోచనలతో నువ్వు దూరంగా ఉంటే తర్వాత జీవితాంతం ఖాళీగా కూర్చోవాల్సి ఉంటుంది. నీ భవిష్యత్తుకి ఇది ఒక పెద్ద మలుపు.

వెంటనే నువ్వు ఇక్కడ ఉద్యోగంలో చేరిపో. ఇవన్నీ నాకొద్దు అని విరక్తిగా మాట్లాడకు. నీకోసం కాదు నిన్ను ప్రేమించే మా కోసం నువ్వీ పనిచేయక తప్పదు" అంటూ ఒకరకంగా చావాలా, బ్రతకాలా అని తేల్చుకోలేనంత డిప్రెషన్‌లో ఉన్న నన్ను అతి తొందరలోనే మనిషిని

చేసేశాడు బావ.

గుండెల్లో గాయం ఎంత బాధిస్తున్నా నా అన్న వారు చూపించే ప్రేమ కోసం ఆ బాధను దిగమింగుకుని మళ్లీ ఉద్యోగంలో చేరాను. మా ఎండీ గారు ఎంత మంచివారంటే నాకీ గ్యాప్ ఎందుకు వచ్చింది? ఇంతకుముందు ఏం చేశాను?

ఏమైంది అని చూడకుండా కేవలం నా స్కిల్ చూసి ఉద్యోగం ఇచ్చారు.

ఈలోగా అక్కకు ధీరజ్ పుట్టడం, వాడితో నా అనుబంధం అన్నీ ఎక్కువైపోయాయి.

ఇంట్లో ధీరజ్‌తో చిన్నపిల్లాడిలా ఆడుకునే నేను ఆఫీసులో అడుగు పెట్టగానే ఎంతో గంభీరంగా మారిపోయేవాడిని. నా మంచితనం, అమాయకత్వం, నా మెతకస్వభావం తెలుసుకుని వేరొకరు నాతో ఆట లాడుకునే వీలు లేకుండా గిరిగీసుకుని ఉండిపోయాను. అమ్మ, నాన్న వాళ్ళే వచ్చి చూసేవారు నన్ను కానీ నేనింక హైదరాబాద్‌లో అడుగు పెట్టలేదు.

మాకు ఆశ్చర్యం కల్గించే విషయం ఒక్కటే మామయ్య రేఖ విషయం ఎప్పుడూ మాట్లాడలేదు సరి కదా. అమ్మా,నాన్నలకి కనీసం కన్పించను కూడా లేదట.

రేఖ విషయం మామయ్య అడిగి ఏం రభస చేస్తాడో అనుకున్నాం. కానీ అలాంటిదేం జరగకపోవడం వలన రేఖ మామయ్యకి అంతా చెప్పేస్తే ఇంకేం చేయలేక తప్పంతా రేఖదే కనుక మౌనంగా ఉండిపోయాడని అర్థమైంది.

పరువు కోసమో లేక తన ఏకైక కూతురు కోసమో మామయ్య ఇలా చేశాడు.

కానీ అమ్మ, అక్క ఎప్పుడు కలిసినా మామయ్యనీ, రేఖనీ శాపనార్థాలు పెట్టడం మాత్రం మానలేదు.

"దీపూ...దీపూ.." అమ్మ పిలుపునకు తుళ్ళిపడి ఈలోకంలోకి వచ్చాను.

"నిన్న రాత్రి అనగా వచ్చి పడుకున్నావు. ఏం చేస్తున్నావు. మళ్లీ దాని గురించే ఆలోచించి మనసు పాడుచేసుకుంటున్నావా? అది చచ్చింది అనుకోరా. అనుకోవడం ఏంటి? అది నిజంగానే చచ్చుంటుంది. నిన్ను బాధపెట్టి అది సుఖంగా ఎలా బ్రతుకుతుంది?'' కళ్ళు తుడుచుకుంటూ అంది అమ్మ.

"అదేం లేదమ్మా. నేను ఎవరి గురించీ ఆలోచించట్లేదు నిద్రపోతున్నానంతే'' అబద్ధం చెప్పబోయిన నాతో ఎప్పుడొచ్చి గుమ్మంలో నిలుచున్నారో నాన్న అన్నారు.

"ఎందుకురా మమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తావు? ఇప్పుడు టైం ఎంతయిందో తెలుసా. సాయంత్రం ఆరుగంటలు. నిన్న రాత్రి ఎనిమిదిగంటలకు పడుకున్నావు. ఉదయం నుంచి గంట గంటకూ అమ్మొచ్చి నిన్ను చూసి పిలిచి వెళ్తోంది. పిలవగా పిలవగా ఇప్పటికి పలికావు. ఎందుకు నాన్న జరిగిపోయిన దాని గురించి నీకంత ఆలోచన? ఇకనైనా చక్కని అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుని మాకు మనశ్శాంతి కలిగించరా?'' ఎప్పుడూ లేనిది నాన్న అంతలా మాట్లాడడంతో నేను కదిలిపోయాను. ఏం అనలేక "నాన్నా'' అన్నాను బాధగా.

అమ్మ అందుకుని "ఒక అచ్చట ముచ్చట లేకుండా మోడులా ఎంతకాలం ఉంటావు? ఇలా మమ్మల్ని ఎంతకాలం ఏడ్పిస్తావు? ఆడది అదే అంత ధైర్యంగా పెళ్ళి చేసుకుంది వేరేవాడిని. మగాడివి నీకేం బాధ? అయినా నా జీవితంలో సుఖం లేదు. ఇంతకన్నా ఛస్తే నయం. మనశ్శాంతిగా ఉంటుంది'' ఇదంతా సరయూతో నన్ను పెళ్ళికి ఒప్పించే ప్రయత్నం అని తెలిసి గట్టిగా అన్నాను.

"అమ్మా సరయూ గురించి నువ్వేదో అనేసుకుని పెళ్ళి ఇదీ అదీ అని మాట్లాడకు. సరయూ బాధపడ్తుంది. అంతేకాదు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటుంది'' అనేసి గబగబా బాత్రూంలోకి వెళ్ళిపోయాను.

స్నానం చేసి డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చేసరికి అమ్మా, నాన్న సాత్వికతో ఏదో మాట్లాడుతున్నారు. సాత్విక చెప్పే సమాధానాలకు ఇద్దరూ పగలబడి నవ్వుతున్నారు. వాళ్లిద్దర్నీ అలా చూస్తూంటే నా మనసు పొంగిపోయింది. నా రాక గమనించి ఇద్దరూ సీరియస్‌గా ముఖాలు పెట్టేశారు.

అమ్మ నా కంచంలో గబగబా వడ్డించేసింది.

నన్ను చూసి సాత్విక నాన్నగారి ఒడిలోంచి దిగి వచ్చి నా నుదిటి మీద చెయ్యేసి "అంకుల్ మీకు జ్వరమా?'' అని అడిగింది.

దాని చిన్న చేతిని ముద్దు పెట్టుకుని "లేదు నాన్న ఏం అలా అడిగావు?'' అన్నాను.

"మరైతే అలా పడుకున్నావేం? నేను పొద్దున్న కూడా వచ్చాను. ఈరోజు సండేకదా'' అంది.

"లేదు నాన్న నిద్రపోయాను'' అన్నాను.

"అమ్మ కూడా అంతే. అప్పుడప్పుడు అలాగే నిద్రపోతుంది. నేనెంత పిల్చినా పలకదు నీలాగే''పెద్ద ఆరిందాలా చెబుతుంటే నవ్వొచ్చి

"రా అన్నం తిందుగాని'' అన్నాను.

"వద్దంకుల్. అమ్మ అస్తమాను అంకుల్ వాళ్లింట్లో తినకూడదు అంది. నేను తినను'' అంది సాత్విక.

నాకు సరయూ పైన పీకలదాకా కోపం వచ్చింది. చిన్న పాపని ఇలా ఆంక్షలు పెట్టటం ఏమిటి? అసలు తననే తీసుకొచ్చి తిండి పెడ్తేగానీ తిక్క కుదరదు అనుకుని

"అమ్మా మీరు తింటుండండి ఇపుడే వస్తాను''అని గబగబ బయటికి వచ్చాను.

నేనెక్కడికి వెళ్తున్నానో వారికర్థమైందేమో ఏం అనలేదు.

గబగబా సరయూ ఇంటికి వచ్చి తలుపుతట్టాను.

పలకలేదు. తోసి చూస్తే తలుపు తెరిచే ఉంది. తలుపు తీసేసి ఏం చేస్తోంది అనుకుని లోపలికి వెళ్లేసరికి తను తడిగుడ్డతో ఇల్లు శుభ్రం చేసుకుంటోంది.

చింపిరిజుట్టుతో, నైటీతో ఇలాంటి గెటప్‌లో కూడా తనెంతో స్వీట్‌గా అన్పించింది నాకు.

తను మాత్రం నన్ను చూసి గభాల్న నైటీ సర్దుకుంటూ ఆ నైటీ తొక్కేసుకుని ఈ ప్రయత్నంలో జర్రున జారిపోయింది.

తను పడేలాగా ఉందని అర్థమై దగ్గరకెళ్ళి పట్టుకుని ఆపాను.

ఒక్క క్షణం ఇద్దరం అలాగే స్థంబించి ఉండిపోయాం. నాకు మనసులో ఏదో అలజడి. రేఖ ఎన్నోసార్లు నా భుజంపై చేయి వేసినా నన్ను తాకినా కలగని అలజడి. అలాగే ఉండిపోతే ఎంతో బాగుండును అన్పించింది.

కానీ అంతలోనే తేరుకుని తనని సోఫాలో కూర్చోబెట్టాను. సరయూ

తేరుకుని సిగ్గుపడుతూ "సారీ అండీ నేనసలు అలా అనుకోలేదు" అంది.

నాకు తెగ నవ్వొచ్చింది. తన అమాయకమైన మాటలకి "అయ్యో. అలాగా నేను మాత్రం మీరు అలా అనుకునే జారారు అనుకున్నానే" అన్నాను తనను ఏడిపిస్తూ.

ఒక క్షణం తన ముఖం ఎర్రగా కందిపోయింది.

ఏం మాట్లాడాలో తెలీక "సాత్విక ఉండగా క్లీన్ చేస్తే తను నేను కూడా చేస్తానని వచ్చి ఇల్లంతా నీళ్ళు పోసేస్తుంది" అని ఏదో చెప్ప బోయి మళ్ళీ సిగ్గుపడి దిక్కులు చూస్తోంది.

నాకు అసలు నేను ఎందుకు వచ్చానో గుర్తొచ్చి నా చిలిపితనం అంతా దాచుకుని వెంటనే గంభీరంగా ముఖం పెడ్తూ-

"ఏంటండీ సాత్విక అస్తమానూ మా ఇంటికొచ్చి అలా అన్నీ తినే స్తుందేంటి? ఇలా అయితే మాకు చాలా ఇబ్బంది అని చెప్పడానికొ చ్చాను" అన్నాను.

ఆ మాటలకి సరయూ బిత్తరపోయింది.

ఆ క్షణంలో తన ముఖం చూసి జాలి వేసింది కానీ మళ్ళీ "వింటు న్నారా? అస్తమానూ సాత్వికను మా ఇంటికి రానివ్వకండి. అంకుల్ వాళ్ళింట్లో అస్తమానూ తినొద్దు అని గట్టిగా చెప్పండి" అని రెట్టించాను.

సరయూకి అప్పటికి విషయం అర్థమై "నేనూ అదీ అలా ఎందుకు చెప్పానంటే ఆంటీ పెద్దవారు కదా. దీనికి ఇంకా సరిగా తినడం రాదు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఇల్లంతా ఖరాబ్ చేస్తుందని" బెరుగ్గా అంది.

"మీరిలాంటి వారని తెలియక మీతో స్నేహం చేశాను. చిన్నపిల్ల లను కూడా విసుక్కునేంత దుర్మార్గులం మేం అని మీరు ఒక నిర్ణయా నికి వచ్చేసినట్లున్నారు. నేను వెళ్తున్నాను. సాత్వికను వెంటనే దింపే స్తాను" అన్నాను.

"తను సారీ అండి అన్నీ చెప్పేస్తుందని తెలీక" ఇంకా ఏదో అనేం తలో నేను అందుకుని "అయితే తను ఏం చెప్పదు అన్పిస్తే ఇంకా కొత్తవి నేర్పిస్తారా?" నా మాట పూర్తికాకముందే సరయూ నా నోటికి తన చేయి అడ్డుపెట్టి "అబ్బ. ఇక నన్ను ఏడిపించింది చాలు. ఇంకె ప్పుడూ సాత్వికను దేనికీ ఆంక్షలు పెట్టి ఆపను. మీరెంతకాలం కావ లిస్తే అంతకాలం దానిని మీ దగ్గరే ఉంచుకోండి సరేనా" అంది నవ్వుతూ.

"నేను మాత్రం ఇంకా కోపం తగ్గనట్లు నటించి మీరు చేసిన దానికి శిక్షేంటో తెలుసా?" అన్నాను.

"ఏంటి?" అంది సరయూ.

"త్వరగా మీరు రెడీ అయ్యారంటే మా ఇంటికెళ్లి కలిసి భోజనం చేద్దాం" అన్నాను.

ఇంకా ఏమైనా అంటే నేనేం అంటానో అని భయపడి గబగబ లోప లికి వెళ్లింది సరయూ బట్టలు మార్చుకోవడానికి.

తను లోపలికెళ్లగానే నేను ఊపిరి పీల్చుకున్నాను.

ఎందుకో తనెదురుగా ఉంటే నా మనసు పిచ్చి ఆలోచనలు చేస్తుంది. తనతోనే ఉండిపోవాలని నాకు ఎందుకు అన్పిస్తుంది. బహుశా నా జీవితంలో ఇదే అసలైన ప్రేమ ఏమో. ఇప్పుడు తను నాకు దగ్గరయిన్నప్పుడే అన్పించింది. రేఖతో పెళ్ళి జరిగాక కూడా ఆ అను భూతి కలగలేదు.

బహుశా సరయూనే ఆ దేవుడు నా కోసం సృష్టించిన జీవిత భాగ స్వామి ఏమో అని ఆలోచిస్తూనే ఛ ఛ రవికీ, సరయూకీ ఏం ఉన్నా సరయూ రవికే సొంతం. వారిద్దరూ ఎప్పటికైనా కలవాలి. సాత్వికకు రవి కన్నతండ్రి కదా.

ఎప్పటికైనా రవిలో మార్పు వచ్చి వారిద్దరూ కలుస్తారు. సరయూ గురించి ఏం మాట్లాడొద్దు అని అమ్మకు చెప్పిన నేను నా అంతట నేను ఇలా ఊహించుకోవడం తప్పు అనుకుంటుండగా

"దీపక్ వెళ్దామా" ఠక్కున తేరుకుని తలెత్తేసరికి గంధం రంగు చీరలో సరయూ.

ఎంత అందమైన అమ్మాయి.

సాత్విక కన్నతల్లి సరయూనే అంటే ఎవరూ నమ్మరు. తన ముఖంలో ఆ అమాయకత్వం, జీవకళ, ఆ లేత ముఖం అన్ని కష్టాలు, కన్నీళ్ళు భరించిందంటే నమ్మశక్యంగా లేదు. 'ఓ దేవుడా నువ్వెప్పుడూ మంచివారికే పరీక్షలు పెట్టి సాధిస్తావు అన్నది నిజం' అనుకుని నిట్టూర్చి-

"పద సరయూ!" అన్నాను నేను బయటికి వెళ్తూ.

సరయూ, నేనూ కలిసి రావడం చూసి అమ్మ ముఖం వెలిగిపో యింది. సాత్విక నాన్న ఒడిలో నిద్రపోయింది. తనను చూస్తూనే సరయూ గభాల్న వెళ్ళి "సారీ అంకుల్. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిం దేమో" అంది.

"ఏమ్మా నా సొంత మనవరాలైతే నువ్విలాగే అంటావా" అన్నారు నాన్న సరయూతో.

సరయూ కళ్లనుంచి ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా ఒక కన్నీ టిబొట్టు రాలాయి.

"రండి భోంచేయండి. ఇంకా ఎంతసేపు ఆగుతారు?" అమ్మ కసి రింది.

కొసరి కొసరి తినిపిస్తున్న అమ్మ ప్రేమకు సరయూ ఎంతో ఆనంద పడిపోయింది.

భోజనం చేశాక అన్నీ అమ్మ వద్దంటున్నా తనే శుభ్రం చేసి మా దగ్గ రకు వచ్చి కూర్చుంది. సాత్వికను నాన్న అప్పటికే లోపలిగదిలో పడు కోబెట్టి వచ్చారు.

ఇంక అమ్మ నోటికి అడ్డుకట్ట వేయడం నాకు సాధ్యపడలేదు.

"సరయూ ఎంతకాలం ఇలా ఒంటరిగా ఉంటావు? నీకేం వయసు మించిపోయింది. మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు కదరా. రవి ఉండగా ఇలా అంటోందేంటి ఈ ముసల్ది అనుకోవచ్చు నువ్వు. కానీ రవి వలన నువ్వు పడ్డ కష్టాలు నాకు తెలుసమ్మా. నీకోసం కాకపోయినా సాత్విక కోసం అయినా నువ్వు పెళ్ళి చేసుకోకతప్పదు. ఎదిగే పిల్ల రేపే బాధలు వచ్చినా దానికి తండ్రి ఆలనాపాలనా ఎంతైనా అవసరం" అంది అమ్మ.

ఆ మాటలకు సరయూ కళ్లనుంచి నీరు కారింది.

నాకు అమ్మపైన కోపం వచ్చింది. "అమ్మా! ఇప్పుడెందుకు అవన్నీ?" అన్నాను కోపంగా.

సరయూ కలుగజేసుకుని "లేదు దీపక్. అమ్మ అన్న దాంట్లో తప్పు లేదు. మా అమ్మ ఏం అంటుందో తనూ అదీ చెప్పారు. నా మంచి, నా సుఖం కోరుకునే మీలాంటివారు దొరకడం నా అదృష్టం. కానీ నేను మళ్ళీ ఆ ఉచ్చులో బిగుసుకోదల్చుకోలేదు. ఒకసారి రవి వలన పడిన బాధలనుంచి తేరుకోవడానికి ఒక జీవితకాలం సరిపోదేమో అన్పి స్తోంది.

ఇంక జన్మలో రవితో కలిసే మాటగానీ మరో పెళ్ళి మాటగానీ



తెలుసుకోలేను. అమ్మా, నాన్నకి ఫోన్ చేసి చెప్పాను వీలైనంత త్వరలో అక్కడికి వచ్చేస్తానని. కానీ అక్కడ భర్త వదిలేసిన ఆడదానికి ఎలాంటి ఆదరణ లభిస్తుందో ఊహించగలను కనుక మళ్లీ వెనుకడుగు వేస్తున్నాను.

కానీ అమ్మ, నాన్నలకు నేనొక్కత్తెనే కదా. వారి వయసులో నా గురించి దిగులు పడడం నాకు బాధగా ఉంది. ఏం చేయాలో అర్థం కావట్లేదు'' కన్నీరు తుడుచుకుంటూ అంది సరయూ.

అమ్మ తన భుజం మీద చేయి వేసి అంది "లేదు సరయూ. రవి ఒక్కడి గురించీ నువ్వందరు మగవారూ దుర్మార్గులు అనుకోవడం తప్పు. మనసున్న మంచివాడు, నిన్ను బాగా చూసుకుంటాడు అనే వ్యక్తి తారసపడితే నువ్వు మళ్లీ పెళ్ళి చేసుకోడం మంచిది. నా మాట విని నువ్వు మళ్లీ పెళ్ళి చేసుకోవడం గురించి ఆలోచించు'' అని.

సరయూ బుర్ర దించుకుని "ఏమో ఆంటీ, నాకేం తోచట్లేదు ఏం చేయాలో?'' అంది.

అమ్మ "అవును సరయూ. కాలమే దీనికి సమాధానం చెప్తుంది. నువ్వేం దిగులుపడకు నీకంతా మంచే జరుగుతుంది'' అంది.

సరయూ ఇబ్బంది పడుతుందని గ్రహించిన నాన్న "దీపక్, సరయూని వాళ్లింట్లో దిగబెట్టేసి రా'' అన్నారు.

సరేనని చెప్పి సాత్వికనూ, సరయూని ఇంటి దగ్గర దిగబెట్టేసి రాబోతుంటే సరయూ అంది.

"రేఖ సంగతి అమ్మ చెప్పాక చాలా బాధపడ్డాను దీపక్. దేవుడి లాంటి మిమ్మల్ని కూడా కష్టపెట్టేవారూ, మోసం చేసేవారు ఉంటారా అన్పించింది. అయినా ఎవరి విలువ ఏంటో తెలుసుకోని రేఖ ఎంత మూర్ఖురాలో తెలుస్తోంది. తను చేసిన పనికి జీవితంలో ఒకరోజు చాలా పశ్చాత్తాప పడుతుంది'' అంది ఆవేశంగా.

ఎందుకో రేఖ సంగతి సరయూ నోటివెంట రాగానే నాకంటి నుంచి నాకు తెలీకుండానే కన్నీరు కారింది.

ఇంతవరకూ జీవితంలో ఏడవడం అంటూ తెలీని నేను మొదటి సారి సరయూ దగ్గర ఏడ్చాను.

"అరె దీపక్! మీరు కూడా ఇలాగా అయిపోతే ఎలా? మీరే ఇలాగా బేలలా అయిపోతే ఆంటీ, అంకుల్ ఎంత బాధపడ్తారు. సారీ దీపూ, మిమ్మల్ని బాధపెట్టడం ఇష్టం లేక రేఖ సంగతి మీదగ్గర ఇన్నాళ్ళు మాట్లాడలేదు. కానీ మీ మంచితనం నాకు తెలుస్తున్న కొద్దీ, మీరు నాకు దగ్గరవుతున్నకొద్దీ అన్పిస్తోంది. ఇంత విలువైన రత్నంలాంటి భర్తను కాలదన్నిన రేఖ ఎంత మూర్ఖురాలో'' నా తలపైన చేయి వేసి అంది సరయూ.

"లేదు సరయూ. నన్ను తను వదిలిపెట్టి నన్ను వద్దనుకుని వేరే వ్యక్తితో వెళ్ళిపోయిందని నేనేం అవమానంగా అనుకోవడం లేదు. కానీ ఒక వ్యక్తికి ఎంతో యధేచ్ఛగా నా జీవితంతో ఆటలు ఆడే అవకాశం నేనే ఇచ్చానంటే నాకు నమ్మకం కుదరట్లేదు. నేను నిజంగా ఒక ఫూల్‌ని'' అన్నాను.

"లేదు దీపక్. మీరు మంచివారు అంతేకాదు మీరు దేవుడితో సమానం కూడా. మిమ్మల్నింత బాధపెట్టిన, మిమ్మల్ని జీవచ్ఛవంలా చేసిన రేఖను ఏం అనకుండా క్షమించి వదిలిపెట్టేశారు. అంతేకాదు మీకు అవకాశం ఉన్నా రేఖ తల్లిదండ్రులను ఈ విషయంలో ఏం అనలేదు. నాకసలు మిమ్మల్ని చూస్తుంటే మగవారిలో కూడా ఇంత మంచివారుంటారా అన్పిస్తోంది. మీరు నాతో స్నేహం చేయడమే నేనెంతో అదృష్టంగా భావిస్తున్నాను'' అంది సరయూ.

గడియారం కేసి చూస్తే రాత్రి పన్నెండు అయింది.

"సారీ సరయూ. నిన్ను ఇబ్బంది పెట్టాను నా ఎమోషన్స్‌తో'' అని వచ్చేశాను.

ఇంటికొచ్చేసరికి అమ్మా, నాన్న నిద్రపోతున్నారు.

నేను పడుకున్నానే గానీ నిద్రరాలేదు. సరయూతో మాట్లాడిన అన్ని మాటల్లోకి తను త్వరలో మా అమ్మానాన్నల దగ్గరకి వెళ్ళిపోదామనుకుంటున్నాను అని అమ్మతో అన్న మాట గుర్తొచ్చి గుండె పిండేసినట్లు అనిపించింది.

సరయూని నాదానిని చేసుకోవాలనే కోరిక నా గుండెల్లో ఇంత బలంగా ఉందా అన్పించింది నా మనసు పడే వేదన చూస్తుంటే. కానీ ఎందుకు ఈ విషయంలో ముందడుగు వేయడం లేదు. సరయూతో స్నేహం అయ్యాకే గడిపిన కాలమే నా జీవితంలో మధురమైన, అమూల్యమైన కాలం అంటే ఆశ్చర్యం లేదు.

తన పరిచయం అయ్యాక రేఖ గురించి ఆలోచన కూడా చాలావరకు తగ్గింది. అసలు రేఖ అనే రాంగ్ క్యారెక్టర్ నా జీవితంలో లేదేమో సరయూనే నాకు దేవుడిచ్చిన జీవితభాగస్వామి ఏమో అన్పించేది.

సరయూ దగ్గరకు వెళ్ళి ఇప్పుడే అడిగేస్తాను 'నాతో జీవితం పంచుకోవడం నీకిష్టమేనా?' అని గట్టిగా నిర్ణయించుకుని లేచి తలుపు దగ్గరకు వెళ్ళి తీయబోతుంటే అన్పించింది.

రవి అంటే సరయూకి ఇష్టం లేదన్నమాట తను చెప్పినా మన భారతీయ స్త్రీలు అంత త్వరగా వివాహబంధం తెంచుకుని రావడానికి ధైర్యం చెయ్యరు. ఇష్టపడరు. ఎప్పటికైనా సరయూ తల్లిదండ్రుల వలన కానీ, సాత్విక వలన కానీ మళ్ళీ వారు కలిసే అవకాశం లేకపోలేదు. మధ్యలో నేనొచ్చి వారి దాంపత్యం చెడగొట్టకూడదు అనుకుంటూ బాధగా వెనక్కి తిరిగెళ్ళి పడుకున్నాను.

★ ★ ★

అమ్మా, నాన్న ఇండియా వెళ్ళిపోయే రోజు వచ్చేసింది. ఇంక నా జీవితం పూర్తిగా ఒంటరి అయిపోయింది మళ్ళీ. అమ్మ సరయూకి నన్ను అప్పజెప్పి వెళ్ళినట్టుంది. సరయూ అమ్మ వెళ్లాక నేను వద్దంటున్నా నా అవసరాలన్నీ చూసేది. అసలీ సరయూకి విసుగు, అలసట ఇవేం ఉండవా అన్పించేది ఒక్కోసారి తనని చూస్తుంటే. ఆఫీసుపని, సాత్విక పని అన్నీ ముగించుకుని నా దగ్గరకొచ్చి ఏం కావాలో చూసి నాతో ఆప్యాయంగా మాట్లాడేది. సరయూకి నేను చాలా దగ్గర అయిపోయాను వద్దనుకుంటూనే. తనకి కష్టం అని కూడా ఆలోచన లేకుండా రోజూ తన ఇంట్లోనే తినేవాడిని. కనీసం మొహమాటానికైనా మీకెందుకు శ్రమ అనలేదు. అలా అనాలి అనిపించేది కూడా కాదు. సరయూ నా సొంతం అన్న భావన అన్నిటినీ అధిగమించింది కాబోలు. నేను వద్దు అనుకుంటూనే సరయూ పైన ఆధారపడి బ్రతకడం అలవాటు చేసుకున్నాను.

అన్నిరోజులూ మనం కోరుకున్నట్లు ఉంటే లేనిదేముంది? పైగా నాలాంటి దురదృష్టజీవికి మంచిరోజులు, సంతోషకరమైన రోజులు ఎక్కువకాలం ఉండవుగా.

ఒకరోజు ఆఫీసుకి ఫోన్ చేసి సరయూ "దీపక్ మీరు కొంచెం ఇంటికి

రాగలరా?'' అడిగింది. ఎందుకో అని కంగారుగా ఇంటికెళ్ళేసరికి తను ఏడుస్తూ కన్పించింది.

నేనెంతో కంగారుపడి "ఎందుకు సరయూ ఏమైంది?'' అన్నాను.

"నాకెందుకో పొద్దుటనుండీ మనసు బాగాలేదు. ఇంటికి ఫోన్ చేస్తే అమ్మకి అసలు ఆరోగ్యం బాగాలేదు అన్నారు నాన్న. నేను వీలైనంత త్వరగా అమ్మావాళ్ల దగ్గరకి వెళ్లాలి దీపూ. ప్లీజ్ ఏదైనా చెయ్యండి'' అంటూ ఘొల్లుమంది.

తనను ఓదార్చి వీలైనంత త్వరగా ఇండియా పంపిస్తానని చెప్పి ఇంటికొచ్చాను.

సరయూ ఇండియాకి వెళ్తే ఇక తిరిగిరాదు. తనిప్పుడు అక్కడకు వెళ్లడం చాలా అవసరమే కానీ సరయూ లేనిదే కనీసం ఒక్కరోజైనా నేనుండగలనా? అన్పించి బాధ వచ్చింది నాకు. కానీ అంతలోనే అన్పించింది సరయూ ఏమైనా నా భార్య నాతో ఎల్లకాలం కలిసి ఉండేందుకు. నేను తనకు కేవలం ఒక మంచి స్నేహితుడిని మాత్రమే. అని సరిపెట్టుకుని తనను ఇండియా పంపే ప్రయత్నంలో పడ్డాను.

తన పనులన్నీ పూర్తిచేసి సాత్వికనూ, సరయూని ఫ్లైట్ ఎక్కించే సమయానికి అరవింద్ ఇండియా నించి వచ్చాడు. అరవింద్‌ను చూడగానే సరయూ ఎంతో ఆనందించి నన్ను చిన్నపిల్లాడిని అప్పచెప్పినట్లు అరవింద్‌కి అప్పజెప్పి వెళ్లింది.

వాళ్ళు వెళ్ళిపోగానే నా ఇల్లే కాదు నా మనసు శూన్యం అయిపోయింది. ఆ రాత్రంతా చీమ చిటుక్కుమన్నా లేచి చూస్తూనే ఉన్నాను. కానీ ఇదేం సినిమా కాదుగా సరయూ వెనక్కి వచ్చేయడానికి.

పైగా నేను నా మనసులో తనున్నా ఇష్టం అని తనకెప్పుడూ చెప్పలేదు. సరయూ ఒక బాధ్యతాయుతమైన తల్లి మాత్రమే కాదు బాధ్యత గల కూతురు కూడా.

తన తల్లిదండ్రులకు అన్నీ సరయూ ఒక్కతే. ఆలోచిస్తూనే నిద్రపోయాను. అరవింద్ లేపుతుంటే మెలకువ వచ్చింది. లేచినప్పటినుంచి అరవింద్ నన్ను ఆట పట్టించడం మొదలెట్టాడు.

"సరయూ నిన్ను నాకు అప్పగించి వెళ్లిందంటే ఏదో విశేషం ఉంది. ఏంటి దీపక్! మీరిద్దరూ అంత దగ్గరయ్యారా? నువ్వు తనని పెళ్లి చేసుకుంటానన్నావా?'' అని యక్షప్రశ్నలు వేశాడు.

అవన్నీ తీసిపారేసి "ఇంతకీ నీ సంగతి చెప్పు అరవింద్. పెళ్ళి విషయం ఎంతవరకూ వచ్చింది?'' అన్నాను.

"ఇప్పుడేదో మూఢంట. మూఢం చూసుకుని వచ్చేవేరా అని అమ్మ తిట్టింది దీపక్. మళ్లీ ఆరునెలల తర్వాత నువ్వు సెలవు ఇవ్వక తప్పదు. సారీ సారీ నువ్వు కూడా నాతో కలిసి సెలవు పెట్టక తప్పదు. నా పెళ్లి దగ్గరుండి జరిపించకా తప్పదు'' అన్నాడు అరవింద్.

"తప్పకుండా అరవింద్. అప్పటికి నాకిక్కడ ఎండీ గారు చెప్పిన పని కూడా పూర్తయిపోతుంది. నీ పెళ్ళి నేనే దగ్గరుండి జరిపిస్తాను'' అన్నాను ఆనందంగా.

* * *

సరయూ లేని జీవితం చప్పగా సాగుతోంది. సరయూ ఎక్కువగా నాకు మెయిల్ ఇచ్చేది.

ఫోన్ మాత్రం నేనే చేసేవాడిని. ఫోన్ చేసిన ప్రతీసారీ జాగ్రత్తగా తింటున్నారా అని ఎంతో బాధ్యతగా నా విషయాలన్నీ అడుగుతుంటే నాకు ఒక పక్క ఆనందంగా, మరో పక్క బాధగా ఉండేది.

ఆరునెలలు గడిచాక అరవింద్‌తో నేనూ ఇండియా వచ్చేశాను. వస్తూనే అక్క దగ్గరకెళ్ళి ధీరజ్‌నూ, నేను అక్కడ లేనప్పుడు అక్కకు పుట్టిన పాపాయిని చూశాను.

ధీరజ్ ఎంతో ఆరిందాలా వాడి చెల్లి గురించి ఎన్నో సంగతులు చెప్పాడు. వాడి కబుర్లతో కాలమే తెలియడం లేదు. వారంరోజులుండి అమ్మ దగ్గరికి హైదరాబాద్ వెళ్ళాను.

హైదరాబాద్‌లో అడుగుపెట్టగానే సరయూకి ఫోన్ చేయాలన్పించింది. కానీ నేను సరయూ దగ్గర కాకూడదనే ఇండియా వస్తున్నట్లు కూడా తనతో చెప్పలేదు. అలా చేయడమే మంచిది.

సాత్విక గానీ, సరయూ తల్లిదండ్రులు గానీ ఆనందంగా ఉండాలంటే రవి, సరయూ కలవాలి. రవి ఇప్పుడలా ఉన్న తర్వాత అయినా తనలో మార్పు వచ్చి సరయూ విలువేంటో తెలుసుకుంటాడేమో. మధ్యలో నేనెళ్ళి వారిద్దర్నీ ఇంకా దూరం చేయడం తప్పు అనుకున్నాను.

అరవింద్‌కి పెళ్ళి కుదరగానే కాబోయే భార్యను తీసుకుని నా దగ్గరకు వచ్చాడు.

వాళ్లిద్దర్నీ చూస్తే నాకెంతో ఆనందం కలిగింది. తప్పకుండా అరవింద్ పెళ్ళికి ముందే వచ్చి తనతో గడుపుతానని చెప్పాను.

అన్నట్లే అరవింద్ పెళ్ళి ఏర్పాట్లు మొత్తం నేనే చేశాను. మా ఎండీ, ఇంకా ఆఫీసులో కొంతమంది వచ్చారు అరవింద్ పెళ్ళికి.

చాలారోజుల తర్వాత చాలా సంతోషంగా నాకు ఆరోజంతా గడిచింది. తన పెళ్ళి హడావుడి అంతా తీర్చుకుని ఇంటికి వచ్చేసరికి రాత్రి పన్నెండు గంటలయింది.

ఎందుకో సరయూ గుర్తొచ్చింది నాకు. దేవుడు నాకు సరయూని ముందే పరిచయం అయ్యేలా చేసి ఉంటే మా పెళ్ళి కూడా ఇలాగే జరిగేది అన్పించింది.

ఇప్పుడు తను వేరొకరి భార్య, తన గురించి అలా ఆలోచించకూడదు అని ఎంత సరిపెట్టుకుందామన్నా మనసు ఊరుకోలేదు. సరయూతో ఎందుకో ఇపుడే మాట్లాడాలి.

తనకు నా అవసరం ఇప్పుడు చాలా ఉంది అన్పించి తన ఫోన్ నెంబర్ కోసం చూశాను. సరయూకి సంబంధించి ప్రతీ చిన్న విషయం నాకు గుర్తే. ఫోన్ నెంబర్ చూడాల్సిన అవసరం లేదు అనుకుంటూ టైం ఎంతయిందో ఆలోచించకుండా తనకు ఫోన్ చేసేశాను. సరయూ ఫోన్ తీసిన వెంటనే "దీపక్'' అంది. నేనెంతో ఆశ్చర్యపోయాను.

'నేనే అని ఇంత ఖచ్చితంగా చెప్పిందంటే తనకు కూడా నేనంటే చాలా ఇష్టం అన్నమాట' నా మనసు ఆనందంతో గంతులేసింది.

నా ఉత్సాహం దాచుకుంటూ-

"ఎలా ఉన్నావు సరయూ?'' అడిగాను. సరయూ సమాధానం చెప్పకుండా భోరున ఏడ్చేసింది.

"సరయూ ఏమైంది ప్లీజ్ చెప్పవూ?'' ఆదుర్దాగా అడిగిన నాకు "నేను పూర్తిగా ఒంటరిని అయిపోయాను దీపక్. అమ్మ, నాన్న పదిరోజుల క్రితమే యాక్సిడెంట్‌లో చనిపోయారు. నెలరోజుల నుంచి మీరూ ఫోన్ చేయలేదు. నా బాధను కూడా ఎవరితోనూ పంచుకోలేక కుమిలిపోతున్నాను దీపక్'' ఏడుస్తూ అంది సరయూ.

"సారీ సరయూ. నేను కూడా నీకు చాలా బాధ కలిగించాను. నేను

ఇప్పుడే అక్కడికి వస్తున్నాను" సరయూ ఏం మాట్లాడుతోందో విన కుండా ఫోన్ పెట్టేసి గబగబా తయారై బయటికి వెళ్ళబోతుంటే "ఇప్పుడే కదరా వచ్చావు? మళ్లీ ఎక్కడికి?" అడిగింది అమ్మ నిద్ర లేచి.

"సరయూ తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు అమ్మా. నేను వెంటనే తనని కలవాలి. అందుకే వెళ్తున్నాను" అన్నాను నేను.

"అయ్యో ఎంత పని జరిగింది? ఎప్పుడు నాన్న" బాధగా అంది అమ్మ.

"అప్పుడే పదిరోజులు అయిందటమ్మా. ఈమధ్యన తనకు ఫోన్ చేయలేదుగా నాకు తెలీలేదు నేను వస్తాను" అన్నాను.

"మేం కూడా వస్తాంరా. నాన్నను నిద్రలేపుతాను ఉండు" అంది అమ్మ.

"ఇప్పుడొద్దమ్మా. నేను అక్కడికెళ్ళి ఫోన్ చేసిన వెంటనే మీరు బయల్దేరిరండి. ఇప్పుడింక తలుపేసుకుని పడుకో. నాన్నకు ఇప్పుడు ఈ విషయం చెప్పకు" అని బయటికి వచ్చేశాను.

దాదాపు పదిగంటల తర్వాత సరయూ ఇంటి తలుపు తట్టాను. సర యూనే వచ్చి తలుపు తీసింది.

ఇంట్లో బంధువులు ఎవరైనా ఉంటారనుకున్నాను కానీ ఎవరూ లేరు. సాత్విక నన్ను చూడగానే పరుగున వచ్చి నా కాళ్ళు చుట్టు కుంది. తనను ఎత్తుకుని ఏడుస్తున్న సరయూని ఓదార్చి "అసలేం జరి గింది. ఇంత హఠాత్తుగా..." అడిగాను.

"గుడికని టాక్సీలో బయల్దేరారు అమ్మావాళ్ళు. నేను వెళ్లాల్సిందే కానీ మనసు బాగాలేక సాత్వికను తీసుకుని ఇంట్లోనే ఉండిపోయాను వెళ్ళినా బాగుండేది. వారితోనే నేనూ, ఇది కూడా చనిపోయిండేవాళ్లం. నాకంటూ ఉన్నది అమ్మా, నాన్న అంతే కదా. ఇప్పుడు వాళ్ళూ లేరు. ఆ దేవుడు నన్నెందుకింత కష్టపెడుతున్నాడు దీపక్?" సరయూ ఏడ్చే సింది.

"ఛీ.ఛీ.. అలాంటి మాటలు మాట్లాడకు సరయూ. కష్టం వచ్చిన ప్పుడే ఎదుర్కోవాలి"

"ఎన్ని కష్టాలు ఎదుర్కోను దీపక్? రవి నిన్ననే ఫోన్ చేశాడు. తనూ ఇక్కడే ఉన్నాడట. అమ్మా వాళ్ళు నన్ను అన్యాయం చేసినందుకు తనకు కనీసం కొంచెం కూడా జాలి కల్గలేదు నాపైన సరికదా 'మన పెళ్ళి తర్వాత మా వాళ్లిచ్చిన కట్నం చాలలేదని, మీ నాన్న ఇంట్లో సగ భాగం నాకు ఇస్తానన్నారు ఆ విషయం తేల్చుకోవడానికి నేను త్వరలో వస్తాను అక్కడికి. నాకు రావలసిన భాగం ఇవ్వకపోతే నీకు విడాకులు ఇవ్వను సరికదా సాత్వికను నాతో తీసుకెళ్లిపోతాను' అని బెదిరించాడు. అందుకే అనుకుంటున్నాను. దీనిని చంపేసి నేనూ చచ్చిపోతే సరిపో తుందని" అంది సరయూ.

"ఊరుకో సరయూ. ఏడాదిపాటు సాత్వికకు దూరంగా ఉండి తనను నీతో తెచ్చుకున్నది ఇప్పుడు చంపేయడానికా? ఇంతకీ విడాకుల సంగతి ముందు రవి మాట్లాడాడా నువ్వు అన్నావా?" అడిగాను నేను.

"ఎవరంటే ఏంటి దీపక్. నాకు కావలసినది అదే"అంది సరయూ.

"అయినా. నేను అడిగేంతలో తనే ముందు ఆ మాట మాట్లాడాడు" అంది.

"అలాగా అయితే విను. బహుశా రవి ఇక్కడ మళ్ళీ పెళ్ళి చేసుకో వడానికి వచ్చుంటాడు. అమెరికాలో పెళ్ళిళ్లకి మొదటి భార్య నుంచి విడాకులు అవీ అవసరం లేదు కనుక ఆ అమ్మాయిని చేసేసుకున్నాడు. కానీ ఈ దేశంలో నీకు విడాకులు ఇవ్వకుండా రవి మళ్ళీ పెళ్ళి చేసు కుంటే తర్వాత నువ్వు కోర్టుకెళ్ళే హక్కుంది. మొదటి భార్య ఉండగా వేరే పెళ్లి చేసుకున్నాడని రవిని జైల్లో వేయించగలిగే అవకాశం ఉంది. కనుక ఇలా మాట్లాడుతున్నాను. ఇంక ఎలాగూ నీతో విడిపోతున్నాడు. కనుక వచ్చేది ఏదైనా ఉంటే రాబట్టచ్చు అని అతని పథకం" అన్నాను నేను.

"ఛీ రవిని తల్చుకుంటే అసహ్యం వేస్తోంది నాకు. డబ్బు డబ్బు ఏం చేసుకుంటాడు?" ముఖం చిట్లించి అంది సరయూ.

"రవి ఒక్కడే కాదు సరయూ. ఈ డబ్బు పిచ్చి చాలామందికి ఉంటుంది. అంతెందుకు రవి మధ్యతరగతికి చెందినవాడు తనకి డబ్బు ఆశ ఉండడంలో ఆశ్చర్యం లేదు. కానీ చాలామంది కోటీశ్వరులు, మేధా వులు కూడా ఈ డబ్బు పిచ్చితో భార్యలను కట్నం గురించి వేధిస్తున్నా రంటే నువ్వు నమ్ముతావా? అసలా పిచ్చి ఉండనే కూడదు. ఉంటే సంపాదించిన కొద్దీ ఇంకా సంపాదించాలనే దురాశ పుడుతుంది. అందుకే మనిషికి తృప్తి అవసరం అంటారు. రవికి తృప్తి అన్నది అస్సలు లేదు కనుక ఇచ్చినకొద్దీ ఏదో వంకతో నీనుంచి డబ్బు లాగాలని చూస్తాడు. అందుకే తెలివిగా రవి పీడ వదిలించుకోవాలి నువ్వు" అన్నాను నేను.

"దీపక్ రవిని చూస్తే నాకు అసహ్యం, జుగుప్స. అతని బుద్ధులు తెల్సినదానివి. అతని వలన అన్ని కష్టాలు పడిన దానిని కనుక తనను చూస్తే నేనేం మాట్లాడలేనేమో అన్పిస్తోంది. ప్లీజ్ మీరుండి నాకు కొంచెం సహాయం చెయ్యరూ?" అడిగింది సరయూ.

"తప్పకుండా సరయూ. నేనే కాదు అమ్మానాన్న వస్తానన్నారు త్వరలో. రవిని నీనుంచి దూరంగా పంపించే బాధ్యత నాది. కానీ నువ్వు ఒకసారి ఆలోచించు సరయూ. సాత్వికకు రవి కన్న తండ్రి. ఇప్పుడు రవితో పూర్తిగా తెగతెంపులు చేసేసుకుంటావా. అలాగే నిర్ణ యించుకున్నావా?" అన్నాను నేను.

"వద్దు దీపక్. రేపు ఏమైనా కానీ. ఇప్పుడు కాదు కదా ఎప్పటికీ రవితో నేను కలవడం అన్నది జరగదు. తనదొక వింత మనస్తత్వం. తను ఒక శాడిస్టు"

అన్నట్లుగానే రవి వచ్చాడు.

వస్తూనే "ఏం చేశావు నేను చెప్పిన విషయం?" అని అడిగాడు.

"ఏంటి నువ్వు చెప్పిన విషయం? ఇల్లుసంగతా అందులో నీకు కొంచెం కూడా భాగం లేదు. అది సాత్వికకు చెందాలని నాన్న విల్లు రాశారు. సాత్విక పెరిగేవరకూ ఇంటి బాధ్యత నన్ను చూసుకోమని రాశారు. విడాకులు ఇస్తే ఇవ్వు లేకుంటే వచ్చిన దారినే వెళ్ళు" అంది సరయూ.

"అంతవరకూ వచ్చిందా? నీకు విడాకులు అప్పుడే ఇవ్వనిది అందుకే. నిన్ను తేలిగ్గా వదిలిపెట్టను పద నాతో" అన్నాడు రవి.

"ఏంటి? నేను వచ్చేది? ఎప్పుడైతే నీ ఇంట్లోంచి నన్ను బయటకు గెంటావో అప్పుడే మన బంధం తెగిపోయింది. మర్యాదగా వెళ్ళు" అంది సరయూ.

"నువ్వు రానంటే వెళ్ళిపోతాననుకుంటున్నావా? నిన్ను బలవం తంగా జుట్టుపట్టుకు మరీ లాక్కెళ్తాను. ఆ హక్కు నాకుంది" సరయూ



మీదకొచ్చాడు రవి.

నేను ఇంక తప్పదని మధ్యలోకి వచ్చి "రవీ నీకంత ఛాన్స్ లేదు. సరయూ ఒంటిపైన చేయి పడితే నువ్వు బ్రతికి ఉండవు. జాగ్రత్త" అన్నాను.

"ఏం అంత మొనగాడివా? అయినా నువ్వు దీనిని పెళ్ళి చేసుకున్నావా? లేక ఇంకేదైనా..."తప్పుగా మాట్లాడుతున్న రవిని ఆపలేక ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది సరయూ.

"అవును నేను సరయూని పెళ్ళిచేసుకుంటాను. నీచేత తనకు విడాకులు ఎలా ఇప్పించాలో నాకు తెలుసు. నేను నీకు ఆరోజు అందుకే డబ్బు చెక్కు రూపంలో ఇచ్చాను. నేను నీకు డబ్బిచ్చానని సాక్ష్యం నా దగ్గరుంది. మర్యాదగా నీ అంతట నువ్వే విడాకులు ఇస్తే సరేసరి. లేకుంటే నా దారిలో నేను నీచేత విడాకులు ఇప్పిస్తాను" అన్నాను కోపంగా.

రవికి పై పై మాటలే కానీ ధైర్యం లేదు. పైగా సరయూకి ఇంక ఆస్తేం మిగల్లేదని తెలుసు. అందుకే వేరే పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకున్నట్టున్నాడు.

"ఛీ ఛీ ఇలాంటి దానితో నాకేం పని. ఇలాంటిది నా భార్య అని చెప్పుకుంటే నాకే సిగ్గు. ఈక్షణంలో విడాకులకు అప్లై చేస్తాను" అని విసురుగా వెళ్ళిపోయాడు.

రవి బయటకు వెళ్లగానే అమ్మ, నాన్న వచ్చారు. సరయూ ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది అమ్మకి.

వెంటనే అమ్మ అంది "అందుకే అన్నాను సరయూ నువ్వు దీపక్‌ని పెళ్లి చేసుకో అని. ఈనాడు రవి అనే కాదు. ఒంటరిగా ఉండే ఆడపిల్లను చూస్తే చాలామంది మగవారు అవకాశం తీసుకోవాలని చూస్తారు" అని.

"లేదమ్మా. స్నేహితులుగా ఉన్నంతవరకేనమ్మా ఒకరికొకరు గౌరవ మర్యాదలు ఇచ్చుకోవడం, కష్టాల్లో ఆదుకోవడం. పెళ్ళి అనే బంధం పడగానే మనకు తెలీకుండానే ఇగోలు, పంతాలు, పట్టింపులు వచ్చి జీవితాలు పాడయిపోతాయి. ఇలాగే ఉంటే బాగుంటుంది" అన్నాను.

నాన్నా అన్నారు "మీది నిజంగా మంచి స్నేహమే కావచ్చు. కానీ రవి ఎన్ని మాటలు అనిపోయాడు మీ ఇద్దర్నీ. మీరు విదేశాలలో ఉండి వచ్చారు. కనుక ఆడ,మగా స్నేహం మీకు తప్పుగా అన్పించకపోవచ్చు.

కానీ ఇక్కడ వాళ్ళు ఈ వయసులోనే కాదు మీరు ముసలివాళ్లయ్యాక స్నేహంగా ఉన్నా తప్పుగా అర్థం చేసుకుంటారు. వీరి మనస్తత్వం అది. అయినా పెళ్ళి అంటే పట్టింపు లేని విదేశీయులు కూడా నీ వెంట ఒక ఆడపిల్లని అక్కడికి తీసుకెళ్లాలంటే మీ పెళ్ళి రిజిస్ట్రేషన్, మీ పెళ్ళి ఫోటో, ఆ అమ్మాయి నీ భార్య అని రుజువు ఇస్తే కానీ రానివ్వరు అన్నది తెలుసుగా. ఇంక పెళ్ళయ్యాక వచ్చే పంతాలు, పట్టింపులు విషయానికొస్తే భార్యభర్త ఒకరికొకరు అడుగులకు మడుగులొత్తి సేవలు చేసుకోకపోయినా, ఒకరినొకరు కించపర్చుకోకుండా కనీసగౌరవం ఇచ్చి పుచ్చుకుంటే చాలు. ఎదుటివారి అభిప్రాయాలకు విలువ ఇచ్చే లక్షణం లేకపోతే ఒక్క పెళ్ళే కాదు ఏ బంధం నిలవదు.

జీవితభాగస్వామి అంటే మన జీవితంలో సగం భాగం మాత్రమే తీసుకున్న వ్యక్తి అని అర్థం. అందుకే భార్యభర్తలు నేను గొప్ప, నేను గొప్ప అనుకోకుండా, సమానం మనం ఇద్దరం అనుకుంటే చాలు. ఆ మాత్రం సంస్కారం మీ ఇద్దరికీ ఉంది. పైగా ఇద్దరూ జీవితంలో దెబ్బ తిని ఉన్నారు. ఎదుటివారిని బాధపెట్టకుండా ఎలా ప్రవర్తించాలో మీకు బాగా తెలుసు. అందుకే మీ పెళ్ళి జరిగితే సుఖంగా, ఆనందంగా బ్రతకగలరు అని నా నమ్మకం" అని.

"అవునురా దీపూ. ఒకసారి ఆ దేవుడు మీ ఇద్దరికీ అన్యాయం చేశాడని ప్రతీసారీ అలాగే చేస్తాడనీ అనుకుంటే ఎలా? జీవితంలో ప్రతీ వ్యక్తికి తోడుండాలి. స్నేహితుల వల్లనో, పిల్లల వల్లనో తల్లిదండ్రులు వల్లనో, మనకు కావాల్సిన తోడు, నీడ లభిస్తాయి" అంది అమ్మ.

"నీ అభిప్రాయం కూడా చెప్పు సరయూ" నాన్న అడిగేసరికి సరయూ ఏమీ అనకుండా లోపలికెళ్ళిపోయింది.

నేను గబగబా తన వెంట లోపలికెళ్ళి "సారీ సరయూ, అమ్మా,నాన్న పెద్దవారు. మన మంచి కోసం చెప్తున్నామనుకున్నారు కానీ నిన్ను బాధపెట్టినట్లున్నారు. పెళ్ళి విషయం నీకిష్టం లేకుంటే వద్దు. ఇక సాత్విక విషయంలో నా గురించి నీకేదైనా అనుమానం ఉన్నా వద్దు" అని బయటకు వచ్చేస్తుంటే సరయూ నా చేయి పట్టుకుని-

"దీపక్ సాత్విక విషయంలోనే కాదు ఏ విషయంలోనూ మీ ప్రవర్తనపై నాకు అనుమానం లేదు. నాకు జీవితంలో ప్రతీ క్షణం మీతోడు కావాలి" అంది.

సరయూతో కలిసి జీవితం అంటే ఏంటో రుచి చూశాకనే అందులో మాధుర్యం నాకు తెలిసింది.

మనుషులకే కాదు జంతువులకు, పక్షులకూ ప్రపంచంలో అన్ని జీవులకూ తమ కష్టాలే కాదు సుఖాలు కూడా పంచుకోవాలంటే జీవిత భాగస్వామి ఎంతో అవసరం అన్పించింది.

ఎక్కడో రవి లాంటి శాడిస్టులు, రేఖ లాంటి స్వార్థపరులు ఈ విషయం తెల్సుకోలేరు. అంతేకాదు పెళ్లంటే ఆడపిల్లకే అవసరం అనే అభిప్రాయాలతో కట్నాలు, కానుకలు అంటూ ఎంతోమంది ఆడపిల్లల జీవితాలు నిలువునా నాశనం చేస్తున్నారు. ఈ విషయంలో మనుషులకన్నా వేరే జాతులే నయం అన్పిస్తుంది.

అవి నువ్వు గొప్ప, నేను గొప్ప. ఆడదానివి నువ్వే ఎక్కువ చేయాలి అని అనకుండా ఆడజాతులతో సమానంగా మగవీ కష్టపడి తమ సంతానాన్ని వృద్ధి చేసుకుని సుఖంగా బ్రతుకుతాయి. మనుషుల్లో ఈ మార్పు తన జీవిత భాగస్వామికి విలువ, గౌరవం ఇచ్చి తమతో సమానంగా చూసుకునే మార్పు బహుశా ఇప్పట్లో రాదే. అలా మార్పొస్తే ఈ వరకట్న చావులు, అక్రమ సంబంధాలు, దురాశతో డబ్బు కోసం కట్టుకున్న భర్తని చంపేసే భార్యలు ఇవన్నీ ఉండవు.

కానీ అంత మంచిరోజులు వచ్చేదెప్పుడు? యువత డబ్బుని కాకుండా మనిషి విలువను గుర్తించడం అలవాటు చేసుకుంటే ఇప్పుడు కాకున్నా కొన్ని సంవత్సరాల తర్వాత అయినా ఈ మార్పు రావచ్చు.

**(అయిపోయింది)**

Printed and Published by O.THOMAS on behalf of Deccan Chronicle Holdings Ltd, at Deccan Chronicle Press, 36, Sarojini Devi Road, Secunderabad-500003, Editor: T.VENKATRAM REDDY, Phone: 27802346.